సత్యమేవ జయతే

# సాక్షి


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 334

సోమవారం 24-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**ధీమానిస్తుందా?**

చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్ల గురించి ఆకర్షణీయమైన అంశాలు - ప్రాఫిట్ ప్లస్‌లో




**ఇక కష్టమే!**

న్యూజిలాండ్‌తో రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడిన భారత్ - స్పోర్ట్స్‌లో

● రాష్ట్రపతి కితాబు

### న్యాయవ్యవస్థ కృషి అమోఘం




లింగపరమైన న్యాయం అనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని సాధించేందుకు భారత న్యాయవ్యవస్థ చేసిన కృషి అమోఘమని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఎల్లప్పుడూ సానుకూల, ప్రగతిశీల దృక్పథంతోనే పనిచేసిందని కొనియాడారు.

- 14లో

● మన్ కీ బాత్

### మానవాళికి నిధి



భారతదేశంలోని జీవ వైవిధ్యం ప్రపంచ మానవాళికి ఒక విశిష్టమైన నిధిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఆయన ఆదివారం రేడియోలో 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

- 14లో

● అంచనాలు అందుకోలేదు..

### పన్నేతర రాబడి అంతంతే



రాష్ట్రంలో పన్నేతర రాబడుల అంచనాలు వాస్తవ రూపం దాల్చడం లేదు. వివిధ వస్తువుల వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులే కాకుండా, ఇతర రూపాల్లో లభించాల్సిన పన్నేతర ఆదాయంలో పురోగతి కనిపించడం లేదని గణాంకాలు చెబుతున్నాయి.

- 4లో

● ఆడ శిశువులు

### తగ్గిపోతున్నారు!



రాష్ట్రంలో ఆడపిల్లల సంఖ్య తగ్గుతోంది. గత ఆర్థిక సంవత్సరం కంటే, ఈ ఆర్థిక సంవత్సరం (ఇప్పటివరకు)లో తేడా కనిపిస్తోంది. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని హెచ్‌ఎంఐఎస్ ఈ నెల దేశ వ్యాప్తంగా మగ, ఆడ శిశువుల నిష్పత్తిని ప్రకటించింది.

- 4లో



## పసిడి పరుగు @ 44,430

- హైదరాబాద్‌లో భారీగా పెరిగిన 24 క్యారట్ల బంగారం ధర
- వారం వ్యవధిలో ఏకంగా రూ. 1,790 పెరుగుదల
- గ్రాముకు 4,073 పలికిన 22 క్యారట్ల పసిడి
- కోవిడ్ వైరస్ ప్రభావంతో పెట్టుబడిదారుల భారీ కొనుగోళ్ల వల్లే ధరల పరుగు!
- డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోవడమూ కారణమే

సాక్షి, హైదరాబాద్

కొద్ది రోజులుగా రాకెట్‌లా దూసుకెళ్తున్న పుత్తడి ధర ఆదివారం సరికొత్త రికార్డు సృష్టించింది. మేలిమి బంగారం (24 క్యారట్లు) ధర హైదరాబాద్ మార్కెట్‌లో రూ. 44 వేలు దాటింది. ఆదివారం జరిపిన విక్రయాల్లో 24 క్యారట్ల బంగారం ధర గ్రాముకు రూ. 4,443 చొప్పున ధర పలికింది. అంటే 10 గ్రాములకు రూ. 44,430 ధర పలికిందన్నమాట. అదే ఆభరణాలకు ఉపయోగించే 22 క్యారట్ల బంగారం గ్రాముకు రూ. 4,073 ధర పలికినట్లు బులియన్ మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. గత వారం రోజుల్లో హైదరా బాద్ మార్కెట్‌లో మేలిమి బంగారం ధర పది గ్రాములకు రూ. 1,790 పెరిగింది. ఈ నెల 17న రూ. 42,640 ధర పలకగా 23న రూ. 44,430కి చేరింది. ఇక 22 క్యారట్ల బంగారం రూ. 1,580 మేర పెరిగింది. కోవిడ్ వైరస్ వ్యాప్తి వల్ల వాణిజ్య రంగంలో నెలకొన్న ఒడిదుడుకులను తట్టుకొనేందుకు పెట్టుబడిదారులు బంగారం కొనుగోలు వైపు మొగ్గుచూపడంతోపాటు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోతుండటం బంగారం ధరలు అమాంతం పెరగడానికి కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రూపాయి ధర పతనమైన కొద్దీ బంగారం దిగుమతి ధర పెరుగుతుందని, దీంతో ధరలు పెంచక తప్పదని పేర్కొంటున్నారు.




# వెల్‌కం ట్రంప్

## నేటి నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత పర్యటన

**నేరుగా అహ్మదాబాద్‌కు ; అక్కడ ట్రంప్‌నకు స్వాగతం పలకనున్న ప్రధాని మోదీ**

**అహ్మదాబాద్‌లో 22 కి.మీ.ల మేర రోడ్ షోలో పాల్గొననున్న ఇరువురు నేతలు**

**అనంతరం మొటెరా స్టేడియంలో 'నమస్తే ట్రంప్' కార్యక్రమం**

**రేపు ఢిల్లీలో ఇరుదేశాల ప్రతినిధుల స్థాయి చర్చలు**

న్యూఢిల్లీ/అహ్మదాబాద్

అగ్రరాజ్య అధ్యక్షుడి ఆగమనానికి సర్వం సిద్ధమైంది. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ తొలి భారత పర్యటన నేటి నుంచి ప్రారంభం కానుంది. కుటుంబంతో సహా ట్రంప్ గుజరాత్‌లోని అహ్మదా బాద్‌లో నేటి మధ్యాహ్నం అడుగిడనున్నారు. దేశ రాజధానికి కాకుండా.. నేరుగా ఒక రాష్ట్రంలోని ప్రధాన నగరానికి అమెరికా అధ్యక్షుడు వస్తుండటం ఒక విశేషమైతే.. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా దేశ రాజధానిలో కాకుండా మరో నగరానికి వెళ్లి మరీ భారత ప్రధాని ఆయనకు స్వాగతం పలుకుతుండటం మరో విశేషం.

భారత పర్యటనలో భాగంగా సోమవారం మధ్యాహ్నం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అహ్మదాబాద్ వస్తున్నారు. ఆయనతో పాటు అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్, ట్రంప్ కూతురు, అధ్యక్షుడి సీనియర్ సలహాదారు ఇవాంకా ట్రంప్, ఆమె భర్త జారెడ్ కుష్నర్ కూడా భారత్ వస్తున్నారు. కీలక అంశాల్లో భారత్‌తో జరిగే చర్చల్లో పాలు పంచుకునేందుకు మంత్రులు, ఉన్నతాధికారులతో కూడిన ఉన్నత స్థాయి బృందం కూడా ఇండియా వస్తోంది.

**36 గంటలు.. ముఖ్యమైన కార్యక్రమాలు**

భారత్‌లో తొలుత ట్రంప్ దంపతులు ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి అహ్మదాబాద్‌లో రోడ్ షోలో పాల్గొంటారు. ఎయిర్‌పోర్ట్ నుంచి వారు నేరుగా ఈ రోడ్ షోలో పాలుపంచుకుంటారు. దాదాపు 22 కిమీల దూరం ఈ రోడ్ షో జరుగుతుంది. వేలాది మంది ఈ రోడ్ షోలో ట్రంప్‌నకు స్వాగతం పలుకుతారు. రోడ్ షో పొడవునా 28 వేదికలను ఏర్పాటు చేసి, భారతీయ కళారూపాలను కళాకారులు ప్రదర్శిస్తారు. అనంతరం, కొత్తగా నిర్మించిన మొటెరా క్రికెట్ స్టేడియంలో 'నమస్తే ట్రంప్'కార్యక్రమం ఉంటుంది. ట్రంప్‌నకు స్వాగతం పలుకుతూ జరుగుతున్న ఈ కార్యక్రమంలో బాలీవుడ్ సింగర్ కైలాశ్ ఖేర్ నేతృత్వంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమంతో పాటు భారతీయత ఉట్టిపడే పలు ఇతర కార్యక్రమాలుంటాయి. గత ఏడాది మోదీ అమెరికా వెళ్లినప్పుడు.. హ్యూస్టన్‌లో అక్కడి భారతీయులు ఏర్పాటు చేసిన హౌడీ మోదీ'కార్యక్రమం తరహాలో ఈ 'నమస్తే ట్రంప్'ఉంటుంది. ఆ కార్యక్రమం

మిగతా 2వ పేజీలో ▶

**ట్రంప్ షెడ్యూల్..**

**నేడు - ఉదయం**

11:40.. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోనున్న ట్రంప్

**మధ్యాహ్నం**

12:15.. ట్రంప్, మోదీలు కలసి సబర్మతీ ఆశ్రమానికి..

01:05.. మొటెరా స్టేడియంలో నమస్తే ట్రంప్ కార్యక్రమం

03:30.. ఆగ్రాకు ప్రయాణం

04:45.. ఆగ్రాకు చేరుకుంటారు

**సాయంత్రం**

05:15.. తాజ్‌మహల్ సందర్శన

07:30.. ఢిల్లీకి చేరుకుంటారు

**రేపు - ఉదయం**

10:00.. రాష్ట్రపతి భవన్ వద్ద ట్రంప్‌కు ఆహ్వాన కార్యక్రమం

10:30.. రాజ్‌ఘాట్‌లోని గాంధీ సమాధి వద్ద నివాళులు

11:00.. హైదరాబాద్ హౌస్ వద్ద మోదీతో భేటీ

**మధ్యాహ్నం**

12:40.. పలు ఒప్పందాలు, మీడియా ప్రకటన

**రాత్రి**

07:30.. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో భేటీ

10:00.. అమెరికాకు తిరుగు ప్రయాణం

**ఐటీసీ మౌర్య విలాస స్వర్గం**

ట్రంప్ కోసం భారీ ఏర్పాట్లు

**కట్టుదిట్టమైన భద్రత**

- 5లో

# ఇంజనీరింగ్ విద్యకు కొత్త రూపు..

## ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా మార్పులు

**రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల్లో మోడల్ కరిక్యులమ్..**

**ఇక నుంచి అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు**

**గతేడాదే రూపొందించిన ఏఐసీటీఈ.. పరీక్ష విధానంలోనూ మార్పులు**

**అవగాహన, విశ్లేషణ, అప్లయింగ్‌కు ప్రాధాన్యం**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోనూ ఇంజనీరింగ్ విద్య స్వరూపం పూర్తిగా మారబోతోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా రూపొందించిన మోడల్ కరిక్యులమ్ అమల్లోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతేడాది ఐదారు కాలేజీలకే పరిమితమైన, సంస్కరణలతో కూడిన రీ ఇంజనీరింగ్ విద్య 2020–21 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల్లో అమల్లోకి రాబోతోంది. పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తూ, ఉపాధి అవకాశాలు అత్యధికంగా ఉన్న కోర్సులను, అందుకు అనుగుణంగా మార్పు చేసిన విద్యా విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జేఎన్‌టీయూ, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు తమ పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో బీటెక్ విద్యలో సంస్కరణలను 2020–21 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి తేనున్నాయి. అంతేకాదు ఇప్పటివరకు కొనసా గుతున్న సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సులే కాకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా భవిష్యత్‌లో డిమాండున్న కోర్సులు రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల్లో అమల్లోకి రానున్నాయి.

**సామర్థ్యాల పెంపే లక్ష్యంగా**

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపు, పరిశోధన, ఆవిష్కరణల వైపు ప్రోత్సహించడమే లక్ష్యంగా అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీ ఈ) ఇంజనీరింగ్ విద్యలో సంస్కరణలను ప్రవేశపెట్టింది. అందులో భాగంగా

మిగతా2వ పేజీలో ▶

# నేటి నుంచి పట్టణ ప్రగతి

- పారిశుద్ధ్యం, పచ్చదనమే ప్రధాన ఉద్దేశం
- కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్
- సీఎం స్వయంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించే అవకాశం
- ఎమ్మెల్యేలు, చైర్‌పర్సన్లు, కమిషనర్ల పనితీరుకు పరీక్ష

2లో



# వారంలో మేడిగడ్డ ఖాళీ?

- బ్యారేజీలోని నీటిని దిగువకు పంపాలని నిర్ణయించిన ప్రభుత్వం
- ఇప్పటికే 4 టీఎంసీల మేర దిగువకు పంపింగ్.. మరో 10 టీఎంసీలు పంపింగ్ చేసేలా ఏర్పాట్లు
- ఇసుక లభ్యతను పెంచే దిశగా చర్యలంటున్న అధికార వర్గాలు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోస్తున్న ప్రభుత్వం మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీని వారంలో పూర్తిగా ఖాళీ చేయాలని నిర్ణయించింది. దిగువ బ్యారేజీలు, రిజర్వాయర్లలో నీటి లభ్యతను పెంచుతూ, మేడిగడ్డలో అవసరమైన మరమ్మతులు, ఇతర సాంకేతిక అంశాల పరిశీలనకు వీలుగా నీటినంతా దిగువకు పంపింగ్ చేయనుంది. ఇప్పటికే మేడిగడ్డ నుంచి నాలుగు టీఎంసీల మేర నీటిని పంపింగ్ చేయగా, ఆదివారం సైతం ఏడు పంపుల ద్వారా ఎత్తిపోతల ప్రక్రియ కొనసాగింది. ఈ నీరంతా దిగువ అన్నారం (సరస్వతి), అటునుంచి సుందిళ్ల (పార్వతి) మీదుగా ఎల్లంపల్లికి చేరుతోంది.

**అనుకున్న దానికన్నా ముందుగానే..**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో నీటినంతా ఏప్రిల్‌లో ఖాళీ చేయాలని ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. అయితే ప్రస్తుతం కాస్త ముందుగానే ఖాళీ చేయనున్నారు. రాష్ట్రంలో ఇసుక అవసరాలు పెరగడం, లభ్యత తగ్గిన నేపథ్యంలోనే మేడిగడ్డ బ్యారేజీని ఖాళీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చర్చ జరుగుతోంది. ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీ నుంచి మొత్తం సీజన్‌లో 45 టీఎంసీల నీటిని దిగువకు ఎత్తిపోయగా, ఈ వారం రోజుల నుంచి నాలుగు టీఎంసీల

మిగతా 2వ పేజీలో ▶






ఇదం జగత్



అదే పనిలో ఉన్నాను డియర్ ట్రంప్!!




# వారం రోజుల్లో అనుబంధ మార్గదర్శకాలు

- జస్టిస్ ధర్మాధికారి కమిషన్ వెల్లడి
- విద్యుత్తు ఉద్యోగుల విభజనపై విచారణ పూర్తి

**సాక్షి, న్యూఢిల్లీ:** ఏపీ, తెలంగాణ విద్యుత్తు ఉద్యోగుల విభజనకు సంబంధించి వారం రోజుల్లో అనుబంధ (సప్లిమెంటరీ) మార్గదర్శకాలు జారీ చేస్తామని జస్టిస్ ధర్మాధికారి ప్రకటించారు. విద్యుత్ ఉద్యోగులను ఇరు రాష్ట్రాలకు కేటాయించే వివాదంపై తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ వర్సెస్ ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ కేసులో జనవరి 24న సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు జస్టిస్ ధర్మాధికారి కమిషన్ ఆదివారం ఇక్కడ సుదీర్ఘంగా ఆయా పక్షాల వాదనలు విన్నది. కేసులో ఉన్న అత్యవసర పరిస్థితుల దృష్ట్యా అవసరమైన అనుబంధ మార్గదర్శకాలు జారీచేసేందుకు వీలుగా విచారణను ముగించినట్టు జస్టిస్ ధర్మాధికారి సమావేశం అనంతరం మీడియాకు వెల్లడించారు. వారం రోజుల్లో అనుబంధ మార్గదర్శకాలు జారీచేస్తామని, అన్ని భాగస్వామ్య పక్షాల వాదనలు విన్నామని, ఇదే తుది సమావేశమని వివరించారు. 1,157 మంది ఉద్యోగుల విభజనకు సంబంధించి 655 మందిని ఆంధ్రప్రదేశ్‌కు, 502 మందిని తెలంగాణకు కేటాయిస్తూ కమిషన్ గతంలో నివేదిక ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ ఏపీ విద్యుత్ సంస్థలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తిరిగి ఆదివారం అన్ని పక్షాల వాదనలు కమిషన్ విన్నది. ఇరు పక్షాలు రాతపూర్వక వాదనలు కూడా సమర్పించాయి. తెలంగాణ ప్రభుత్వం తరపున ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా, తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావు, టీఎస్ ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు తదితరులు హాజరయ్యారు. ఏపీ నుంచి ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కేవీఎన్ చక్రధరబాబు, ఏపీ జెన్‌కో ఎండీ బి.శ్రీధర్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ నాగలక్ష్మి, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ హరనాథరావు హాజరయ్యారు.

# వీణావాణిలకు వేర్వేరుగా హాల్‌టికెట్లు


- టెన్త్ పరీక్షలకు హాజరు కానున్న అవిభక్త కవలలు

**సాక్షి, హైదరాబాద్:** అవిభక్త కవలలు వీణావాణిలు టెన్త్ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. తెలంగాణలో మార్చి 19 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనుండగా, హైదరాబాద్ జిల్లా నుంచి 75 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో వీణావాణి కూడా ఉన్నారు. పుట్టుకతోనే రెండు తలలు అతుక్కుని జన్మించిన వీణావాణిలు 2016 వరకు నిలోఫర్ ఆస్పత్రిలో ఉన్నారు. అక్కడే ప్రత్యేక ఉపాధ్యాయుల పర్యవేక్షణలో 7వ తరగతి వరకు చదివారు. 2017 జనవరిలో స్టేట్‌హోంకు తరలించగా.. మహిళా శిశుసంక్షేమ శాఖ 2018 విద్యా సంవత్సరంలో వీరికి వెంగళరావు నగర్ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ కల్పించింది. వీరికి వేర్వేరు అడ్మిషన్ నంబర్లు (5618, 5619) ఇచ్చారు. ఇక్కడ ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్నారు. ఇటీవల వీరు ఎస్ఎస్‌సీ బోర్డుకు దరఖాస్తు చేసుకోగా, ఇద్దరికీ కలిపి ఒకే హాల్‌టికెట్ ఇవ్వాలా? వేర్వేరుగా ఇవ్వాలా? అనే దానిపై బోర్డు అధికారులు మల్లగుల్లాలు పడ్డారు. పరీక్షరాసే అర్హత, సామర్థ్యాలు వారికి ఉన్నట్లు నిర్ధారించి, ఇద్దరికీ వేర్వేరుగా హాల్‌టికెట్లు జారీ చేయాలని నిర్ణయించారు. మార్చి మొదటి వారంలో వారికి హాల్‌టికెట్లు అందజేసే అవకాశం ఉంది. వీణావాణిలు స్వయంగా పరీక్ష రాసే అవకాశం లేదు. కాబట్టి వీరు కోరితే ఇద్దరికీ స్క్రైబ్‌లను ఏర్పాటు చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకటనర్సమ్మ తెలిపారు.



# ట్రంప్ పర్యటనను వ్యతిరేకిస్తున్నాం

## సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



**పాత మంచిర్యాల:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్ పర్యటనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దీనికి నిరసనగా వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సీపీఐ రాష్ట్ర నిర్మాణ మహాసభలు రెండో రోజు ఆదివారం జరిగాయి. ఆయన మాట్లాడుతూ.. అమెరికా రాజకీయ, ఆర్థిక సంక్షోభంలో ఉందని, ఆ భారాన్ని ఇతర దేశాలపై మోపడానికి ట్రంప్ భారత పర్యటనకు వస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ట్రంప్ పర్యటన సందర్భంగా ఆహ్వానం పంపారని, ఒకవేళ ఆయన వెళ్తే ఎన్నార్సీకి వ్యతిరేకంగా చేసిన తీర్మానాలకు అర్థం లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజులు పొడి వాతావరణం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో రానున్న మూడ్రోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గత 24 గంటల్లో రంగారెడ్డి జిల్లా తాళ్లపల్లి, మంగళపల్లి, చందనవల్లి, నాగర్ కర్నూలు జిల్లా కొండరెడ్డిపల్లి, మేడ్చల్ జిల్లా మౌలాలీల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల చొప్పున నమోదయ్యాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

# కాళోజీ వర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోస్టుకు రేపు పరీక్ష

**సాక్షి, హైదరాబాద్:** వరంగల్‌లోని కాళోజీ వర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోస్టు కోసం ఈ నెల 25న నిర్వహించనున్న పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. దరఖాస్తు దారులంతా టీఎస్‌పీఎస్సీ వెబ్ సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఉదయం 9.30 గంటల కల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొంది.

# వారంలో మేడిగడ్డ ఖాళీ?

▶ మొదటి పేజీ తరువాయి

నీటిని ఎత్తిపోశారు. బ్యారేజీలో 16.12 టీఎంసీ లకుగానూ ప్రస్తుతం 10 టీఎంసీల మేర నీటి లభ్యత ఉండగా, కొన్నిరోజుల్లో నీటిని పూర్తిగా ఖాళీ చేయనున్నారు. ఆదివారం సైతం 7 మోటార్ల ద్వారా 15 వేల క్యూసెక్కుల మేర నీటిని దిగువ అన్నారం తరలించారు. ఇదే రీతిని పంపింగ్ కొనసాగిస్తే వారంలో మేడిగడ్డ ఖాళీ కానుంది. ఇక్కడ కనీసంగా కోటి క్యూబిక్ మీటర్ల మేర ఇసుక లభ్యత ఉంటుందని అంచనా. ఇప్పుడు ఖాళీ చేస్తేనే మార్చి నుంచి జూన్ ఆరంభం వరకు 3 నెలల పాటు ఇసుకను తరలించవచ్చనే ప్రణాళికతో ప్రభుత్వం ఉందని అధికారులు చెబుతున్నారు. ఖాళీ చేసిన అనంతరం బ్యారేజీని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయనున్నారు. ఇక ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహాలతో అన్నారంలో లభ్యత పెరగడంతో అక్కడ 10.87 టీఎంసీ లకు గానూ 10 టీఎంసీల మేర నీటి లభ్యత ఉంది. దీంతో ఇక్కడి పంప్ హౌస్‌లోని 8 మోటార్లతో నీటిని సుందిళ్లకు తరలిస్తున్నారు. సుందిళ్ల నుంచి మరో 4 పంపుల ద్వారా నీటిని ఎల్లంపల్లి చేరుస్తున్నారు. ఎల్లంపల్లిలో ప్రస్తు తం 20.18 టీఎంసీలకు గానూ 8.30 టీఎం సీల నీటి లభ్యత ఉంది. మేడిగడ్డ బ్యారేజీని ఖాళీ చేసిన అనంతరం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సైతం ఖాళీ చేయనున్నారు. ఈ నీటితో ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, లోయర్ మానేరులో నిల్వలను పెంచనున్నారు. అనం తరం వీలునుబట్టి నీటిని పునరుజ్జీవం ద్వారా ఎస్సారెస్పీకి పంపనున్నారు.



## రవివర్మ అందాలు.. కొంగులకు అందాయి!

ప్రఖ్యాత చిత్రకారుడు రవివర్మ కుంచె నుంచి జాలువారిన అందాలు చీరల కొంగులకు అందాయి. నగరానికి చెందిన డిజైనర్ గౌరంగ్ షా గాంధీ ఈ చీరలను డిజైన్ చేశారు. బంజారాహిల్స్‌లోని సప్తపర్ణిలో ఈ చీరలను సోమవారం నుంచి ప్రదర్శించనున్నారు. ఈ చీరల డిజైనింగ్ ప్రక్రియలో రాజా రవివర్మ ఫౌండేషన్ కూడా పాలుపంచుకుంది.

\- సాక్షి, హైదరాబాద్

# 68 ఇంటర్ కాలేజీలకు నోటీసులు

సాక్షి, హైదరాబాద్

అగ్నిమాపక శాఖ అనుమతి లేకుండా కాలేజీలు ప్రారంభించి, తరగతులు నిర్వహిస్తున్న 68 కాలేజీలకు నోటీసులు జారీ చేసినట్లు ఇంటర్ బోర్డు ఓ ప్రకటన విడుదల చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి పేరిట ఇచ్చిన ఈ నోటీసుల్లో మూడు రోజుల్లోగా సంబంధిత కాలేజీల యాజమాన్యాలు వారి అఫిలియేషన్ దరఖాస్తులు ఎందుకు తిరస్కరించకూడదో వివరణ ఇవ్వాలని సూచించింది. వచ్చే విద్యాసంవత్సరానికి 1,476 కాలేజీలకు అఫిలియేషన్ మంజూరు చేశామని, నోటీసులు జారీచేసిన కాలేజీలు మాత్రం అఫిలియేషన్ ఇవ్వకుండానే కాలేజీలను ప్రారంభించి విద్యార్థులను చేర్చుకున్నాయని ఆ ప్రకటనలో తెలిపింది. కాలేజీల యాజమాన్యాలు స్పందించకపోతే ఈనెల 25వ తేదీలోపు తాము చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇంటర్ బోర్డు నోటీసులు జారీ చేసిన వాటిలో శ్రీచైతన్య, నారాయణ, శ్రీగాయత్రి, ఎన్ఆర్ఐ కాలేజీలకు చెందిన పలు బ్రాంచ్‌లతో పాటు 11 ఇతర కాలేజీలున్నాయి.

# నేటి నుంచి పట్టణ ప్రగతి

- పారిశుద్ధ్యం, పచ్చదనమే ప్రధాన ఉద్దేశం
- కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్
- సీఎం స్వయంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించే అవకాశం
- ఎమ్మెల్యేలు, చైర్‌పర్సన్లు, కమిషనర్ల పనితీరుకు పరీక్ష

**సాక్షి, హైదరాబాద్:** పాలనా సంస్కరణల్లో భాగంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నేటి నుంచి మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారు. సోమవారం (24వ తేదీ) నుంచి మార్చి 4 వరకు రాష్ట్రవ్యాప్తంగా తొలి విడత పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నారు. పట్టణ పారిశుద్ధ్యం, పచ్చదనమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కేసీఆర్ ప్రకటించారు. పల్లె ప్రగతి తరహాలోనే పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ఆయన అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. కొత్తగా జిల్లా అదనపు కలెక్టర్లగా (స్థానిక సంస్థలు) నియమితులైన అధికారులు పూర్తిగా ఈ కార్యక్రమంపైనే దృష్టి కేంద్రీకరించనున్నారు. పట్టణ ప్రగతిలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టణ ప్రాంతాల్లో పాదయాత్రలు నిర్వహించి అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను రానున్న 10 రోజుల్లోగా పూర్తి చేయనున్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఎక్కువగా ఉండే ప్రాంతాలపై దృష్టి పెట్టనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వార్డుల వారీగా పట్టణ ప్రగతి ప్రణాళిక తయారు చేసుకుని దానికి అనుగుణంగా పనులు చేయనున్నారు. మూడు నెలల్లో అన్ని పట్టణాలు, నగరాల్లో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేయాలని, ఎనిమిది నెలల్లో కరెంటు సంబంధింత సమస్యలన్నీ పరిష్కారం కావాలని సీఎం కేసీఆర్ టార్గెట్ నిర్దేశించారు. విఫలమైతే చైర్‌పర్సన్‌లు, మేయర్లు, చైర్‌పర్సన్లు, కమిషనర్లు తమ పదవులను కోల్పోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పట్టణ ప్రగతి అమలు తీరును పరిశీలించేందుకు కేసీఆర్ స్వయంగా క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించే అవకాశముంది. సీనియర్ అధికారులతో రూపొందించిన ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను రంగంలోకి దింపి తనిఖీలు నిర్వహిస్తామని ఆయన ఇప్పటికే ప్రకటించారు.



### ప్రగతి ప్రణాళిక..

కౌన్సిలర్/కార్పొరేటర్ల సమన్వయంతో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు వార్డుల వారీగా ప్రణాళికలు రూపొందించనున్నారు. వార్డుల వారీగా నియామకమైన ప్రజాసంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. ప్రతీ వార్డుకు శాశ్వత ప్రాతిపదికన ప్రత్యేకాధికారి పనిచేయనున్నారు. పారిశుద్ధ్యం, రక్షిత తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రహదారులపై గుంతల మరమ్మతులకు సంబంధించిన పనులను తక్షణమే చేపట్టనున్నారు. పట్టణ ప్రగతి కింద తక్షణమే చేయాల్సిన పనులకు కలెక్టర్, మేయర్/చైర్‌పర్సన్ నుంచి అనుమతి పొంది మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా నిర్వహించాలని పురపాలక శాఖ డైరెక్టర్ సత్యనారాయణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వార్డుల వారీగా ప్రతి పురపాలికలో యువజన, మహిళా, వయోజనులు, ప్రముఖుల కమిటీలను ఏర్పాటు చేయాలని మరో ఉత్తర్వులో పేర్కొన్నారు.

### దీర్ఘకాలిక ప్రణాళికలు..

పట్టణ ప్రగతి దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా ప్రతి పట్టణంలో దహన వాటికలు/ఖనన వాటికలు, పట్టణ జనాభాకు తగినట్లు పరిశుభ్రమైన వెజ్, నాన్ వెజ్, పండ్లు, పూల మార్కెట్లు, ఓపెన్ జిమ్, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయనున్నారు. వీధి వ్యాపారుల కోసం అన్ని పట్టణాల్లో స్ట్రీట్ వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేయనున్నారు. వంగిన, తుప్పు పట్టిన స్థంభాలు, రోడ్డు మధ్యలోని స్థంభాలు, ఫుట్‌పాత్‌లపై ఉండే ట్రాన్స్‌ఫార్మర్లను పట్టణ ప్రగతిలో భాగంగా మార్చనున్నారు. ఇళ్లపై వేలాడే వైర్లను సరిచేయనున్నారు. ఎనిమిది నెలల్లో కరెంటు సంబంధిత సమస్యలన్నింటినీ పరిష్కరించాలని సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు.

### పట్టణ ప్రగతిని విజయవంతం చేయాలి: కేటీఆర్

పట్టణ రూపురేఖలు మార్చాలనే లక్ష్యంతో చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు పిలుపునిచ్చారు. పట్టణ ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తీసుకు రావడమే ఈ కార్యక్రమం లక్ష్యం అన్నారు. పట్టణ ప్రగతి విజయవంతం కావడానికి పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. ప్రతి వార్డులో పౌరులతో కమిటీలు ఏర్పాటు చేసి కనీసం మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు. కాగా, మహబూబ్‌నగర్ పట్టణంలో సోమవారం జరిగే పట్టణ ప్రగతి కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొనున్నారని ఆయన కార్యాలయం తెలిపింది.

# వెల్‌కం ట్రంప్

▶ మొదటి పేజీ తరువాయి

తరువాత ట్రంప్ దంపతులు ఆగ్రా వెళ్లి, ప్రఖ్యాత ప్రేమ చిహ్నం తాజ్‌మహల్‌ను సందర్శిస్తారు. అక్కడ దాదాపు ఒక గంట పాటు గడుపుతారు. ట్రంప్ పర్యటన సందర్భంగా ఆగ్రాను, తాజ్ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అక్కడి నుంచి ట్రంప్ దంపతులు నేరుగా ఢిల్లీ వెళ్లి హోటల్ మౌర్య షెరాటన్‌లో సేద తీరుతారు. మంగళవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో అమెరికా అధ్యక్షుడికి అధికారిక స్వాగత కార్యక్రమం ఉంటుంది. ఆ తరువాత రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్ముడికి నివాళులర్పిస్తారు. అనంతరం, హైదరాబాద్ హౌజ్‌లో ఇరుదేశాల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చల్లో ప్రధాని మోదీతో కలిసి పాలుపంచుకుంటారు. ఆ తరువాత, అమెరికా అధ్యక్షుడు, తన స్నేహితుడు ట్రంప్ గౌరవార్థం ప్రధాని మోదీ ఏర్పాటు చేసిన విందు కార్యక్రమం ఉంటుంది. అనంతరం, యూఎస్ ఎంబసీలో పలు ప్రైవేటు కార్యక్రమాల్లో ట్రంప్ పాల్గొంటారు. వాటిలో ప్రముఖ భారత పారిశ్రామిక వేత్తలతో ప్రత్యేక భేటీ కూడా ఉంటుంది. మంగళవారం సాయంత్రం భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ట్రంప్ కలుస్తారు. అక్కడ విందు కార్యక్రమంలో పాల్గొని, అమెరికాకు పయనమవుతారు. దాదాపు 36 గంటల పాటు ట్రంప్ భారత్‌లో గడపనున్నారు.

### చర్చల్లో కీలకం

ట్రంప్ పర్యటన భారత్, అమెరికాల ద్వైపాక్షిక సంబంధాలను మేలిమలుపు తిప్పనుంది. ముఖ్యంగా, రక్షణ, వ్యూహాత్మక సంబంధాల్లో గణనీయ స్థాయిలో సహకారం పెంపొందనుంది. అయితే, వాణిజ్య సుంకాల విషయంలో నెలకొన్న విభేదాలకు సంబంధించి నిర్ధారిత ఫలితాలేవీ రాకపోవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. కానీ, ఈ ప్రాంతంలో ఆర్థికంగా, సైనికంగా చైనా విస్తృతిని అడ్డుకునే దిశగా ఇరు దేశాల సంబంధాల మధ్య కీలక సానుకూల ఫలితాలు ఈ పర్యటన ద్వారా వెలువడే అవకాశముంది. ప్రతినిధుల స్థాయి చర్చల్లో ఇరు దేశాలు ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై చర్చలు జరుపుతారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, ఉగ్రవాదంపై పోరు, విద్యుత్, మత స్వేచ్ఛ, అఫ్గనిస్తాన్‌లో తాలిబన్‌తో ప్రతిపాదిత శాంతి ఒప్పందం, ఇండో పసిఫిక్ ప్రాంత పరిస్థితి.. తదితర అంశాలపై చర్చలు జరుగుతాయని భారత్, అమెరికా అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు.



### మత స్వేచ్ఛపై కామెంట్స్

పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ), జాతీయ పౌర పట్టిక(ఎన్నార్సీ), జాతీయ జనాభా పట్టిక(ఎన్పీఆర్)లపై దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్న తరుణంలో ట్రంప్ పర్యటన జరుగుతోంది. ఈ నేపథ్యంలో.. భారత్‌లో మత స్వేచ్ఛపై ట్రంప్ తన అభిప్రాయాలను వెల్లడిస్తారని వైట్‌హౌజ్‌లోని ఉన్నతాధికారి స్పష్టం చేశారు. 'ప్రెసిడెంట్ ట్రంప్ ఇరుదేశాల విలువలైన ప్రజాస్వామ్యం, మత స్వేచ్ఛకు సంబంధించి బహిరంగంగాను, వ్యక్తిగత చర్చల్లోనూ ప్రస్తావన తీసుకువస్తారు. అన్ని అంశాలు, ముఖ్యంగా మా ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన మత స్వేచ్ఛకు సంబంధించిన అంశాన్ని ప్రెసిడెంట్ తప్పక లేవనెత్తుతారు'అని ఆ అధికారి తేల్చిచెప్పారు.

### ఐదు ఒప్పందాలు!

ఇరు దేశాల మధ్య ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, వాణిజ్యం, అంతర్గత భద్రతలకు సంబంధించి ఐదు కీలక ఒప్పందాలు కుదిరే అవకాశముందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ వెల్లడించారు. ముఖ్యంగా, అమెరికా నుంచి 260 కోట్ల డాలర్లను వెచ్చించి 24 ఎంహెచ్–60 రోమియో హెలీకాప్టర్లను, 80 కోట్ల డాలర్లతో 6 ఏహెచ్ 64ఈ అపాచీ హెలీకాప్టర్లను కొనుగోలు చేసే ఒప్పందాలు కుదిరే అవకాశముంది. భారత్‌కున్న పలు అభ్యంతరాల రీత్యా.. భారత పౌల్ట్రీ, డైరీ మార్కెట్లలో ప్రవేశించాలన్న అమెరికా ఆశలు ఈ పర్యటన సందర్భంగా కుదిరే అవకాశం కనిపించడం లేదు.

# ట్రంప్‌కు బహుమతిగా ఖాదీ చొక్కా

**కోయంబత్తూర్:** రెండ్రోజుల పర్యటన కోసం భారత్‌కు రానున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కేరళ రాష్ట్రం పొల్లాచ్చికి చెందిన 90 ఏళ్ల దర్జీ అరుదైన బహుమత ఇవ్వాలని యోచిస్తున్నాడు. ఆయన తన స్వహస్తాలతో ఓ ఖాదీ చొక్కాను ట్రంప్ కోసం కుట్టాడు. ట్రంప్‌ను టీవీలో, ఫొటోలలో చూసిన తర్వాత దర్జీ వి.ఎస్.విశ్వనాథన్‌కు ఈ ఆలోచన వచ్చిందని, అమెరికా అధ్యక్షుడు ఈ బహుమతిని స్వీకరిస్తారని, అభినందిస్తారని తమకు నమ్మకం ఉందని విశ్వనాథన్ కుటుంబసభ్యులు చెబుతున్నారు. చొక్కాను యూఎస్ ఎంబసీకి అందజేయాల్సిందిగా కోరుతూ, ప్రధాని కార్యాలయానికి దానిని పంపించినట్లు వారు తెలిపారు. విశ్వనాథన్ గతంలోనూ తమిళనాడు మాజీ సీఎంలు, దివంగత కె.కామరాజ్, సీఎన్ అన్నాదురై, మాజీ అధ్యక్షుడు ఆర్.వెంకట్రామన్‌సహా పలువురు రాజకీయ నాయకులకు ఇలాంటి చొక్కాలు బహుమతిగా ఇచ్చారు.

# రాజగోపాల్‌పేటకు గొప్ప చరిత్ర

## గ్రామాల్లో పురావస్తు శాఖ అధికారుల పర్యటన

**నంగునూరు (సిద్దిపేట):** సిద్దిపేట జిల్లా రాజగోపాల్‌పేట గ్రామానికి ఎంతో గొప్ప చరిత్ర ఉన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోందని విశ్రాంత పురావస్తుశాఖ ప్రాచీన కట్టడాల ముఖ్య సంరక్షుడు, సైట్ సూపర్‌వైజర్ ఎర్రమరాజు భానుమూర్తి అన్నారు. ఆదివారం రాజగోపాల్‌పేట, సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామాల్లో పర్యటించి ఆదిమానవుల ఆనవాళ్లను పరిశీలించారు. అనంతరం వెల్కటూర్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో రాకాసి గుండ్లను, ఇటీవల తవ్వకాల్లో రాజగోపాల్‌పేటలో బయటపడిన దేవాలయ ఆనవాళ్లను, రాతి ఖడీలపై చెక్కిన దేవతా విగ్రహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కోట, పురాతన దేవాలయాలు, చారిత్రక ఆనవాళ్లను, వాటి చరిత్రను గ్రామ సర్పంచ్ ఎల రాజేంద్ర, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. భానుమూర్తి మాట్లాడుతూ సిద్దిపేట మండలం మిట్టపల్లి, నంగునూరు మండలం రాజగోపాల్‌పేట, వెంకటాపూర్ గ్రామాలకు ఎంతో చరిత్ర ఉందని శాసనాల ద్వారా తెలుస్తోందన్నారు. రాజగోపాల్‌పేట గ్రామంలో అతి పురాతనమైన ఆలయాలతో పాటు రాజుల కాలంలో గొప్ప చారిత్రాత్మక కట్టడాలు నిర్మించినట్లు తెలుస్తోందన్నారు. వీటిని వెలుగులోకి తెవాలని గ్రామస్తులు కోరారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



రాజగోపాల్‌పేటలోని బయటపడ్డ రాతి ఆనవాళ్లను పరిశీలిస్తున్న దృశ్యం

# ఇంజనీరింగ్ విద్యకు కొత్త రూపు

▶ మొదటి పేజీ తరువాయి

మోడల్ కరిక్యులమ్‌ను తెచ్చింది. పారిశ్రామిక రంగానికి చెందిన 8 మంది ఎక్స్‌పర్ట్స్, 33 ఐఐటీ ఎక్స్‌పర్ట్స్‌లతో కూడిన 11 కమిటీలు బీటెక్ మోడల్ కరిక్యులమ్‌ను రూపొందించాయి. బీటెక్‌లో క్రెడిట్స్‌ను కూడా 200 నుంచి 160కి తగ్గించాయి. ఇక పారిశ్రామిక రంగానికి చెందిన 12 మంది ఎక్స్‌పర్ట్స్, జాతీయ విద్యా సంస్థలకు చెందిన 22 మంది నిపుణులతో కూడిన కమిటీ ఎంటెక్‌లోనూ మోడల్ కరిక్యులమ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇందులోనూ క్రెడిట్స్‌ను 68కి తగ్గించింది. పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తూ తెచ్చిన ఈ సంస్కరణలను రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యా, పారిశ్రామిక రంగాలకు చెందిన అనుభవజ్ఞులతో కూడిన విద్యా బోధన, విద్యార్థుల్లో ప్రాబ్లమ్ సాల్వింగ్ విధానాన్ని ప్రోత్సహించడం, ఇష్టమైన సబ్జెక్టులను చదువుకునేలా సరళీకరణ విధానం విద్యార్థులకు అందుబాటులోకి రాబోతోంది. అంతేకాదు పరీక్ష సంస్కరణలు రాబోతున్నాయి. విద్యార్థుల విశ్లేషణ సామర్థ్యాలను పరీక్షించేలా 18 శాతం, అవగాహన స్థాయిని పరీక్షించేలా 30 శాతం, విద్యార్థులు తాము తెలుసుకున్న విషయాన్ని అప్లై చేసే సామర్థ్యాన్ని పరీక్షించేలా 46 శాతం మార్కుల విధానం అమల్లోకి రానుంది.



### 3 వారాల ఇండక్షన్ ప్రోగ్రాం..

ఇంజనీరింగ్‌లో చేరే ప్రతి విద్యార్థికి కచ్చితంగా 3 వారాల ఇండక్షన్ ప్రోగ్రాం అమలు చేసేందుకు వర్సిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇందులో విద్యార్థులకు ఫిజికల్ యాక్టివిటీతో పాటు క్రియేటివ్ ఆర్ట్స్, యూనివర్సల్ హ్యూమన్ వ్యాల్యూస్, లిటరసీ, ప్రొఫిషియెన్సీ మాడ్యూల్స్, ప్రముఖులతో ఉపన్యాసాలు, స్థానిక ప్రదేశాలు సందర్శన, తాము చేరిన బ్రాంచీలకు సంబంధించిన విశేషాలు సమగ్రంగా వివరించడం వంటి చర్యలు చేపడతారు. తద్వారా ఆ విద్యార్థి ఆ కోర్సుకు సంబంధించిన అవగాహనతో ముందునుంచే చదువుకునేందుకు వీలు ఏర్పడనుంది. ఇందులో విద్యార్థుల అభిప్రాయాలకు ప్రాధాన్యం, బోధనలో అవసరమైన చర్యలు చేపడతారు.

### 1,000 గంటల ఇంటర్న్‌షిప్..

నాలుగేళ్ల బీటెక్ కోర్సు విద్యార్థులకు 1,000 గంటల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను ఏఐసీటీఈ అందుబాటులోకి తెచ్చింది. ప్రతి విద్యార్థి దీనిని తప్పసరిగా చేసేలా నిబంధన విధించింది. అందులో విద్యా పారిశ్రామిక సంబంధ ఇంటర్న్‌షిప్‌ను 600–700 గంటల చేయాల్సి ఉంటుంది. అలాగే 300–400 గంటలు సామాజిక సేవా సంబంధ అంశాల్లో ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం విద్యా సంస్థలు తమ బడ్జెట్‌లో 1 శాతం కచ్చితంగా కేటాయించాలని ఏఐసీటీఈ స్పష్టం చేసింది.

### డిమాండున్న కోర్సులకు ప్రాధాన్యం..

ప్రపంచవ్యాప్తంగా అత్యధిక డిమాండ్ ఉన్న కోర్సులను ఏఐసీటీఈ గతేడాది అందుబాటులోకి తెచ్చింది. అయితే రాష్ట్రంలోని ఐదారు విద్యా సంస్థలు మినహా మిగతావేవీ వీటిని అమలు చేయలేదు. రానున్న విద్యా సంవత్సరంలో మాత్రం వీటిని కచ్చితంగా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకు అనుగుణంగా వర్సిటీలు తమ పరిధిలోకి కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మెటలార్జికల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ వంటి ప్రధాన కోర్సులున్నాయి. వాటిల్లోనే 90 శాతం మంది విద్యార్థులు చేరుతున్నారు. అయితే వాటిల్లోనూ ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. ఇంజనీరింగ్ కోర్సుల స్వరూపం మారుతోంది. అందుకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, డిజైన్, ఏఆర్ అండ్ వీఆర్, త్రీడీ ప్రింటింగ్ వంటి కోర్సులను ఏఐసీటీఈ అమల్లోకి తెచ్చింది. ఇప్పుడు ఆ కోర్సులు రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల్లో అమల్లోకి రాబోతున్నాయి.

### ప్రోత్సహిస్తున్న ఉన్నత విద్యామండలి

విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఉపయోగపడే ఈ సంస్కరణల అమలును రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వెన్నంటి ప్రోత్సహిస్తోంది. అందుకు అనుగుణంగా యూనివర్సిటీలకు, అధ్యాపకులకు చేయూతను అందించేందుకు ముందుకొచ్చింది. కొత్త సంస్కరణలు, కొత్త కోర్సులకు సంబంధించిన అనుభవజ్ఞులను, పారిశ్రామిక రంగాల వారిని తీసుకురావడం, ఫ్యాకల్టీకి శిక్షణ ఇవ్వడం వంటి బాధ్యతలను తీసుకుంటామని ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి ఇటీవల ప్రకటించారు. ఇప్పటికే సిద్ధం చేసిన కార్యాచరణను అమల్లోకి తేబోతున్నారు. మరోవైపు విద్యా సంస్కరణల్లో భాగంగా విద్యార్థులు ఇండక్షన్ ప్రోగ్రాం, తప్పనిసరిగా వేసవిలో ఇంటర్న్‌షిప్ విధానం అమలుకు యూనివర్సిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. కోర్ సబ్జెక్టులతోపాటు భారత రాజ్యాంగం, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, ఎసెన్స్ ఆఫ్ ఇండియన్ ట్రెడిషనల్ నాలెడ్జ్ వంటి అంశాలను విద్యార్థులు చదువుకునేలా చర్యలు చేపట్టాయి.



# వైభవంగా ఆదిదేవుడి రథోత్సవం

‘హరహర మహాదేవ.. శంభో శంకర’ నామస్మరణతో దుబ్బరాజన్న క్షేత్రం మారుమోగింది. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల-కోనాపూర్ గ్రామాల మధ్య వెలసిన దుబ్బరాజన్న ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా జాతర బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం నిర్వహించిన రథోత్సవానికి 1.50 లక్షల మంది భక్తులు హాజరయ్యారు.

సారంగాపూర్ (జగిత్యాల)



# పోటెత్తిన ఏడుపాయల

మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గా మాత ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన రథోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. సెలవు రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

పాపన్నపేట (మెదక్)

# వరంగల్‌పై అభిమానం

## విద్యా, సాంస్కృతిక, సాహిత్యానికి కేంద్రం ఓరుగల్లు: వెంకయ్య

- పీవీ లాంటి వారికి విద్యను అందించిన నేల ఇది
- మాతృభాష విద్యతోనే వికాసం
- నీటి పారుదల రంగంలో తెలంగాణ ప్రభుత్వ కృషి అభినందనీయం
- వరంగల్‌లో ఏవీవీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ఉపరాష్ట్రపతి ప్రసంగం





వరంగల్‌లో జరిగిన ఏవీవీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రజలకు అభివాదం చేస్తున్న వెంకయ్యనాయుడు

**సాక్షి ప్రతినిధి, వరంగల్:** కాకతీయుల సుపరిపాలనకు కేంద్రమైన ఓరుగల్లుకు రావడం.. ఇక్కడి గడ్డపై జరిగే కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. వరంగల్‌పై తనకు ప్రత్యేక అభిమానం ఉందని చెప్పారు. ఆదివారం వరంగల్‌లో ఆంధ్రా విద్యాభివర్ధిని (ఏవీవీ) కళాశాల 75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ‘దాశరథి రంగాచార్యులు, వరదాచార్యులు, కాళోజి సోదరులైన రామేశ్వర్‌రావు, నారాయణరావు, బహుభాషా కోవిదుడు, భారత ఆర్థికాభివృద్ధికి బీజాలు వేసిన మాజీ ప్రధాని పాములపర్తి నరసింహారావు వంటి వివిధ రంగాల్లోని శిఖర సమానులకు ఓరుగల్లుతో ప్రత్యక్ష సంబంధాలుండటం.. వరంగల్ వాసుల తోపాటు తెలంగాణ ప్రజలకు గర్వకారణం’అని పేర్కొన్నారు. వరంగల్ సాంస్కృతిక వారసత్వం ఘనమైనదని, ప్రఖ్యాతి గాంచిన ఓరుగల్లు ఖిలాతో పాటు, వేయి స్తంభాల గుడి, రామప్ప, లక్నవరం, పాకాల వంటి అతి పెద్ద చెరువులు వరంగల్ నగరానికి కంఠాభరణాల్లాంటివని కొనియాడారు. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న నగరం కాబట్టే.. కేంద్రం ఓరుగల్లును ‘హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్’ పథకం కింద మరింత అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసిందని చెప్పారు. నీటి పారుదల రంగంలో తెలంగాణ ప్రభుత్వం కృషి అభినందనీయమన్నారు.

**మాతృభాషను విస్మరిస్తే ఆత్మహత్య సదృశ్యమే**

‘మాతృభాష కళ్లలాంటిది.. పరభాష కళ్లద్దాలలాంటిది.. కళ్లు సరిగా లేకపోతే రేబాన్, జుబాన్ ఏ అద్దాలు పెట్టినా ప్రయోజనం ఉండదు..’అని వెంకయ్య అన్నారు. విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంచుకునేందుకు సానుకూల వాతావరణం ఏర్పడుతుందని, అయితే భాష, భావనలను వేర్వేరుగా చూడలేమని, అందుకే సరైన, స్పష్టమైన భావ వ్యక్తీకరణకు భాషే మూలమని పేర్కొన్నారు. ఎన్ని భాషలను నేర్చుకున్నా మాతృభాషను విస్మరిస్తే ఆత్మహత్య సదృశ్యమేనని చెప్పారు. భవిష్యత్ తరాలకు సరైన మార్గదర్శనం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని చెప్పారు. ఎన్ని గూగుల్‌లు వచ్చినా.. గురువును మించలేవని. గురువు చేసే మార్గదర్శనం,హితబోధే విద్యార్థి భవిష్యత్తుకు బాటలు వేస్తుందని ఉపరాష్ట్రపతి చెప్పారు.

**కలుషితమైన రాజకీయాలు**

కులం ఒకప్పుడు సామాజిక కార్యక్రమాలకు ఉపయోగపడేదని, ఇప్పుడు రాజకీయ నాయకులు దానిని ఉపయోగించుకుంటున్నారని వెంకయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుడికి నాలుగు లక్షణాలు ఉండాలని, క్యారెక్టర్, క్యాలిబర్, కెపాసిటీ, కాంటాక్ట్.. కానీ వాటికి భిన్నంగా క్యాస్ట్, కమ్యూనిటీ, క్యాష్, క్రిమినాలిటీ రాజ్యమేలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని, సర్వధర్మ సమభావనను పాటిస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్న మనదేశంలోనే అక్కడక్కడా వివక్షతలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. విచ్ఛిన్నకర శక్తులు అదును చూసి సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా విషం చిమ్ముతున్నాయని, ఈ పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. మహనీయులు చూపిన బాటలో నడిచేలా సామాజికవేత్తలు, విద్యావేత్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బి.వినోద్‌కుమార్ పాల్గొన్నారు.




# ఎస్పీఎంలో ఘోర ప్రమాదం

- బాయిలర్ నిర్మాణంలో అపశృతి
- కుప్పకూలిన మట్టి పెళ్లలు
- ముగ్గురు కూలీల మృతి
- మరో ఐదుగురికి గాయాలు

**కాగజ్‌నగర్ టౌన్:** కుమురంభీం జిల్లా సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్పీఎం)లో శనివారం అర్ధరాత్రి ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బాయిలర్ నిర్మాణం చేపడుతున్న ప్రదేశంలో మట్టి పెళ్లలు కూలడంతో ముగ్గురు కూలీలు మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. చెన్నైకు చెందిన ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో నూతన బాయిలర్ నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్‌కు చెందిన కూలీలు పనిచేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి బాయిలర్ పిల్లర్ల నిర్మాణం కోసం రాడ్ బైండింగ్ పని చేస్తుండగా భారీ గుంతలో ఓ పక్క భాగం మట్టి దిబ్బలు కూలీలపై పడిపోయాయి. దీంతో రెప్పపాటులో ఎనిమిది మంది కూలీలు మట్టి దిబ్బల కింద చిక్కుకుపోయారు. ప్రమాద సమయంలో 24 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో రఘునాథ్‌రాం (38) (జార్ఖండ్) అక్కడికక్కడే చనిపోగా.. మిగతా వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఛోటు కుమార్ (25)(జార్ఖండ్), రంజిత్ (24) (ఉత్తర ప్రదేశ్) మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆదివారం ఉదయం ప్రమాద స్థలాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరిశీలించారు. సైట్ సీనియర్ ఇంజనీర్, సూపర్ వైజర్లపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్పీ విష్ణువారియర్ తెలిపారు.

## ‘నవోదయ’ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

**విద్యారణ్యపురి:** నవోదయ విద్యాలయాల సమితి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఆదివారం హన్మకొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.భాస్కరచారి (మహబూబ్‌నగర్), కార్యదర్శిగా జనానిదేవి (మెదక్), అసోసియేట్ అధ్యక్షులుగా కె.తిలక్ (రంగారెడ్డి), ఎ.మల్లేశ్ (కరీంనగర్), ఉపాధ్యక్షులుగా జె.శ్రీనివాసులు (నల్లగొండ), వేణుగోపాల్ (నిజామాబాద్), జాయింట్ సెక్రటరీలుగా శ్రీదేవి(ఆదిలాబాద్), సురేందర్ (ఖమ్మం),కోశాధికారిగా నాగేశ్వర్‌రావు (కరీంనగర్) ఎన్నికయ్యారు.

# రూ.2కోట్లకు టోకరా..!

## బంగారు ఆభరణాల పేరుతో స్వాహా

**అశ్వారావుపేటరూరల్:** తక్కువ ధరకే బంగారు ఆభరణాలు, అధిక వడ్డీ ఆశ చూపించి ఓ యువకుడు, అతడి తల్లి, సోదరి కలసి ఘరానా మోసానికి పాల్పడిన వ్యవహారం ఆదివారం వెలుగులోకి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామానికి చెందిన షేక్ షబ్బీర్ కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నట్లు స్థానికులను నమ్మించాడు. తమ సంస్థలో వేలానికి వచ్చే బంగారు ఆభరణాలను కొనుగోలు చేస్తానని, తనకు కొంత డబ్బు ఇస్తే వాటికి అధిక వడ్డీతో చెల్లిస్తానని, లేదంటే బంగారు ఆభరణాలు ఇస్తానని చెప్పేవాడు. అతడి మాటలు నమ్మిన స్థానికులు కొందరు భారీ మొత్తంలో డబ్బులు ఇచ్చారు. షబ్బీర్‌తో పాటు తల్లి సలీమా, సోదరి షమీనా కలసి మొదట్లో అనుమానం రాకుండా వడ్డీ, బంగారు ఆభరణాలను ఇచ్చేవారు. ఇలా నమ్మిన వినాయకపురం గ్రామానికి చెందిన లోకం అశ్వనీకుమార్ రూ.25 లక్షలు, బుడగం కిరణ్ రూ.45 లక్షలు, తంగాల మల్లికార్జున్‌రావు రూ.2 లక్షల, ఏరువాక నాగు రూ.2 లక్షలు చొప్పున ఇచ్చారు. ఇంకా పలువురు వద్ద నుంచి సుమారు రూ.2 కోట్ల వరకు వసూళ్లకు పాల్పడినట్లు బాధితులు చెబుతున్నారు. ఈ నగదుకు కొద్ది నెలలు సక్రమంగానే వడ్డీ చెల్లించే వాడని, తర్వాత పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నాడని చెప్పారు. తమకు అనుమానం వచ్చి ఆరా తీస్తే ఉద్యోగం చేయడం లేదని తెలిసిందని వాపోయారు. దీంతో నిలదీస్తే వినాయకపురం గ్రామంలో గల తన ఇంటిని ఇద్దరికి విక్రయించాడని, ఆ తర్వాత అతడి మోసం బయటపడిందని చెప్పారు. ఈ విషయమై కొంతమంది బాధితులు స్థానిక పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.






# ఆపరేషన్ థియేటర్‌లో ‘టిక్‌టాక్’

**సోషల్ మీడియాలో వైరల్.. తాము చేయలేదంటున్న వైద్యులు**

**హుజూరాబాద్:** ప్రభుత్వ ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్‌లో వైద్యులు టిక్‌టాక్ చేసిన వీడియో ఒకటి ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో ఓ రోగికి వైద్యులు, సిబ్బంది ఆపరేషన్ చేస్తుండగా ‘సార్ మేము ప్లేయర్సే.. ఈ పుట్‌బాల్ ఆట మాకు తెలియదు. కానీ.. మా ఆట దడ.. దడ పుట్టిస్తది’ అని ఓ సినిమాలోని డైలాగ్‌తో ఈ వీడియో ఉంది. అయితే ఈ వీడియోతో తమకేం సంబంధం లేదని ఆర్‌ఎంఓ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కొన్ని అరుదైన శస్త్ర చికిత్సలు, ప్రత్యేకమైన పరిస్థితుల్లోనే తాము వీడియో, ఫొటోలు తీసి రోగి బంధువులకు చూపిస్తామని, అయితే ఈ వీడియో విషయంలో మామూలుగా తీసిన వీడియోను ఎవరో ఎడిట్ చేసి టిక్‌టాక్‌లో పెట్టారన్నారు.

# ఏటీఎం చోరీ

**పటాన్‌చెరు టౌన్:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో దుండగులు ఏకంగా ఏటీఎం మెషీన్‌నే ఎత్తుకెళ్లిపోయారు. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని జాతీయ రహదారి పక్కనున్న ఓ షటర్‌లో రెండు ఇండిక్యాష్ ఏటీఎంలలో ఆదివారం తెల్లవారుజామున ఒక ఏటీఎంను దుండగులు ఎత్తుకెళ్లారు. ఓ ఖాతాదారుడు ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వెళ్లగా అక్కడ ఒకటే ఏటీఎం మిషన్ ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దుండగులు ఎత్తుకెళ్లిన ఏటీఎంలో రూ.2,27,000 నగదు ఉందని పోలీసులు తెలిపారు.






## సీనియర్ జర్నలిస్ట్ ప్రభాకర్ ఆత్మహత్య



**పంజగుట్ట :** సీనియర్ జర్నలిస్టు, రచయిత వడ్డాలపు ప్రభాకర్ (43) హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీలో కుమారునితో కలిసి ఉంటున్న ఆయన శనివారం సాయంత్రం ఏడు గంటలకు ఇంట్లో నుండి బయల్దేరి ఎనిమిదిన్న రకు సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసుకున్నారు.అయితే ఆయన నేరుగా ఆఫీస్‌కు వెళ్లకపోవటం, రాత్రి రెండు గంటలు దాటినా ఇంటికి రాకపోవటంతో ఆయన కుమారుడు శిల్పి ఆదివారం తెల్లవారుజామున పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం పన్నెండు గంటల సమయంలో కొందరు వ్యాపారులు హుస్సేన్‌సాగర్‌లో ఓ గుర్తు తెలియని శవాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు జేబుల్లో లభించిన సెల్‌ఫోన్, గుర్తింపు కార్డు ఆధారంగా ప్రభాకర్‌ను గుర్తించారు. కొంతకాలంగా వ్యక్తిగత కారణాలతో బాధపడుతున్నందునే అతను ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. ప్రభాకర్ పలు టీవీ చానెళ్లతో పాటు, బస్తీ సినిమాకు మాటల రచయితగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆయన 'సాక్షి'దినపత్రికలో సీనియర్ సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.ప్రభాకర్ మరణంపై 'సాక్షి'దినపత్రిక ఎడిటర్ వర్ధెల్లి మురళి సంతాపం వ్యక్తం చేశారు. గాంధీ ఆస్పత్రిలో భద్రపరిచిన ప్రభాకర్ భౌతిక కాయాన్ని పలువురు జర్నలిస్టులు సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం కుటుంబీకుల సమక్షంలో పోస్ట్‌మార్టం నిర్వహించి ఆయన స్వస్థలం కేసముద్రం మండలం కల్లెడకు తరలిస్తారు.

## హైదరాబాద్ క్లబ్‌రన్-2020లో విషాదం

### విశ్రాంత నేవీ ఉద్యోగి గుండెపోటుతో మృతి

**రాయదుర్గం:** హైదరాబాద్ క్లబ్‌రన్–2020లో విషాదం చోటు చేసుకుంది. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో హైదరాబాద్ రన్నర్స్ ఆధ్వర్యంలో 11వ ఎడిషన్ క్లబ్‌రన్–2020ని ఆదివారం నిర్వహించారు. హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి 10 కిలోమీటర్లు, 21 కిలోమీటర్ల రన్‌ను నిర్వహించారు. కాగా ఈ క్లబ్‌రన్‌లో కూకట్‌పల్లిలోని జలవాయువిహార్‌లో నివాసముండే నేవీలో పనిచేసి పదవీవిరమణ పొందిన శ్రీనివాసన్(54) 21 కిలోమీటర్ల విభాగంలో పాల్గొన్నారు. పరుగు ప్రారంభించి కొద్దిదూరం వెళ్ళాక ఆయన అకస్మాత్తుగా స్పృహ తప్పి కిందపడి పోయారు. వెంటనే స్పందించిన నిర్వాహకులు తోటి రన్నర్స్ అంబులెన్స్‌లో ఆయనను నల్లగండ్లలోని సిటిజన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ప్రారంభించిన కొద్ది సేపటికే శ్రీనివాసన్ మృతి చెందడం అందరినీ కలచివేసింది. ఆయన గుండె పోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## రైతు సంక్షేమ సమితి రాష్ట్ర కమిటీ ఎన్నిక

**వనస్థలిపురం:** తెలంగాణ రైతు సంక్షేమ సమితి రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. వనస్థలిపురం చింతలకుంటలోని క్లాసిక్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ రైతు సంక్షేమ సమితి 2వ మహాసభలో ఈ మేరకు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ఉపాధ్యక్షులుగా ఎ.సి.రెడ్డి, బద్రూనాయక్, ప్రధాన కార్యదర్శిగా పి.లక్ష్మణ్, సహాయ కార్యదర్శులుగా లింగ్యా నాయక్, కె.వినయ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా పెల్కంపల్లి సుధాకర్ (పెద్దపల్లి), డి.రాజేశ్వర్‌రెడ్డి (ఆదిలాబాద్), వర్కిల్ల మొగిలి (పెద్దపల్లి), నవీన్‌రెడ్డి (నల్లగొండ), రవీంద్రరెడ్డి (మంచిర్యాల), శివనాయక్ (నాగర్‌కర్నూల్), పోట్టయ్య (భద్రాచలం), బోడ లక్ష్మణ్ (భద్రాద్రి కొత్తగూడెం), వీరభద్రం (ఖమ్మం), టి.రాము (ఖమ్మం), ఎం.కుమార్ (ఖమ్మం), ప్రొఫెసర్ ఈశ్వరయ్య (భువనగిరి), డా.మజుందార్ (మహబూబాబాద్), పోల్కంపల్లి కుమార్ (మేడ్చల్) ఎన్నికయ్యారు.

## టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా ప్రీతమ్

**సాక్షి, న్యూఢిల్లీ:** టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా ఎన్.ప్రీతమ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఈ నియామకాన్ని ఆమోదించారంటూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

**తెలంగాణ ఫుడ్స్: IDA: నాచారం: హైదరాబాద్ - 500076**
ఫోన్ నం.: 27152207, 08 & 09
**టెండరు ప్రకటన**
ప్రకటనం నం. TF/GG/Tender/SMP/310/2020-21 తేది: 24.02.2020
పాడి సహకార సంఘాలు, సహకార సమాఖ్యలు మరియు వాటి అధీకృత ఏజెంట్ల నుండి 600 మెట్రిక్ టన్నుల వెన్నతీసిన పాలపొడర్ సేకరణ కోసం తెలంగాణ ఫుడ్స్ టెండర్లు కోరుతోంది. వివరాలకు 24.02.2020 మ. 2.00 గం. నుండి దర్శించండి వెబ్‌సైట్ https://tender.eprocurement.gov.in మరియు వెబ్‌సైట్ https://tfoods.telangana.gov.in. ఆన్‌లైన్ బిడ్స్ దాఖలుకు ముగింపు తేది: 03.03.2020 మ. 1.00 గం.
సం/- జనరల్ మేనేజర్
DIPR RO.No. 691-PP/CL/ADVT/1/2019-20; Dt : 22.02.2020

**తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానము:: హైదరాబాద్**
**ప్రకటన నం.10/2020-RC**
తెలంగాణ స్టేట్ జ్యుడిషియల్ సర్వీస్‌లో 87 సివిల్ జడ్జ్ ఉద్యోగాలకు సాధారణ నియామకం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరబడుచున్నవి. డైరెక్ట్ నియామకం క్రింద 70 ఉద్యోగాలు మరియు బదిలీ ద్వారా నియామకం క్రింద 17 ఉద్యోగాలు భర్తీ చేయబడును. సవివరమైన నోటిఫికేషన్ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్ http://tshc.gov.inలో ఉంచబడింది.
**ముఖ్యమైన తేదీలు**
1. ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలు కోసం ప్రారంభ తేది: 13.03.2020
2. ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలు కోసం ముగింపు తేది: 13.04.2020
3. స్క్రీనింగ్ టెస్ట్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) నిర్వహించు తేది మరియు సమయం: 3.05.2020 (ఆదివారం). సమయం హాల్ టికెట్‌లో తెలుపబడును.
4. హాల్ టికెట్ల డౌన్‌లోడ్: 23.04.2020 నుండి 03.05.2020
గమనిక: చేతితో వ్రాసిన/టైప్ చేసిన/ ఫోటోస్టాట్ కాపి/ ముద్రిత దరఖాస్తు ఫారం నేరుగా లేదా పోస్ట్ ద్వారా లేదా కొరియర్ ద్వారా లేదా స్వయంగా స్వీకరించబడదు.
**తేది: 22.02.2020** సం/- రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్), FAC. రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్)
DIPR RO.No.2506-DP/CL/Advt/1/2019-20, Dt: 22.02.2020

**తెలంగాణ ప్రభుత్వం**
**ఆర్థిక (డి.సి.యం) శాఖ**
**పత్రికా అధికార వార్త**
తేది: 24.02.2020
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక శాఖ నోటిఫికేషన్ నెం.163 (ఎల్)/డబ్లు–యమ్/2009 తేది: 18.03.2010 ప్రకారం జారీ అయిన 8.39% ఆంధ్రప్రదేశ్ జి.యస్. 2020ను తేది: 24.03.2020 వరకు అయిన వడ్డీతో 24.03.2020న (25.03.2020 సెలవు దినము అయినందున) తిరిగి చెల్లించడమవుతుందని సమాచారార్థం ప్రకటించడమయింది. ఒక వేళ, ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం, పైన పేర్కొన్న సదరు తేదీని నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం 1881, క్రింద సెలవు దినంగా ప్రకటించిన పక్షంలో, రుణాన్ని ఆరోజుకు ముందు పనిరోజున, రాష్ట్రంలోని చెల్లింపు కార్యాలయాలు చెల్లిస్తాయి. 25.03.2020 తేది నుండి, ఆపైన రుణంపై ఎటువంటి వడ్డీ వుండదు.
2. 2007, ప్రభుత్వ అన్యాక్రాంత హామీ పత్రచట్టం రక్షణ నిబంధనలలోని 24(2), 24(3) ఉప నిబంధన ప్రకారం, సబ్సిడరీ జనరల్ లెడ్జర్ లేదా కానిస్టిట్యూట్ సబ్సిడరీ జనరల్ లెడ్జర్ అకౌంట్ లేదా స్టాక్ సర్టిఫికెట్ రూపంలో ప్రభుత్వ సెక్యూరిటీని కలిగి ఉన్న రిజిస్టర్డు హోల్డర్‌కు పరిపక్వ మొత్తాల చెల్లింపును అతని బ్యాంక్ సంబంధిత వివరాలను చేర్చుతూ పే ఆర్డరు ద్వారా లేదా ఎలక్ట్రానిక్ విధానం ద్వారా నిధులను అందుకొనే సదుపాయం కలిగి ఉన్న ఏదేని బ్యాంక్‌లో అకౌంట్ హోల్డరు ఖాతాకు జమచేయడం ద్వారా గాని చేయాలి. సెక్యూరిటీలకు సంబంధించి చెల్లింపు చేసే కార్యాం కోసం అట్టి ప్రభుత్వ సెక్యూరిటీల ఒరిజినల్ సబ్‌స్క్రైబర్ లేదా తరువాతి హోల్డర్లు ఆయా సందర్భాన్ని బట్టి వడ్డీ చెల్లింపు కోసం వారి బ్యాంకు ఖాతా వివరాల కోసం సంబంధించిన వారు వ్రాయించుకున్న/నమోదు చేసుకున్న బ్యాంకు లేదా ట్రెజరీ/ సబ్–ట్రెజరీ లేదా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి లేదా దాని అనుబంధ బ్యాంకులకు ఆయా సందర్భాన్ని బట్టి సమర్పించాలి.
3. ఏమైనప్పటికీ బ్యాంకు ఖాతా సంబంధ వివరాలు లేనప్పుడు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా నిధులను తీసుకోవడం తప్పనిసరి కానప్పుడు 8.39% ఆంధ్రప్రదేశ్ జి.యస్. 2020 హోల్డర్లకు గడువు తేదీన తిరిగి చెల్లింపును చేయడానికి గాను, వారి సెక్యూరిటీలను పబ్లిక్ రుణ కార్యాలయంలో 20 రోజుల ముందుగా అందచేయాలి. సెక్యూరిటీల వెనుక వైపున ఈ క్రింద విధంగా వ్రాసి తిరిగి చెల్లింపు కోసం సెక్యూరిటీలను సమర్పించాలి.
"ధ్రువపత్రాలపై రావలసిన అసలు మొత్తం అందింది"
4. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి లేదా దానికి చెందిన ఏవైనా అనుబంధ బ్యాంకులు ట్రెజరీ పనిని నిర్వహించే చోట్ల, సెక్యూరిటీలు స్టాకు సర్టిఫికెట్ల రూపంలో ఉన్నట్లయితే, వాటిని సంబంధిత బ్యాంకు బ్రాంచిలో సమర్పించాలి. ట్రెజరీలో లేదా సబ్–ట్రెజరీలో కాదని ముఖ్యంగా గమనించాలి.
5. చెల్లింపు కోసం సెక్యూరిటీలను వ్రాయించుకున్న చోట కాకుండా ఇతర చోట్ల చెల్లింపు తీసుకోవాలని కోరుకునే వారు వాటి వెనుక వైపు వ్రాసి, రిజిస్టరు చేసిన, బీమా చేసిన పోస్టు ద్వారా సంబంధిత ప్రజారుణం కార్యాలయానికి వాటిని పంపించాలి. ప్రజారుణ కార్యాలయం ఏదైనా ట్రెజరీ/సబ్–ట్రెజరీ లేదా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ట్రెజరీ పనిని నిర్వహించే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి లేదా దాని అనుబంధ బ్యాంకులలో చెల్లించదగే డ్రాఫ్టును జారీ చేయడం ద్వారా చెల్లింపులు చేస్తుంది.
కె.రామకృష్ణారావు
ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి,
ఆర్థిక శాఖ
DIPR RO. No.2495-DP/CL/ADVT/1/2019-20, Dt: 22.02.2020

# ఆడపిల్లలు తగ్గిపోతున్నారు!



- రాష్ట్రంలో వెయ్యి మంది మగ శిశువులకు 950 మందే..
- అత్యంత తక్కువగా యాదాద్రి జిల్లాలో వెయ్యికి 850 మందే
- ఆడశిశువుల జననాల్లో ఖమ్మం, పెద్దపల్లి జిల్లాలు ఆదర్శం
- ఖమ్మం జిల్లాలో 1,177 మంది, పెద్దపల్లిలో 1,012 మంది
- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ హెచ్‌ఎంఐఎస్ ద్వారా వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఆడపిల్లల సంఖ్య తగ్గుతోంది. గత ఆర్థిక సంవత్సరం కంటే, ఈ ఆర్థిక సంవత్సరం (ఇప్పటివరకు)లో తేడా కనిపిస్తోంది. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఎంఐఎస్) ఈ నెల దేశవ్యాప్తంగా మగ, ఆడ శిశువుల నిష్పత్తిని ప్రకటించింది. అప్పుడే పుట్టిన శిశువులను ఆధారం చేసుకొని ఈ నిష్పత్తిని అంచనా వేసింది. ఆ నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా మగ, ఆడ శిశువుల నిష్పత్తి ప్రతీ వెయ్యి మగ శిశువులకు 2018–19 ఆర్థిక సంవత్సరంలో 932 మంది ఆడ శిశువులు జన్మించారు. అలాగే 2019–20 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 934 మంది ఆడ శిశువులు పుట్టారు. అదే కాలంలో తెలంగాణలో చూస్తే దేశ సగటు కంటే ఎక్కువే ఉన్నా, గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆ సంఖ్య రాష్ట్రంలో తక్కువగా ఉండటం గమనార్హం. 2018–19లో తెలంగాణలో ప్రతీ వెయ్యి మంది మగ శిశువులకు 957 మంది ఆడ శిశువులు జన్మించగా, 2019–20 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 950 మంది ఆడ శిశువులు జన్మించినట్లు కేంద్ర నివేదిక తెలిపింది. 2017–18లో తెలంగాణలో మగ, ఆడ శిశువుల నిష్పత్తి మరింత దారుణంగా ఉండేది. అప్పుడు ప్రతీ వెయ్యి మంది మగ శిశువులకు 925 మంది మాత్రమే ఆడ శిశువులున్నారు. 2018–19లో మొత్తం 5,30,146 మంది పిల్లలు జన్మించగా, ఈ ఏడాది ఇప్పటివరకు 4,82,097 మంది జన్మించినట్లు నివేదిక వివరించింది.

**యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యల్పంగా..**

ఈ రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఖమ్మం, పెద్దపల్లి జిల్లాలు స్త్రీ పురుషుల నిష్పత్తిలో ఆదర్శంగా ఉండటం విశేషం. ఖమ్మం జిల్లాలో 2018–19 ఆర్థిక సంవత్సరంలో ప్రతీ వెయ్యి మంది మగ శిశువులకు 1,057 మంది ఆడ శిశువులు జన్మించగా, 2019–20 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఆ సంఖ్య మరింతగా పెరిగి 1,177కు చేరుకోవడం విశేషం. ఇక పెద్దపల్లి జిల్లాలో వారి నిష్పత్తి 2018–19 ఆర్థిక సంవత్సరంలో వెయ్యి మంది మగ శిశువులకు 1,031 మంది ఆడ శిశువులు జనిమ్ంచగా, 2019–20 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 1,012 ఉండటం గమనార్హం. యాదాద్రి భువనగిరి జిల్లాలో మాత్రం గత ఆర్థిక సంవత్సరంలో ప్రతీ వెయ్యి మంది మగ శిశువులకు 885 మంది జన్మించగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 850కు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో మగ శిశువులతో పోలిస్తే ఆడ శిశువులు తక్కువగా పుట్టిన జిల్లాలు భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, కొమురంభీం, కరీంనగర్, మహబూబ్‌నగర్, నిర్మల్, నల్లగొండ, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, యాదాద్రి భువనగిరి జిల్లాలున్నాయి. మిగిలిన జిల్లాల్లో గతేడాదితో పోలిస్తే ఆడ శిశువుల నిష్పత్తి పెరిగింది. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో కడుపులోనే ఉన్నప్పుడు స్కానింగ్ ద్వారా ఆడ శిశువులను ముందే గుర్తించి భ్రూణ హత్యలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. కొందరు డాక్టర్లు, ప్రైవేటు ప్రాక్టీషనర్లు ఈ విషయంలో డబ్బులకు కక్కుర్తిపడి ఆడపిల్లలు పుట్టకుండా అబార్షన్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎంత చైతన్యం తెస్తున్నా ఈ విషయంలో కొందరు తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే మొత్తంగా చూస్తే ఐదారేళ్లతో పోలిస్తే కొంచెం పరిస్థితి మారిందంటున్నారు.

**వివిధ జిల్లాల్లో వెయ్యి మంది మగ శిశువులకు ఆడ శిశువుల నిష్పత్తి**

| జిల్లా | 2018–19 | 2019–20 (ఇప్పటివరకు) |
|---|---|---|
| ఆదిలాబాద్ | 957 | 950 |
| కొమురంభీం ఆసిఫాబాద్ | 969 | 939 |
| జయశంకర్ భూపాలపల్లి | 963 | 901 |
| గద్వాల | 808 | 971 |
| జగిత్యాల | 873 | 949 |
| జనగామ | 959 | 900 |
| కామారెడ్డి | 863 | 921 |
| కరీంనగర్ | 970 | 934 |
| ఖమ్మం | 1,057 | 1,177 |
| భద్రాద్రి కొత్తగూడెం | 940 | 978 |
| మహబూబ్‌నగర్ | 934 | 904 |
| మహబూబాబాద్ | 964 | 965 |
| మంచిర్యాల | 949 | 991 |
| మెదక్ | 964 | 972 |
| మేడ్చల్ | 963 | 985 |
| నాగర్ కర్నూలు | 883 | 894 |
| నల్లగొండ | 923 | 889 |
| నిర్మల్ | 989 | 894 |
| నిజామాబాద్ | 963 | 955 |
| పెద్దపల్లి | 1,031 | 1,012 |
| సంగారెడ్డి | 948 | 904 |
| రంగారెడ్డి | 969 | 954 |
| సిద్దిపేట | 939 | 993 |
| సిరిసిల్ల | 977 | 940 |
| సూర్యాపేట | 913 | 940 |
| వికారాబాద్ | 910 | 939 |
| వనపర్తి | 813 | 926 |
| వరంగల్ రూరల్ | 973 | 926 |
| వరంగల్ అర్బన్ | 926 | 906 |
| యాదాద్రి భువనగిరి | 885 | 850 |
| హైదరాబాద్ | 999 | 953 |
| రాష్ట్ర సరాసరి | 957 | 950 |

# 'పన్నేతర రాబడి' అంతంతే..

- 2017–18, 2018–19లోనే అంచనాలకు మించి ఆదాయం
- ఈ ఏడాది అంచనా రూ.15వేల కోట్లయితే ఇప్పటివరకు వచ్చింది రూ.3వేల కోట్లే..



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో పన్నేతర రాబడుల అంచనాలు వాస్తవ రూపం దాల్చడం లేదు. వివిధ వస్తువుల వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులే కాకుండా, ఇతర రూపాల్లో లభించాల్సిన పన్నేతర ఆదాయంలో పురోగతి కనిపించడం లేదని గణాంకాలు చెబుతున్నాయి. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన గత ఆరేళ్ల రాబడుల లెక్కలు కూడా ఇదే చెబుతున్నాయి. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఆరేళ్లలో కేవలం రెండేళ్లు మాత్రమే అంచనాలను మించి పన్నేతర ఆదాయం లభించింది. మిగిలిన నాలుగేళ్లలోనూ నిరాశే మిగిలింది. ఇక, ఈ ఏడాది మూడో త్రైమాసికం ముగిసేసరికి ఆశించిన ఆదాయంలో ఐదో వంతు మాత్రమే రావడం గమనార్హం. వివిధ ప్రభుత్వ శాఖలు జరిపే అమ్మకాలతో పాటు కలప, ఇసుక అమ్మకాలు, యూజర్ చార్జీలు, ప్రభుత్వం ఇచ్చిన అప్పులు, బాండ్లకు వడ్డీలు తదితర రాబడులను కలిపి పన్నేతర ఆదాయంగా పరిగణిస్తారు. రాష్ట్రం ఏర్పాటైన తొలి ఏడాది 2014–15లో రూ. 13,242 కోట్లు పన్నేతర ఆదాయం వస్తుందని అంచనా వేయగా అందులో కేవలం 44.55 శాతం అంటే రూ. 5,899 కోట్లు మాత్రమే వచ్చింది. ఆ తర్వాతి రెండేళ్లూ అదే పరిస్థితి కొనసాగింది. దీంతో 2017–18 ఆర్థిక సంవత్సరానికి పన్నేతర రాబడుల అంచనాను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా తగ్గించింది. ఆ ఏడాది రూ. 6,600 కోట్లు అంచనా వేయగా, రూ. 7,729 కోట్లు రాబడి వచ్చింది. ఈ రాబడి అంతకు ముందు ఏడాది వచ్చిన దాని కంటే తక్కువే అయినా బడ్జెట్ అంచనాలకన్నా ఎక్కువ వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో అయితే పన్నేతర రాబడుల పరిస్థితి ఏ మాత్రం ఆశాజనకంగా లేదని లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది రూ. 15,875 కోట్ల అంచనా వేయగా, మూడో త్రైమాసికం ముగిసే నాటికి కనీసం రూ.3వేల కోట్లు కూడా రాబడి రాకపోవడం గమనార్హం.

**గత ఆరేళ్లలో పన్నేతర రాబడుల వివరాలు (రూ.కోట్లలో)**

| సంవత్సరం | అంచనా | వాస్తవ రాబడి | శాతం |
|---|---|---|---|
| 2014–15 | 13,242.02 | 5,899.94 | 44.55 |
| 2015–16 | 22,413.27 | 14,522.07 | 64.79 |
| 2016–17 | 17,542.32 | 9,543.28 | 54.40 |
| 2017–18 | 6,601.37 | 7,729.33 | 117.09 |
| 2018–19 | 8,973.92 | 10,007.58 | 111.52 |
| 2019–20 | 15,875.03 | 2,983.01 | 18.79 |

(డిసెంబర్ వరకు)

## సీఏఏపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

**పార్టీ శ్రేణులకు కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపు**



**బన్సీలాల్‌పేట్:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని బీజేపీ శ్రేణులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఏఏను ఎవరి కోసం టీఆర్‌ఎస్ వ్యతిరేకిస్తోందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పద్మారావునగర్‌లో ఆదివారం జరిగిన సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో సీఏఏకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవాలనుకుంటోంది టీఆర్‌ఎస్ ప్రభుత్వం భారతీయులకోసమా లేక ఎంఐఎం కోసమా ప్రజలకు వివరించాలన్నారు. సీఏఏపై పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజలకు వాస్తవాలను తెలియజేసి వారికి అవగాహన కల్పించాలన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే సీఏఏపై టీఆర్‌ఎస్,ఎం.ఐ,ఎం,కాంగ్రెస్ విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి వచ్చిన శరణార్థుల మానవ హక్కులను కాపాడటానికి..వారిని మనుషులుగా గుర్తించి సౌకర్యాలు కల్పించడానికి సీఏఏ చట్టాన్ని కేంద్రం తెచ్చిందన్నారు. నగరంలో మార్చి 15న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బహిరంగ సభకు భారీ ఎత్తున జనసమీకరణ చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలన్నారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్‌తోనే తమకు పోటీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎంపీ వివేక్ పాల్గొన్నారు.

## అటు 'పట్టణ ప్రగతి'... ఇటు 'పట్నం గోస'

- అధికార టీఆర్‌ఎస్ కార్యక్రమానికి ప్రతిగా కాంగ్రెస్ రూపకల్పన
- నేటి నుంచే క్షేత్రస్థాయికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు పట్టణ ప్రగతి పేరుతో ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమానికి రూపకల్పన చేయగా, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ 'పట్నం గోస' పేరుతో మరో కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమయింది. ప్రభుత్వ పక్షాన పట్టణ ప్రగతి ప్రారంభమవుతున్న సోమవారం నుంచే మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గంలో మల్కాజ్‌గిరి ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణమే ప్రధాన ఎజెండాగా చేసుకుని ఆయన క్షేత్రస్థాయికి వెళ్లబోతున్నారు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోజుకో సెగ్మెంట్ వంతున ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించడం, లబ్ధిదారులతో సమావేశం, పనుల పురోగతి, నిర్మాణ పనుల ప్రారంభంపై సంబంధిత అ ధికారులతో సంప్రదింపులు జరపడమే ఈ కా ర్యక్రమ ఎజెండా అని రేవంత్ కార్యాలయ వ ర్గాలు ఆదివారం వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ వి భాగాల సభ్యులు, నియోజకవర్గాల్లోని పార్టీ సీనియర్ నేతలు పాల్గొంటారని పేర్కొన్నాయి.



**హామీలు విస్మరించారు**

2014, 2018 ఎన్నికల్లో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మిస్తామని రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చిన అధికార టీఆర్‌ఎస్ ఆ హామీని నెరవేర్చలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మురికివాడల రహితం చేస్తామని సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి కేటీఆర్‌లు పలుమార్లు చెప్పారని, కానీ వాస్తవంలో అది కార్యరూపం దాల్చలేదని ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లపై గతేడాది సెప్టెంబర్ 9న గృహనిర్మాణ మంత్రి అసెంబ్లీలో చేసిన ప్రకటన ప్రకారం ఇప్పటివరకు గ్రేటర్ హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు కేటాయిస్తే అందులో పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చింది కేవలం 128 మాత్రమేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,82,416 ఇళ్లను కేటాయించగా, 1,79,078 మాత్రమే ప్రారంభించారని, 1,03,338 ఇళ్లు అసలు ప్రారంభమే కాలేదని మంత్రి చెప్పారని వెల్లడించారు. 'పట్నం గోస' కార్యక్రమాన్ని రాజకీయా లకు అతీతంగా నిర్వహిస్తామన్నారు. ఇటు టీపీసీసీ కూడా దీన్ని త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం.

## అతి వేగం.. హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు

**ఎయిర్‌బ్యాగ్ తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం ■ కారొదిలి ముగ్గురు పరారీ**

**బంజారాహిల్స్:** బంజారాహిల్స్ రోడ్ నంబర్ 3లో ఆదివారం తెల్లవారుజామున అదుపుతప్పిన వేగంతో వచ్చిన ఓ కారు.. హోటల్‌లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో హోటల్‌తో పాటు కారు ముందు భాగం దెబ్బతింది. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో టీఎస్10ఈపీ6331 నంబర్ గల కారు జూబ్లీహిల్స్ నుంచి సాగర్ సొసైటీ మీదుగా పంజగుట్ట వైపు మితిమీరిన వేగంతో దూసుకొచ్చింది. మసీదు ముందు రోడ్డు డౌన్‌లో మలుపు ఉండటంతో కారు అదుపుతప్పి రాయల్ టిఫిన్ సెంటర్ కాంపౌండ్‌లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో టిఫిన్ సెంటర్‌లో రద్దీ తక్కువగా ఉండటంతో పెద్ద ప్రమాదమే తప్పింది. కారులో ముగ్గురు యువకులు ఉన్నారని, ప్రమాదానికి గురికాగానే కారును వదిలేసి పరారైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కారులో ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో అందులో ఉన్న వారు ప్రాణాలతో బయటపడ్డారు. బంజారాహిల్స్ ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకొన్నారు. యువకుల కోసం గాలిస్తున్నారు. మద్యం మత్తులో కారు నడిపినట్లుగా అనుమానిస్తున్నారు. కాగా, ఈ ప్రమాదపు స్పాట్‌ను.. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి పంజగుట్ట వెళ్లే రోడ్డులో డేంజరస్ స్పాట్‌గా పోలీసులు గతంలోనే గుర్తించారు. ఆ స్థలంలోనే ప్రమాదం జరిగింది.

## మద్యం మత్తు కారు పల్టీ.. ముగ్గురి మృతి

**కారులోనే ప్రాణాలు విడిచిన మిత్రులు ■ కర్మన్‌ఘాట్ ప్రాంతంలో దుర్ఘటన**

**చంపాపేట:** సాగర్ రోడ్డు నుంచి చంపాపేటకు వెళుతున్న కారు కర్మన్‌ఘాట్ ప్రాంతంలో అతి వేగంతో అదుపు తప్పి పల్టీలు కొడుతూ.. పక్కనే ఉన్న ఫుడ్‌పాయింట్ గోడకు ఢీకొన్న ఘటనలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రైవేట్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి కథనం ప్రకారం.. సైదాబాద్‌లోని మాధవనగర్ ఎల్‌ఐసీ కాలనీకి చెందిన మాడపాటి వినాయక మల్లికార్జున్ (29), మారుతీనగర్‌కు చెందిన ధరావత్ శ్రీరాం నాయక్ (28), సైదాబాద్ సరస్వతీనగర్ కాలనీకి చెందిన పబ్బా సాయినాథ్, నాగోల్ మారుతీనగర్ కాలనీకి చెందిన కల్యాణ్ (27), సైదాబాద్ డిఫెన్స్ కాలనీకి చెందిన షేక్ గుల్జార్ అహ్మద్ (26), నాగోలు బండ్లగూడకు చెందిన బొట్ట యువమిత్ర (25) స్నేహితులు. శనివారం సాయంత్రం అందరూ కలిసి గుర్రంగూడలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో పార్టీ చేసుకుని మద్యం తాగారు. తిరిగి వచ్చే క్రమంలో సాయినాథ్‌కు చెందిన బైక్‌పై షేక్‌గుల్జార్ అహ్మద్, యువమిత్ర ఇంటికి బయల్దేరారు. మల్లికార్జున్, సాయినాథ్, శ్రీరాంనాయక్, కల్యాణ్ కారులో బయల్దేరారు. చంపాపేట వైపు వస్తుండగా కర్మన్‌ఘాట్ చౌరస్తా దాటాక కారు అదుపుతప్పింది. మొదట రోడ్డుకు ఎడమ వైపు ఉన్న చెట్టును ఢీకొని పల్టీలు కొడుతూ వెళ్లి 15 అడుగుల దూరంలో ఉన్న లక్ష్మీశ్రీ మెస్ అండ్ ఫుడ్ కోర్టు ముందు ఉన్న ఎగ్జాస్ట్ గొట్టాన్ని ఢీకొని ఆగిపోయింది. కారు నడుపుతున్న మల్లికార్జున్, కారులో ఉన్న శ్రీరాంనాయక్, సాయినాథ్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక సీట్లో కూర్చున్న కల్యాణ్ సీట్ బెల్ట్ పెట్టుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

**అతివేగమే కారణం..**


మద్యం మత్తులో కారు నడపడం, అతివేగమే ప్రమాదానికి కారణాలుగా భావిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రమాదం జరిగిన తీరు చూస్తుంటే కారు వేగం 120–140 మధ్య ఉండవచ్చన్నారు. నవంబర్ 25 నుంచి జనవరి 22 వరకు ఈ కారుపై ఓవర్ స్పీడ్ చలాన్లు రూ.6,375 మేరకు బకాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు.

**మృతుల నేపథ్యం..**

మల్లికార్జున్ గచ్చిబౌలి ఎస్సెంచర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోది. 8 నెలల క్రితమే ప్రేమ వివాహం చేసుకున్నట్లు తెలిసింది. దరావత్ శ్రీరాంనాయక్ మాదాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. పబ్బా సాయినాథ్ ప్రైవేట్ కంపెనీలో మార్కెటింగ్ ఉద్యోది. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన దరావత్ లచ్చిరామ్, జ్యోతి దంపతులకు ఇద్దరు సంతానం. 20 ఏళ్ల క్రితం వీరు నగరానికి వలసవచ్చి మారుతీనగర్ కాలనీలో స్థిరపడ్డారు. వీరి కుమారుడు శ్రీరాంనాయక్ బీటెక్, ఎంబీఏ పూర్తిచేసి మాదాపూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అందరితో కలసిమెలసి ఉండే తమ కుమారుడిని మృత్యువు లాక్కెళ్లిందని శ్రీరాం మృతదేహం ముందు తండ్రి లచ్చిరామ్‌నాయక్ భోరున విలపించడం కంట తడి పెట్టించింది. తోటి ఉద్యోగులు, స్నేహితులు, బంధువులు శ్రీరాం నివాసానికి పెద్దసంఖ్యలో తరలిరావడంతో కాలనీలో విషాద ఛాయలు నెలకొన్నాయి.




బంజారాహిల్స్ రోడ్ నం.3లోని రాయల్ టిఫిన్స్‌లోకి దూసుకెళ్లిన కారు



మల్లికార్జున్ (ఫైల్)



శ్రీరాంనాయక్ (ఫైల్)



సాయినాథ్ (ఫైల్)



నుజ్జునుజ్జయిన కారు





# ఐటీసీ మౌర్య.. విలాస స్వర్గం

## ట్రంప్ కోసం భారీ ఏర్పాట్లు

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనలో భాగంగా సోమవారం రాత్రి ఢిల్లీలో ఉన్న ఐటీసీ మౌర్యలో బస చేయనున్నారు. దీనికోసం హోటల్లో ఇప్పటికే సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. హోటల్ మొత్తాన్ని ట్రంప్, ఆయనతో వస్తున్న వారి కోసం బుక్ చేసేశారు. ఈ హోటల్లోని గ్రాండ్ ప్రెసిడెన్షియల్ సూట్ (చాణక్య)లోనే గతంలో భారత్ వచ్చిన అమెరికా అధ్యక్షులు జిమ్మీ కార్టర్, బిల్ క్లింటన్, జార్జ్ బుష్‌లు బస చేశారు. పర్వతాలపై ఉండే పవనాలను గుర్తుతెచ్చే గాలిని ఎయిర్ ప్యూరిఫైయర్ల ద్వారా హోటల్లో అందించనున్నారు. ట్రంప్ ఉండే చాణక్య సూట్‌లో ప్రైవేట్ డ్రాయింగ్ రూమ్, ప్రైవేట్ టెర్రస్, జిమ్, ప్రైవేటు మార్గం ఉన్న డైనింగ్ ఏరియా, హైస్పీడ్ ఎలివేటర్, భద్రతా వ్యవస్థ, ప్రెసిడెన్షియల్ ఫ్లోర్ బట్లర్లు ఉన్నాయని ఆ హోటల్ చెబుతోంది. రెండు పడక గదులు ఉన్న చాణక్యలో పెద్ద లివింగ్ రూం, స్టడీ రూం, నెమలి రూపాలతో డిజైన్ చేసిన 12 సీట్ల ప్రైవేట్ డైనింగ్ రూం, అధునాతన బాత్‌రూంలు ఉన్నాయి. ఇందులో అత్యంత ఆధునిక సాంకేతికత కలిగిన 55 అంగుళాల హై డెఫినిషన్ టీవీ, ఐపాడ్ డాకింగ్ స్టేషన్ ఉన్నట్లు తెలిపింది. ఆహారాన్ని పరీక్షించేందుకు మైక్రోబయోలాజికల్ లాబొరేటరీ సైతం ఉన్నట్లు చెప్పింది. బయట వైపు గాలి విషతుల్యంగా ఉన్నప్పటికీ లోపల మాత్రం స్వచ్ఛమైన గాలిని అందించే ఫిల్టర్లు ఉన్నట్లు తెలిపింది.

**భారతీయ సంప్రదాయంతో స్వాగతం..**

ఐటీసీ మౌర్య హోటల్‌కు రానున్న ట్రంప్ దంపతులకు హోటల్



వద్ద భారతీయ సంస్కృతీ సంప్రదాయాలతో కూడిన స్వాగత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రెండు చేతులు నమస్కరించి ఆహ్వానించేలా ఐటీసీ మౌర్య లోగోను డిజైన్ చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించిన వ్యక్తులు ట్రంప్ దంపతులను స్వాగతించనున్నారు. ఇటువంటి ఏర్పాట్లనే అమెరికా గత ప్రెసిడెంట్లు వచ్చినపుడు కూడా ఏర్పాటు చేశారు. హోటల్ వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు.



భారత్‌కు బయల్దేరే ముందు మేరీల్యాండ్‌లోని ఎయిర్‌బేస్‌లో 'ఎయిర్‌ఫోర్స్ వన్' విమానం ఎక్కేందుకు వస్తున్న ట్రంప్, మెలానియా

# మోదీ, నేను మంచి ఫ్రెండ్స్!

వాషింగ్టన్/న్యూఢిల్లీ

భారత ప్రధాని నరేంద్రమోదీ తనకు మంచి స్నేహితుడని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. తామిద్దరి మధ్య మంచి సంబంధాలున్నాయన్నారు. భారత్ పర్యటనకు బయల్దేరే ముందు ట్రంప్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. భారత్‌కు వస్తానని చాలా రోజుల క్రితమే మాట ఇచ్చానని ఈ సందర్భంగా తెలిపారు. 'భారత ప్రజలతో మమేకమయ్యేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. నా పర్యటన సందర్భంగా అక్కడ ఒక పెద్ద కార్యక్రమం జరగబోతోందని విన్నా. భారత్‌లో ఇంతవరకు జరగనంత భారీ కార్యక్రమం అది అని భారత ప్రధాని నాకు చెప్పారు. భారత ప్రధాని మోదీ నా స్నేహితుడు. మేమిద్దరం బాగా కలిసిపోతాం' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**భారత్ ఎదురు చూస్తోంది: మోదీ**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్వాగతం పలికేందుకు భారత్ ఎదురుచూస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్వాగతం పలకడం గౌరవంగా భావిస్తున్నానన్నారు.

# విజయాలు.. వివాదాలతో సహజీవనం!

## ట్రంప్ జీవితం ఆద్యంతం ఆసక్తికరం..స్ఫూర్తిదాయకం

'కఠిన కాలాన్ని ఎదుర్కోవడం అద్భుతమైన అనుభవం. జీవితంలో ఒక్కసారైనా ఆ అనుభవం పొందాలి'– అమెరికా 45వ అధ్యక్షుడైన డొనాల్డ్ జాన్ ట్రంప్‌నకు ఇష్టమైన సొంత కొటేషన్ ఇది. ట్రంప్ జీవితాన్ని కొంతవరకు ఈ కొటేషన్ ప్రతిబింబిస్తుంది. ట్రంప్ జీవితంలో విజయాలు, వైఫల్యాలు, వివాదాలు.. ప్రశంసలు, విమర్శలు.. అవహేళనలు, ఆత్మీయతలు.. అన్నీ కనిపిస్తాయి. అదీ ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. అన్నింటినీ ఆయన ఒక్కలాగే తీసుకోవడం కూడా కనిపిస్తుంది. 'డబ్బు కోసం నేను పనిచేయడం లేదు. నా దగ్గర కావల్సినంత డబ్బు ఉంది. అవసరమైన దానికన్నా ఎక్కువే ఉంది. పని చేయడం కోసమే పని చేస్తున్నాను. వ్యాపారం నా కళాత్మక విధానం' అంటారు ట్రంప్.

**తండ్రి ఫేమస్ రియల్టర్**

డొనాల్డ్ ట్రంప్ న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో ఫ్రెడెరిక్ ట్రంప్, మేరీ మెక్‌లియడ్ దంపతులకు 1946 జూన్ 14 వ తేదీన జన్మించారు. ఫ్రెడెరిక్ ట్రంప్ క్వీన్స్‌లో పేరెన్నిక గన్న బిల్డర్, రియల్టర్. క్వీన్స్, స్టేటెన్ ఐలాండ్, బ్రూక్లిన్‌ల్లో మధ్యతరగతి వాసులకు చవకగా అపార్ట్‌మెంట్స్ నిర్మించి ఇచ్చేవాడు. మేరీ కుటుంబం స్కాట్‌లాండ్ నుంచి వలస వచ్చింది. ఫ్రెడ్, మేరీల వివాహం 1936లో జరిగింది. వారి ఐదుగురు పిల్లల్లో డొనాల్డ్ ట్రంప్ నాలుగవ వాడు. ఫోర్డమ్ యూనివర్సిటీ, వార్టన్ స్కూల్ ఆఫ్ ఫైనాన్స్, న్యూయార్క్ మిలటరీ అకాడమీల్లో ట్రంప్ విద్యనభ్యసించారు. మిలటరీ అకాడెమీలో స్టార్ అథ్లెట్‌గా, విద్యార్థి నాయకుడిగా ట్రంప్ నిలిచారు. ఆ తరువాత తన తండ్రి వారసత్వంగా రియల్టీ బిజినెస్‌లోకి దిగారు. కొద్ది కాలంలోనే అత్యంత విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగారు. మన్‌హటన్‌లో భారీ ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తిచేశారు. 1980లో న్యూయార్క్‌లో ప్రారంభించిన 'గ్రాండ్ హయత్ న్యూయార్క్' ప్రాజెక్టు ఆయనకు డెవలపర్‌గా గొప్ప పేరు తీసుకువచ్చింది. రియాలిటీ టీవీ స్టార్ గానూ ట్రంప్ ప్రఖ్యాతి గాంచారు. 'ది అప్రెంటిస్' పేరుతో ఆయన ప్రారంభించిన రియాలిటీ షో బాగా పాపులర్ అయింది. ఆ తరువాత రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్న ట్రంప్.. రిపబ్లికన్ పార్టీలో సభ్యత్వం తీసుకున్నారు. 2015లో మెజారిటీ ప్రైమరీల్లో, కాకస్‌ల్లో విజయం అనంతరం రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా 2016 ఎన్నికల బరిలో నిలిచి, గెలిచారు.

**సోదరుడి ప్రభావం**

మద్యం వ్యసనానికి లోనై చనిపోయిన తన సోదరుడు ఫ్రెడ్ ట్రంప్ జూనియర్ ప్రభావం డొనాల్డ్ ట్రంప్‌పై ఎక్కువగా ఉంటుంది. ఈ విషయం ట్రంప్ పలు సందర్భాల్లో స్వయంగా చెప్పారు. సోదరుడి మరణం తరువాత తాను ఆల్కహాల్ ముట్టనని, డ్రగ్స్ తీసుకోనని ట్రంప్ శపథం చేశారు. మతపరంగా, ట్రంప్‌ను ఆయన తల్లి ప్రెస్బిటేరియన్‌గా పెంచినప్పటికీ.. తనను తాను మెయిన్‌లైన్ ప్రొటెస్టెంట్‌నని ఆయన చెప్పుకుంటారు. ట్రంప్ వ్యాపారాల్లో ముఖ్యమైనవి ట్రంప్ ఆర్గనైజేషన్, అట్లాంటిక్‌లో కేసినోలు, టీవీ షోలు.

**ద ఆర్ట్ ఆఫ్ ద డీల్**

1987లో టోనీ ష్వాజ్‌తో కలిసి ట్రంప్ 'ద ఆర్ట్ ఆఫ్ ద డీల్' అనే పుస్తకం రాశారు. అందులో తన వ్యాపార విజయరహస్యాలను వివరించారు. న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లర్స్ లిస్ట్‌లో ఆ పుస్తకం నిలిచింది. కానీ, ఎన్ని కాపీలు అమ్ముడయ్యాయనే విషయంలో కచ్చితమైన సమాచారం లేదు. 'క్రిపుల్డ్ అమెరికా: హౌ టు మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అనే పుస్తకం కూడా ట్రంప్ రాశారు. 2005లో ఆయన 'ట్రంప్ యూనివర్సిటీ'ని స్థాపించారు. అందులో రియల్ ఎస్టేట్ వ్యాపార మెళకువలను కోర్సులుగా నేర్పించేవారు.



మొదటి భార్య ఇవానా, కూతురు ఇవాంకా, కొడుకు ఎరిక్‌లతో ట్రంప్ (ఫైల్)

**ఇవానా.. మేపుల్స్.. మెలానియా**

ట్రంప్ మొదట 1977లో ఇవానాను వివాహం చేసుకున్నారు. ఇవానా అప్పటికే ప్రముఖ ఫ్యాషన్ మోడల్. వారికి ముగ్గురు పిల్లలు. వారు డొనాల్డ్ ట్రంప్ జూనియర్, ఇవాంకా, ఎరిక్. 1992లో ట్రంప్, ఇవానా విడాకులు తీసుకున్నారు. ఆ తరువాత, 1993లో ట్రంప్ మార్లా మేపుల్స్‌ను పెళ్లి చేసుకున్నారు. ఆమె నటి. వారికి టిఫానా అనే కూతురు ఉంది. 1999లో మేపుల్స్‌కు 20 లక్షల డాలర్ల పరిహారం చెల్లించి ట్రంప్ విడాకులు తీసుకున్నారు. ఆ తరువాత 2005లో మెలానియాను ట్రంప్ వివాహమాడారు. ఆమె స్లొవేనియాకు చెందిన మాజీ మోడల్. ట్రంప్ కన్నా వయసులో 23 ఏళ్లు చిన్న. ట్రంప్, మెలానియాల సంతానం బారన్ విలియమ్. డొనాల్డ్ ట్రంప్ పిల్లల్లో డొనాల్డ్ జూనియర్, ఎరిక్‌లు వారి కుటుంబ వ్యాపార సామ్రాజ్యం 'ట్రంప్ ఆర్గనైజేషన్'లో వైస్ ప్రెసిడెంట్స్‌గా ఉన్నారు.

# సీక్రెట్ ఏజెన్సీ ఏం చేస్తుంది?

అమెరికా అధ్యక్షుడితోపాటు ఆయన కుటుంబం రక్షణ బాధ్యతలను చూసుకునే బాధ్యత అమెరికా సీక్రెట్ సర్వీస్ ఏజెన్సీదే. ప్రథమ పౌరుడి రక్షణకు సంబంధించిన ప్రతి విషయాన్నీ ఈ విభాగమే పర్యవేక్షిస్తుంటుంది. అధ్యక్షుడు ప్రయాణించే మార్గాన్ని శుభ్రంగా ఉంచటంతోపాటు అనుకోని ఆపద ఎదురైతే తప్పించుకునే మార్గాలు, ప్రణాళికలు సిద్ధంగా ఉంచుతుంది. ప్రమాదం సంభవిస్తే అవసరమైన రక్తాన్ని కూడా సిద్ధంగా ఉంచుతుంది. అధ్యక్షుడిని ఎల్లప్పుడూ అనుసరించి ఉండే వారికీ ఈ విభాగం రక్షణ కల్పిస్తుంది. అధ్యక్షునితో పాటు ఎల్లప్పుడు ఉండేవాటిలో 20 కిలోల బరువుండే జీరో హాలిబర్టన్ నల్లటి బ్రీఫ్‌కేస్ కూడా ఒకటి. ఇందులో అమెరికా అణు క్షిపణుల రహస్య కోడ్ భద్రపరిచి ఉంటుంది. అధ్యక్షుడు విశ్రాంతి తీసుకునే గది వరకు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ అనుసరిస్తూనే ఉంటాడు. చట్టం ప్రకారం.. తనను ఒంటరిగా వదిలి వేయాలని అధ్యక్షుడు సైతం ఆ అధికారిని ఆదేశించలేడు. 1865లో ఏర్పాటైన ఈ విభాగం 1901 నుంచి అధ్యక్షుడికి రక్షణగా నిలుస్తోంది. సుమారు 7 వేల మందితో కూడిన ఈ విభాగంలో 25% మహిళ లుంటారు. ప్రపంచంలోని ఏ దేశ సైన్యం కంటే కూడా అత్యంత కఠినమైన శిక్షణ వీరికి ఇస్తారు. సీక్రెట్ సర్వీస్ కోసం అందిన ప్రతి 100 దరఖాస్తుల్లో ఒకటి కంటే తక్కువగానే ఎంపిక వుతుంటాయి. వర్జీనియాలో ఉండే ఈ విభాగంలో శిక్షణ పొందిన వారు.. అధ్యక్షుడి కోసం ప్రాణాలైనా అర్పిస్తామంటూ హాలీవుడ్ సినిమాల్లో చూపిస్తున్న విధంగా ప్రమాణ చేయరట!

# కట్టుదిట్టమైన ఏర్పాట్లు



అహ్మదాబాద్‌లోని ఓ రహదారిలో గస్తీకాస్తున్న సరిహద్దు భద్రతా బలగాలు

- ఎక్కడికక్కడ వైమానిక నిఘా
- గుజరాత్ చేరుకున్న 10 వేల మంది పోలీసులు
- రోడ్‌షో మార్గాల్లో భారీ బందోబస్తు

**న్యూఢిల్లీ/అహ్మదాబాద్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు రానున్న నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాట్లు చేశారు. ట్రంప్ బస చేయనున్న ఐటీసీ మౌర్య హోటల్, రోడ్‌షో నిర్వహించనున్న మార్గాల్లో ఇప్పటికే పలుమార్లు తనిఖీలు నిర్వహించారు. సర్దార్ పటేల్ మార్గ్, మౌర్య హోటల్ సమీపంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వందల సంఖ్యలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని మౌర్య హోటల్ వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. హోటల్‌లోని ప్రతి ఫ్లోర్‌లో ఢిల్లీ పోలీసులు సివిల్ దుస్తుల్లో పెట్రోలింగ్ నిర్వహించనున్నారు. అమెరికాకు చెందిన సీక్రెట్ సర్వీస్ అధికారులు, భారత్‌కు చెందిన జాతీయ భద్రతా సిబ్బంది (ఎన్ఎస్‌జీ), స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ అధికారులతో పాటు భారీ సంఖ్యలో పోలీసులు ఇప్పటికే నగరానికి చేరుకున్నారు. ఢిల్లీ పోలీసులు సైతం వీరికి జతకలిశారు. వీరితో పాటు దాదాపు 10 వేల మంది పోలీసులు గుజరాత్‌లోని పలు వ్యూహాత్మక ప్రాంతాల్లో పహారా కాస్తున్నారు. 25 మంది ఐపీఎస్ ఆఫీసర్లు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందాలు, స్టేట్ రిజర్వ్ పోలీసులు, చేతక్ కమాండోలు, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్‌లు సైతం వీరికి జతకలిశాయి. అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి మొటెరా స్టేడియం వరకు దాదాపు 22 కి.మీ. మేర ట్రంప్, మోదీల రోడ్‌షో జరగనున్న నేపథ్యంలో పరిసరాలను గమనించేందుకు పోలీసులు డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించనున్నారు. బాంబు పేలుళ్ల వంటివి సంభవించకుండా అధునాతన పరికరాల సాయంతో రోడ్డు మార్గాన్ని పలుమార్లు జల్లెడ పట్టారు. రోడ్‌షో జరిగే మార్గంలో 100 వాహనాలతో రిహార్సల్ నిర్వహించారు.

**మెలానియాకు సైతం..**

అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించనున్న నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. ట్రంప్ పర్యటించనున్న అన్ని మార్గాల్లో డబుల్ బ్యారికేడింగ్ ఏర్పాటు చేశారు. ఈ మార్గాలపై వైమానిక నిఘా ఉంచారు.

## సబర్మతి ఆశ్రమానికి

తొలిసారిగా భారత్ పర్యటనకు వస్తున్న ట్రంప్ సోమవారం గుజరాత్‌లోని సబర్మతీ ఆశ్రమాన్ని సందర్శించనున్నట్లు సిటీ పోలీసు కమిషనర్ ఆశిష్ భాటియా వెల్లడించారు. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి భారీ రోడ్‌షోలో పాల్గొననున్న ట్రంప్.. మార్గమధ్యంలో సబర్మతీ ఆశ్రమాన్ని సందర్శించనున్నారని చెప్పారు. దాదాపు 15 నిమిషాల పాటు ఆయన ఆశ్రమంలో గడపనున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత తిరిగి రోడ్‌షోను కొనసాగిస్తారని వెల్లడించారు. ట్రంప్ ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను కూడా సందర్శించనున్నట్లు తెలిపారు. ట్రంప్‌తో పాటు ప్రధాని మోదీ సైతం సబర్మతీ ఆశ్రమాన్ని సందర్శించనున్నారు. ట్రంప్ హృదయ్ కుంజ్‌ను సందర్శించనున్నారని సబర్మతీ ఆశ్రమం సెక్రటరీ అమృత్ మోదీ వెల్లడించారు. ట్రంప్ రాక సందర్భంగా ఆశ్రమంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.





ఇవాంకా, కుష్నర్

## సీనియర్ సలహాదారులు..

# కూతురు, అల్లుడు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెంట భారత్ వచ్చే ప్రతినిధి బృందంలో ట్రంప్ కూతురు ఇవాంకా, అల్లుడు కుష్నర్ కూడా ఉన్నారు. మొదటి భార్య ఇవానా ద్వారా కలిగిన సంతానం ఇవాంకా ట్రంప్. ఈమె 1981లో న్యూయార్క్‌లో జన్మించారు. పదేళ్ల వయస్సులోనే ట్రంప్, ఇవానా విడాకులు తీసుకున్నారు. ఈమెకు డొనాల్డ్ జూనియర్ ట్రంప్, ఎరిక్ సోదరులున్నారు. వార్టన్ స్కూల్ ఆఫ్ ది యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో చదువుకున్నారు. యూదుడైన జేర్డ్ కుష్నర్‌ను 2009లో వివాహమాడారు. దీంతో ఇవాంకాకు యేల్ కుష్నర్ అనే పేరు కూడా ఉంది. అమెరికా ప్రథమ పౌరుడి కుటుంబంలో ఒక యూదు సభ్యురాలు కావడం ఇదే ప్రథమం. 2005లో ట్రంప్ వ్యాపార సామ్రాజ్యంలో డెవలప్‌మెంట్ అండ్ అక్విజిషన్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. 2007లో డైనమిక్ డైమండ్ కార్పొరేషన్‌తో కలిసి ఇవాంకా ట్రంప్ ఫైన్ జ్యువెల్లరీ అనే బ్రాండెడ్ రిటైల్ స్టోర్‌ను మన్‌హట్టన్‌లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇవాంకా బ్రాండెడ్ స్టోర్లు అమెరికా, కెనడాతోపాటు బహ్రెయిన్, కువాయిట్, ఖతర్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోనూ ఉన్నాయి. 2017లో ట్రంప్ వ్యాపార సామ్రాజ్య బాధ్యతల నుంచి అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగంలో సీనియర్ సలహాదారుగా భర్త జేర్డ్ కుష్నర్‌తో పాటు బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి వేతనం అందుకోకున్నా ఎంతో కీలకమైన ప్రభుత్వ పత్రాలను సైతం పరిశీలించే అధికారం ఆమెకు ఉంటుంది. సుమారు 300 మిలియన్ డాలర్ల ఆస్తికి ఇవాంకా యజమాని. ఇవాంకా భర్త జేర్డ్ కోరె కుష్నర్ రియల్ ఎస్టేట్ వ్యాపారి, వార్తా పత్రిక యజమాని, పెట్టుబడిదారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సీనియర్ సలహాదారుగా పనిచేస్తున్నారు. చార్లెస్ కుష్నర్, సెరిల్ కుష్నర్ దంపతులకు 1981లో జన్మించిన కుష్నర్ న్యూయార్క్ వర్సిటీ నుంచి లా చదివారు. ఈ దంపతులకు అరబెల్లా రోజ్ కుష్నర్, థియోడర్ జేమ్స్ కుష్నర్, జోసెఫ్ ఫ్రెడెరిక్ కుష్నర్ అనే ముగ్గురు సంతానం.

# గంటకు 1.02 కోట్లు

రష్యా అధ్యక్షుడి మెర్సిడెంజ్ బెంజ్ కారు, చైనా అధ్యక్షుడి హాంగ్‌కి ఎల్5 కారుతో పోల్చుకుంటే అమెరికా అధ్యక్షుడి కారు బీస్ట్ చాలా ఖరీదైంది. అధునాతనమైంది కూడా. అలాగే, అమెరికా అధ్యక్షుడి ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం గంట ప్రయాణానికి రూ.1.02 కోట్లు ఖర్చవుతుందట. ఈ విమానంలో పెద్ద ఆఫీసు, కాన్ఫరెన్స్ హాల్, వంద మందికి సరిపడా ఆహారం వండేందుకు వీలుగా ఏర్పాట్లు ఉన్నాయి. అధ్యక్షుడికి విలాసవంతమైన



సౌకర్యాలతో కూడిన సూట్ ఉంటుంది. మొత్తంగా ఇది ఒక విమానం మాదిరిగా కాకుండా హోటల్‌గా ఉంటుంది. అణ్వస్త్రం, క్షిపణి దాడిని సైతం తట్టుకునేలా ఇందులో ఏర్పాట్లుంటాయి. అమెరికాపై దాడి జరిగినప్పుడు ప్రతిస్పందించేలా ఎయిర్ ఫోర్స్ వన్ సంచార కమాండ్ సెంటర్‌గా పనిచేస్తుంది. వీటితోపాటు అధ్యక్షుడి భారీ కారు లిమోజిన్, వెయ్యి మంది సిబ్బంది, ప్రత్యేక రక్షణ పరికరాలు.. వీటన్నిటికీ సీ5 రకం కార్గో విమానం ఉంటుంది. 2017లో ట్రంప్ జెరుసలేం పర్యటనకు వెళ్లినప్పుడు కింగ్ డేవిడ్ హోటల్‌లో బస చేశారు. ఆ హోటల్‌లో ఒక్క రాత్రికి రూ.3.95 లక్షలుండే సూట్‌లతోపాటు సిబ్బంది కోసం 1,100 రూంలను బుక్ చేయాల్సి వచ్చిందట.





# ట్రంపేంద్ర బాహుబలి

**వాషింగ్టన్:** తన ముఖాన్ని తెలుగు బ్లాక్‌బస్టర్ సినిమా 'బాహుబలి'లో నాయకుడి ముఖంగా మార్చి రూపొందించిన వీడియోను ట్రంప్ రీట్వీట్ చేశారు. సోల్ అనే ట్విట్టర్ ఖాతాదారుడు రూపొందించిన ఆ వీడియో దాదాపు 81 సెకన్ల నిడివి ఉంది. 'యూఎస్ఏ అండ్ ఇండియా యునైటెడ్' పేరుతో ఆ వీడియో ఉంటుంది. బాహుబలిలోని పలు సన్నివేశాల్లో ట్రంప్‌ను, ఆయన భార్య మెలానియా, పిల్లలు ట్రంప్ జూనియర్, ఇవాంకాలను చేరుస్తూ రూపొందించిన ఈ వీడియో.. ట్రంప్ రీట్వీట్ తర్వాత ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది.

సాక్షి సాహిత్యం



నల్లగొండ | సోమవారం
ఫిబ్రవరి | 24 | 2020
sakshisahityam@gmail.com

## గ్రహం అనుగ్రహం


శ్రీ వికారినామ సంవత్సరం. ఉత్తరాయణం, శిశిర ఋతువు. ఫాల్గుణ మాసం. తిథి శు.పాడ్యమి రా.9.34 వరకు, తదుపరి విదియ. నక్షత్రం శతభిషం ప.3.10 వరకు, తదుపరి పూర్వాభాద్ర. వర్జ్యం రా.10.11 నుంచి 11.56 వరకు. దుర్ముహూర్తం ప.12.35 నుంచి 1.22 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.44 వరకు. అమృత ఘడియలు ఉ.7.17 నుంచి 9.01 వరకు

**సూర్యోదయం:** 6.26 **సూర్యాస్తమయం:** 6.00 ;
**రాహుకాలం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు.
**యమగండం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు

## నమాజ్ వేళలు

ఫజర్: 5.26 జొహర్: 12.29
అసర్: 4.43 మగ్రీబ్: 6.21 ఇషా: 7.33

## ఈవారం పుస్తకాలు




### అమ్మకు బహుమతి (కథలు)

రచన: సింహప్రసాద్ ; పేజీలు: 184 ; వెల: 80 ;

### వెండిగిన్నెలో పాలబువ్వ (నవల)

రచన: సింహప్రసాద్ ; పేజీలు: 160 ; వెల: 70 ; ప్రతులకు: శ్రీశ్రీ ప్రచురణలు, 401, మయూరి ఎస్టేట్స్, ఎంఐజి–2–650, కేపీహెచ్‌బి కాలనీ, హైదరాబాద్–85. ఫోన్: 9849061668

### ఎన్.గోపి కవితా తత్త్వ వివేచన




రచన: పెన్నా శివరామకృష్ణ; పేజీలు: 128 ; వెల: 100 ; ప్రతులకు: ఇంటి నం.185, 3–2–134/ఎ, శాతవాహన కాలనీ, రోడ్ నం. 5, ఎల్బీ నగర్, హైదరాబాద్–74. ఫోన్: 9440437200

### పంచమ వసంతం (వ్యాసాలు)




రచన: దొంత భద్రయ్య ; పేజీలు: 186 ; వెల: 150 ; ప్రతులకు: రచయిత, 10–121, సూపర్ బజార్, హుజూరాబాద్, కరీంనగర్–505468. ఫోన్: 9966677149

### పుంభావ సరస్వతి–పుట్టపర్తి




రచన: డాక్టర్ పుట్టపర్తి నాగపద్మిని ; పేజీలు: 64 ; వెల: 50 ; ప్రతులకు: యువభారతి, తెలంగాణ సారస్వత పరిషత్ భవనం, తిలక్ రోడ్, హైదరాబాద్–500001.

### బాలల కోసం బాటసారి పదాలు



పేజీలు:72 ; వెల: 60 రచన: దర్భశయనం శ్రీనివాసాచార్య ; ప్రతులకు: కవి, ఆంధ్రా బ్యాంక్ అపెక్స్ కాలేజ్, ప్లాట్ నం. 27–29, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ, గచ్చిబౌలి, హైదరాబాద్–32. ఫోన్: 9440419039

### పరిసరాలు




**(రెండు భాగాలు ; తొలి ముద్రణ: 1956)** సంకలనం: వట్టికోట ఆళ్వారుస్వామి ; పేజీలు: 258 ; వెల: 120 ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్–500004. ఫోన్: 040–29703142

## బుక్ ప్రపంచం

మేడం గారు పది రోజుల క్రితం వంటా–తింటా పుస్తకం రివ్యూకు పంపారట. ఇంకా అచ్చుకాలేదేమని డైరెక్టుగా తేల్చుకుందామని అనుకుంటున్నారట సార్!




# కావ్యదహనోత్సవం



**ఆధునిక ఆంగ్ల కవిత్వ యుగప్రవక్తగా విఖ్యాతుడయిన గెరార్డ్ మేన్లీ హాప్కిన్స్ తన జీవితకాలంలో ఒక్క పద్యం కూడా అచ్చు వెయ్యలేదు. అతని కవిత్వమంటే ఇష్టమయినవాళ్లు అచ్చువేస్తామని చెప్పినా ఒప్పుకోలేదు.**

**త**న కావ్యాన్ని ఎవరూ చదవడం లేదని నిశ్చయమైన ఒక కవి, ఒక కొత్త సంప్రదాయానికి తెర తీస్తూ కావ్యదహనోత్సవానికి సిద్ధపడ్డాడు. దానికి తగినట్టుగా సభ ఏర్పాటైంది. అధ్యక్షుడు క్లుప్తంగా శ్రోతలకు విషయం వివరించి, కృతికర్తను మాట్లాడవలసిందిగా ఆహ్వానించాడు. అప్పుడు కృతికర్త ప్రసంగం ఇలా సాగింది:

ఒకళ్లనొకళ్లు పొగుడుకోవడంతో మొదలై, పార్టీలతో ఆఖరవుతున్న ఈనాటి సాహిత్య సభలని చూస్తున్న నేను; సాహిత్య సమస్యలని నిష్కపటంగా చర్చించే ఉదాత్త సభ చూడగలనా అనుకునేవాడిని. చచ్చిపోతే చచ్చిపోయింది కానీ, నాకింత ఉదాత్త సాహిత్యసభలో పాల్గొనే అవకాశం ఇచ్చినందుకు నా కావ్యానికి ధన్యవాదాలు అర్పించకుండా ఉండలేను.

కాలేజీ పత్రికలకి పద్యాలు, పెళ్లిళ్లకి పంచరత్నాలు రాయడంతో నా సాహిత్యజీవితం మొదలయ్యింది. నా దగ్గిర స్నేహితుడు ఒకడు చనిపోతే, షెల్లీ రాసిన ఎడొనోయిన్ దగ్గర పెట్టుకొని, 'విలపామి' అనే ఖండకావ్యాన్ని వ్రాశాను. ఆ పద్యాలు అచ్చవగానే, నా మిత్రులందరూ, 'నీలో సరికొత్త కంఠం మాకు గంభీరంగా వినపడుతున్నది' అని ఉబ్బేశారు. అప్పటికి నేను కవిననే భ్రాంతి నన్ను పూర్తిగా ఆవరించింది. నా వేషభాషల్లో కూడా మార్పు వచ్చింది. గ్లాస్గో పంచలు, పెద్ద జరీ పంచెలు, శాండో బనీను లీలగా కనిపిస్తూ వుండే తెల్లటి మల్లెపువ్వుల్లాంటి లాల్చీలు, నగిషీ చెక్కిన చెప్పులు, ఇవి నా ట్రేడుమార్కులు!

ఛందోకవిత్వం పేరుతో కొత్త కొత్త ప్రయోగాలు చెయ్యడం మొదలుపెట్టాను. చిత్రవిచిత్ర బంధనలతో రకరకాల సమాసాలతో, కవితలు వ్రాశాను. దేశంలో ఏ మూల సాహిత్య సభ పెట్టినా వెళ్లేవాడిని. సాహితీ సభలకు వెళ్లడానికి ఏ అర్హతా అక్కరలేదు కదా! అనతికాలంలోనే, దేశంలో హేమాహేమీ సాహిత్యవేత్తలంతా నాకు పరిచయం అయ్యారు. పబ్లిక్ మీటింగుల్లో కూడా నన్ను పొగడటం మొదలుపెట్టారు.

ఆరు నెలలు తిరక్కుండా ఒక చిన్న ఖండకావ్యానికి సరిపడే పద్యాలు, గేయాలు తయారు చేశాను. దానితో సర్వ యువకవి బంధువుగా ప్రసిద్ధికెక్కిన ఒక పీఠాధిపతి నన్ను వెన్ను చరిచి, తాను ఉపోద్ఘాతం రాస్తాననీ, అచ్చు వెయ్యమనీ వెంటపడ్డాడు. కావ్యానికి అగ్నిశంఖం అన్న పేరు ఆయనే పెట్టాడు.

మా వేలువిడిచిన పినతండ్రి ఒకాయన సెంటర్‌లో కాస్త పెద్ద పదవిలో ఉండటం మూలంగా కృతిపతిని వెతుక్కోవలసిన బాధ తప్పింది. ఆయనతో ఏవో లావాదేవీలుండి, మా ఇంటిచుట్టూ తిరిగే ఈ గోపాలరెడ్డి నా స్నేహం కట్టి, తనకి అంకితం ఇమ్మని కూచున్నాడు. పుస్తకం అచ్చుకయ్యే ఖర్చు కాకండా, ఆవిష్కరణ రోజున ఓ వెయ్యి నూటపదహార్లు ఇస్తానని చెప్పాడు.

పుస్తకం తెల్లటి పాలవెన్నెల లాంటి ఆర్ట్ కాగితాల మీద అచ్చయ్యింది. అప్పట్లో మత్స్య, అటవీ శాఖకి డిప్యూటీ మంత్రిగా ఉన్న ఒకాయన సభాధ్యక్షుడిగా వచ్చాడు. దినపత్రికల్లో మా బొమ్మలు బ్రహ్మాండంగా అచ్చయ్యాయి. రెండున్నరేళ్లు ఆ కైపులో కొట్టుకుపోయాను.

నా వ్రాతప్రతుల్లో ఎవరికయినా ఓపిక వుండి చూడగలిగితే, అసంపూర్తిగా వదిలేసిన ప్రబంధాలు, చంపూకావ్యాలు, వాస్తవిక, అధివాస్తవిక గేయాలు, 'నిజము అన్నపూర్ణ నీదు మాట' మకుటంతో వందలకొద్దీ పద్యాలు దొరుకుతాయి.

నేను నా గతజీవితంలోలాగా మీరు ఏ మాట చెబితే చప్పట్లు కొడతారో ఆ మాటలే చెప్పి సెభాస్ అనిపించుకోవాల్సిన అవసరం నాకు లేదు. అసలు ప్రపంచ సాహిత్యాలకంటే నా తెలుగు సాహిత్యం గొప్పదని విర్రవీగాను. ఏ భాషలోకి అనువదించినా ఇది కావ్యంగానే నిలబడుతుంది, అన్న కావ్యం ఒక్కటీ మనకు రాలేదు.

యునెస్కో వాళ్లు ఫ్రెంచ్‌లోకి అనువదిస్తాం, మీ కావ్యం ఒకటి చెప్పండయ్యా అని అంటే, మనవాళ్లు మీనమేషాలు లెక్కపెట్టి చివరికి వేమన పద్యాలు చూపించారు!

ఒకసారి ఆంధ్రాభ్యుదయోత్సవ సభకి ఉపన్యాసం ఇవ్వటానికి వెళ్లాను. సభ అధ్యక్షుడు హైస్కూలు హెడ్మాస్టరు. 'బాబూ! అన్నన్ని మాటలు వాడావు?' భ్రస్ఫుమర, అఘమర్షణ, నిబర్హణ, వీటికి అర్థం ఏమిటీ, అనడిగాడు. నా పద్యాల్లో నేను ఏ అర్థమూ వుద్దేశించి రాయలేదని నిరూపించాడు.

ఏలూరులో నేను నా మిత్రులూ రోజూ దాదాపు అరడజను పకోడీ పొట్లాలు తెప్పించుకునేవాళ్లం. పకోడీలు ఒక్కో షాపులో ఒక్కోరకంగా వుండేవి. కానీ, పొట్లం కటిన కాయితాలు మాత్రం అన్నీ అగ్నిశంఖం కాయితాలే!

నిజంగా కవిత్వం అంటే ఏమిటి? ఒక గొప్ప కావ్యం వ్రాయాలంటే సంపాదించుకోవలసిన వ్యుత్పత్తి ఎటువంటిది? ఎలాంటి అనుభవాలు ఒక వ్యక్తిని కవిగా చేస్తాయి? ఈ ప్రశ్నలు నన్ను వేధించటం మొదలెట్టాయి.

ఆధునిక ఆంగ్ల కవిత్వ యుగప్రవక్తగా విఖ్యాతుడయిన గెరార్డ్ మేన్లీ హాప్కిన్స్ తన జీవితకాలంలో ఒక్క పద్యం కూడా అచ్చు వెయ్యలేదు. అతని కవిత్వమంటే ఇష్టమయినవాళ్లు అచ్చువేస్తామని చెప్పినా ఒప్పుకోలేదు. ఒక దశలో అంతకు ముందు వ్రాసిన పద్యాలన్నీ చింపేసి, ఇక పద్యాలు రాయకూడదని శపథం కూడా చేయడం జరిగింది. అతను చనిపోయింతర్వాత అక్కడక్కడ అతని స్నేహితుల వద్దా, ఇతరత్రా దొరికిన 50, 60 పద్యాలు మాత్రం అతని మిత్రుడు రాబర్ట్ బ్రెడ్జెస్ ప్రకటించాడు. ఈనాడు హాప్కిన్స్ మీద వచ్చిన విమర్శక గ్రంథాలు ఒక బీరువాకి సరిపోతాయి.

క్షమించండి. ఇప్పటికే చాలాసేపు మాట్లాడి మిమ్మల్ని విసిగించాను. మనిషి సుఖంగా బ్రతకాలంటే కవిగా డబ్బా వాయించుకోనక్కరలేదు. ఏ దొరస్వామిలాగానో యూనివర్సిటీ ముందు ఒక కిళ్లీకొట్టు పెట్టుకొని ఆనెస్టుగా బ్రతకచ్చు. తెలుగు సాహిత్యంతో ఇక ఈ జన్మలో సంబంధం పెట్టుకోను. కొంతమందికి అనుమానం రావచ్చు; సినిమాలకి మాటలు పాటలు రాస్తానేమోనని. ఆ పనీ చెయ్యను. ఇక సెలవ్.

● కథాసారం

**ఇ**టు ఆకలి అటు కాకలి
అటు వేకువ ఇటు లోకువ
అటు మకుటం ఇటు కటకం
అటు సమరం ఇటు భ్రమరం
ఇటు కృస్చేవ్ అటు మిస్చీఫ్
ఇటు టర్కీ అటు గోర్కీ
నాలో మాత్రం సత్యం నిత్యం
నవ్య భవ్య దివ్యాకృతి (**'అగ్నిశంఖం'**)



కవిని ఎవరో కావ్యం రాయమని అభ్యర్థించటం, కవి కృతిని రాయటం, ఆ కృతికన్యను ఒక కృతిభర్తకి అంకితం ఇవ్వడం– ఇలాంటి కర్మలు మన సంప్రదాయంలో ఉన్నప్పుడు, ఎవరూ చదవని పుస్తకానికి దహనోత్సవం ఎందుకు చెయ్యకూడదు? ఈ సందేహం ఒకమారు వెల్చేరు నారాయణ రావుకు వచ్చింది. 'ఎవరైనా అటువంటి దహనకర్మ చేయటానికి ముందుకొస్తే నా పుస్తకాలు ఇస్తాను' అన్నారు ఆంధ్రవిశ్వకళా పరిషత్తు ప్రధాన లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న అబ్బూరి రామకృష్ణారావు. అదీ నాంది.

# ఒక చారిత్రక ప్రహసనం

ఇదే ఊతంగా ఒక ప్రహసనం రాశారు అప్పటికి నవయువకుడైన వేలూరి వేంకటేశ్వర రావు. 'కావ్యదహనోత్సవం' చేయాలంటే ముందు కవి కావాలి. అది వేలూరే. ఆయనో కావ్యం రాయాలి. రాశాడు(?). దాని పేరు అగ్నిశంఖం. 14–12–1960 రోజున ఆంధ్ర విశ్వకళా పరిషత్ ఆవరణలో దహనోత్సవం జరగనుందనీ, 'అమూల్య హర్షాశ్రుతర్పణము' వదలడానికి అందరూ రావాలనీ పత్రికలు కొట్టించారు. సభ అంటే దానికో అధ్యక్షుడు (మేడేపల్లి వరాహనరసింహ స్వామి) కావాలి, ప్రధాన వాహకుడు (ఎ.సత్యమూర్తి) ఉండాలి, కృతి భర్త (అనంతరం బంగోరెగా ప్రసిద్ధుడైన బి.గోపాలరెడ్డి) తప్పనిసరి. ఇంకా, శ్రోతల్లోంచి చీటీ పంపి మాట్లాడతాననే ఓ యువకుడు (చేకూరి రామారావు).

'అచ్చుయంత్రం ఏటేటా వేలు లక్షల పుస్తకాలు ప్రజల మీద పడేస్తున్నది. వీటిల్లో మంచి చెడ్డల ఎన్నిక బహు దుస్తరం అయిపోతున్నది' అంటూ అధ్యక్షుడు సభ ప్రారంభించాడు.

'ఒక తుచ్ఛకావ్యం యొక్క తుచ్ఛత్వం లోకానికంతటికీ తెలిసిన చాలా కాలానికిగానీ కవికి' తెలియదనీ, అలాంటిది 'అగ్నిశంఖం వ్రాసిన వేంకటేశ్వరరావు మా దగ్గరికొచ్చి, తన కావ్యం క్షుద్రకావ్యం అని' ఒప్పుకుని దహనోత్సవం జరిపించమన్నాడనీ నిర్వాహకుడు సభను ముందుకు జరుపుతాడు.

అనంతరం, ఈ దహనానికి ఎందుకు ఒప్పుకున్నాడో చెబుతూ కవి ప్రసంగిస్తాడు. **(ప్రసంగంలోని కొంతభాగం కథాసారంలో చూడండి.)** కవి అప్పటికే నన్నయ్య నుంచి నానాసాహెబ్ దాకా ఎన్నో ప్రయోగాలు చేసినవాడు. ఎన్నో బిరుదులు పొందినవాడు. కానీ ప్రచారం వలననే సాహిత్య విలువలు స్థిరపడుతున్నాయని జ్ఞానోదయమైంది. అందుకే, తన 'సర్వ రచనల మీద మమకారం వదులు'కుంటున్నానని సభాముఖంగా ప్రకటించాడు.

దహనం అంటే భౌతికంగా పుస్తకాన్ని తగలబెట్టడం కాదని వీళ్లందరికీ తెలుసు. తెలుగులో సాహిత్యం పేరుతో చలామణీ అవుతున్న చెత్తను గుర్తించాలని అదొక పిలుపు. అరవై ఏళ్ల కింద ఈ ఘటన సహజంగానే సంచలనం కలిగించింది. 'విష్ క్రెమేషన్ సక్సెస్' అని తంతి పంపించాడు శ్రీశ్రీ. మా ఊరికి ఎప్పుడు వస్తారని ఉత్తరం రాశాడు ఇస్మాయిల్. 'ఒక పుస్తకం మరణించిందని మీరెలా చెప్పగలరు?' అని నిలదీశాడు కొనకళ్ల వెంకటరత్నం.

నాటకం, వీధి నాటకం, నిజమైన మనుషులే పాత్రలు కావడం వల్ల ఇంకో వింత రూపం తెచ్చుకున్న ఈ ఘటన– ఇన్నేళ్లూ కేవలం సాహిత్య మరమరాలు కోవలో మౌఖిక ప్రచారంలో ఉండి, అప్పటి విశేషాలు కలుపుకుని వేలూరి 84వ యేట చిరుపుస్తకంగా వచ్చింది.

**వేలూరి వేంకటేశ్వరరావు అధ్యాపకుడిగానూ, పరిశోధకుడిగానూ పనిచేశారు. 'మెటమార్ఫసిస్', 'ఆ నేల, ఆ నీరు, ఆ గాలి' కథాసంపుటాలు వెలువరించారు. ఒరియా కవి సౌభాగ్యకుమార మిశ్ర కవిత్వం – 'అవ్యయ', 'ద్వాసుపర్ణా' తెలుగులోకి అనువదించారు. ప్రస్తుత నివాసం అమెరికా.**



**వేలూరి వేంకటేశ్వరరావు**

● కొత్త బంగారం


# వాతావరణ సూచన: హర్షాభావం

*అడవిలో నడుస్తున్న ఇద్దరు కొద్ది దూరంలో ఆకలిమీదున్న ఒక ఎలుగుబంటిని చూశారు. వెంటనే ఒకతను పారిపోవడానికి తయారైపోయాడు.*

*రెండో అతను, ''నువ్వెంత ప్రయత్నించినా ఎలుగుబంటి కంటే వేగంగా పరిగెత్తలేవు,'' అన్నాడు.*

*మొదటి వ్యక్తి అతన్ని చూసి–''ఫర్లేదు, నీకంటే వేగంగా పరిగెత్తితే చాలు కదా!'' అన్నాడు.*

**ఆ**రేళ్ల క్రితం డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పెక్యులేషన్ నవలతో సంచలనాన్ని సృష్టించిన అమెరికన్ రచయిత్రి జెన్నీ ఓఫిల్ తన తాజా నవల వెదర్‌లో 'లేట్ కాపిటలిజం' అంటే ఏమిటి అన్న ఒక ప్రశ్నకి ఇచ్చిన చమత్కార సమాధానం అది. అలాగని ఈ నవల లేట్ కాపిటలిజమ్ గురించి కాదు. హాస్య వ్యంగ్యాలు కథనశైలిలో ఒక భాగమే తప్ప, ఇది పూర్తిగా అలాంటి తరహా నవలా కాదు. వీటన్నింటినీ దాటుకుని వాతావరణం, పర్యావరణం, మనిషి మనుగడల మీదుగా నవల విస్తృతి కొనసాగుతుంది.



వెదర్



జెన్నీ ఓఫిల్

నవలలోని కథకురాలు లిజీ ఒక లైబ్రేరియన్. భర్త, కొడుకు, తమ్ముడి చుట్టూ ఆమె జీవితం అల్లుకుని ఉంటుంది. లిజీకి ఒకప్పటి ప్రొఫెసర్ అయిన సిల్వియా, వాతావరణంలో వస్తున్న పెనుమార్పుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తన ప్రసంగాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నిస్తూంటుంది. సిల్వియాకి ఉన్న పని ఒత్తిళ్ల వల్ల ఆమెకొచ్చే రకరకాల మెయిల్స్ చూసి సమాధానాలు ఇవ్వటానికి లిజీని కుదుర్చుకుంటుంది. ఆ మెయిల్స్‌లోని వైవిధ్యం చూసి లిజీ ఆశ్చర్యపోతుంది. పర్యావరణానికి మనిషి కలిగిస్తున్న హాని, తద్వారా వచ్చే వాతావరణ మార్పులు రానున్న ఉపద్రవానికి సూచనలనీ, ఆ ప్రమాదం సుదూర భవిష్యత్తులో కాదనీ, అనుకున్న దాని కంటే చాలా వేగంగా సమీపిస్తోందనీ ఎంతో మంది ఆందోళన చెందటం ఆ మెయిల్స్‌లో గమనిస్తుంది. ముంచుకొస్తున్న వినాశనాన్ని ఎవరూ సరిగ్గా అంచనా వేయని అలసత్వాన్ని గుర్తిస్తుంది. రాబోయే తరాల భద్రత గురించి ఎలాంటి అనుమానాలూ లేని లిజీకి ఈ కొత్త ఎరుక ఉలికిపాటుని కలిగిస్తుంది. తన పిల్లవాడి గురించీ, తరువాతి తరాల గురించీ ఆలోచిస్తున్న లిజీతో ''నువ్వు నీ పిల్లల్ని వీటన్నిటినుంచీ రక్షించగలననే అనుకుంటున్నావా?'' అని ఆమె ఆలోచనా భారాన్ని మరింత పెంచుతుంది సిల్వియా.

అందరిలానే జీవన వైరుధ్యాలని లిజీ కూడా ఎదుర్కొంటూనే ఉంటుంది. బొటాబొటి జీతం, తమ్ముడి బాధ్యత, ఆ బాధ్యత వల్ల సంసారంలో ఇబ్బందులూ, పిల్లవాడూ, చదువూ వంటి వైయక్తిక సమస్యలు ఎన్ని ఉన్నా, ఎన్నికల ఫలితాలూ, నిరంకుశ ధోరణులూ, పెరుగుతున్న అసమానతలూ, స్కూల్లో కాల్పులూ, అభద్రతలూ, అలుముకుంటున్న నిరాశ వంటి సామాజిక పరిస్థితులు భయం కలిగిస్తున్నా – వీటన్నిటి మధ్య కూడా పర్యావరణం పట్ల తన బాధ్యత గురించి ఆలోచించే లిజీ కథే ఈ నవల.

రకరకాల విషయాల ప్రస్తావనలతో ప్రారంభంలో పాఠకుడికి పట్టు దొరకనివ్వని కథనం, పోనుపోను అల్లిక చిక్కనై అందులోకి లాగేస్తుంది. కథావిస్తరణలో ఏ నవలా సూత్రాలకీ కట్టుబడకుండా, తార్కికమైన మొదలూ తుదీ అంటూ లేకుండా సాగే కథ– లిజీ ఆలోచనల విస్ఫోటనాల చుట్టూ పాదరసంలా సంచలిస్తూ ఉంటుంది. ఆ ఆలోచనలు కొంత హాస్యంతో, కొంత తాత్త్వికతతో కలగలిసి ఆమె మేధను తాకి విడిపోతుంటాయి.

రోజువారీ జీవితపు పరుగులో మనిషి కొట్టుకుపోతూ, తన మనుగడనే ప్రశ్నార్థకం చేసే ముఖ్యమైన విషయాలను చూసీచూడనట్టు వదిలేయటం సరికాదన్నదే ఈ నవల ఇతివృత్తం. మేధోపరమైన చర్చలకే పరిమితమైపోతున్నవారు, మార్పుకోసం బరిలోకి దిగి అందరితో కలిసి నడవాలన్నది నవలాంతరంగం.

◆ పద్మప్రియ

● అనువాదం

# లాయక్ అలీ విషాదం

**మీ**ర్ లాయక్ అలీ (1903–71) హైద్రాబాద్ సంస్థానం అస్తమించే రోజుల్లో తొమ్మిదిన్నర నెలలపాటు ప్రధానమంత్రిగా పనిచేసిన రాజమంత్ర ప్రవీణుడు. స్వతంత్ర భారత ప్రభుత్వం 566 స్వదేశీ సంస్థానాల్ని విలీనం చేసుకొన్న తర్వాత నిజాం సరకారును స్వాధీనం చేసుకొనేందుకు ప్రయత్నిస్తే, సైంధవునిలా అడ్డుకోవడానికి కృషి చేసిన అభినయ చతురుడు. నిజాం ప్రభుత్వాన్ని స్వతంత్ర భారతదేశంలో ప్రత్యేక స్వతంత్ర దేశంగా నిలపాలని శతధా ప్రయత్నించి విఫలుడైన వ్యక్తి. మునుపటి నిజాం ప్రభుత్వ ప్రధానులైన సర్ అక్బర్ హైదరీ, మిర్జా ఇస్మాయిల్ ఛత్తారీలను అసమర్థులుగా చిత్రించి, తన్ను తాను పరిపాలనా దక్షునిగా చెప్పుకొన్న చతుర వచోనిధి. ఈ మీర్ లాయక్ అలీ తన అనుభవాలను, భావాలను 'హైద్రాబాద్ ట్రాజెడీ' అన్న ఇంగ్లిష్ గ్రంథ రూపంలో(1962) గుదిగుచ్చాడు.

లాయక్ అలీ హైద్రాబాద్ స్వతంత్ర దేశంగానే వుండాలని వాదించాడు. నవాబు అదే భల్లూకపు పట్టు పట్టాడు. కాని సంస్థానపు ప్రజలు మాత్రం భారత ప్రభుత్వంలోనే విలీనం కావాలని అభిలషించారు. కానీ లాయక్ అలీ వాదన ఇంకోలా ఉంది: ''హిందువులంతా మున్షీ, భారత్ భావించినట్లు భారత్ వైపు నిలబడక మాతృభూమి వైపు నిలబడ్డారు''. అలాగే ఖాసిం రజ్వీని కూడా ఎంతో ఉదాత్త నాయకునిలా చిత్రించాడు. ''మతసామరస్య నిర్వహణ పట్ల ఆయన చాలా ఆసక్తిగా ఉండేవాడు. రజాకార్లలో హిందువుల సంఖ్యను పెంచడం ఆయన జీవితాశయములలో ఒకటిగా ఉండేది. రజాకార్ల ఛత్రఛాయలో ఉన్నవారు అన్ని వర్గాల ప్రజలను కలుపుకుపోవాలని, అందరి అభిప్రాయాలను గౌరవించే సహనశీలతను పెంచుకోవాలని ఆయన బోధిస్తూ ఉండేవారు.'' ఇక, నిజాం నవాబు గురించి రాసిన ఈ మాటలు ఆయన ప్రజా సంరక్షణకు ఎంతటి ప్రాధాన్యమిచ్చేవాడో తెలుస్తుంది. ''మొదట డబ్బుకు, తర్వాత తన వ్యక్తిగత ఆధిపత్యానికే ప్రాధాన్యతనిచ్చేవాడు. వయసు పెరిగినకొద్దీ ఆయన అధికార కాంక్ష ఎంతగా పెరిగిందంటే, ఈర్ష్యతో ప్రభుత్వానికి కూడా స్వేచ్ఛనివ్వకపోయేవాడు.''

హైద్రాబాద్ సంస్థానంపై భారత ప్రభుత్వ మిలిటరీ చర్యను 'దుర్మార్గమైన బలం'గా పేర్కొన్న లాయక్ అలీ రచన ఇంకో వెర్షన్ వినడానికి పనికొస్తుంది. కానీ వ్యాఖ్యానం పట్ల జాగరూకతతో ఉండాలి. ఈ పుస్తకాన్ని కవి, విమర్శకుడు ఏనుగు నరసింహారెడ్డి సరళమైన భాషలో, సాఫీగా సాగే శైలిలో చక్కగా తెలుగులోకి అనువదించారు.

◆ ఘట్టమరాజు



**హైద్రాబాద్ విషాదం**
మూలం: మీర్ లాయక్ అలీ; తెలుగు: ఏనుగు నరసింహారెడ్డి; పేజీలు: 320 ; వెల: 150 ; ప్రచురణ: పాలపిట్ట బుక్స్; అనువాదకుడి ఫోన్: 8978869183

● రీవిజిట్

**ని**జం తాజా కవితాసంపుటి 'నాలుగో పాదం'లో 88 కవితలున్నాయి. వీటి గురించి ఎన్.వేణుగోపాల్ ఇలా వ్యాఖ్యానిస్తారు: 'ఈ కవితలన్నీ కూడా ఏదో ఒక సమకాలీన ఘటననో, కవి సామాజిక, రాజకీయ, తాత్త్విక అవగాహననో ఇతివృత్తంగా తీసుకున్నవే గాని ప్రతి కవితా దాని అభివ్యక్తి వల్ల వేరువేరు స్థాయిల, వేరువేరు పొరల అర్థాలను సూచిస్తూ, సాంద్రంగా, గాఢంగా మారి పాఠకుల ఆలోచనకూ అవగాహనకూ అనుభూతికీ పదును పెడుతుంది.' అందులోంచి ఒక కవిత:



**నాలుగో పాదం**
కవి: నిజం; పేజీలు: 148; వెల: 125; ప్రతులకు: నిజం ప్రచురణలు, ఎ–26, జర్నలిస్టు కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్–33. ఫోన్: 9848351806

## సారుధ్యం

**గా**లి తనను తాను
కవ్వం పడుతుంది
పొరల మధ్య పోరుతో
హోరెత్తుతుంది

నీటి బిందువుల మధ్య
నిరంతర ఘర్షణ
ఒరుసుకుంటూ
ఒత్తిడికి గురి చేసుకుంటూ
ఏకీభవించకుండానే
ఏకమై నడవడం

దేని తీరూ
మరో దానికి నచ్చదు
అలాగని సహనడక
ఆగదు
సామూహిక ధర్మానికి
చేటు జరగదు

స్పర్థించుకుంటూనే
ఒకరి తల ఒకరు
నిమురుకోవడం
ఎదిరించుకుంటూనే
ఎదల కలబోత
విభేదం విరోధం కాదు
మథనంతోనే
అమృత సాధన
శత్రు వ్యూహ ఛేదన

◆ నిజం

● సాహిత్య మరమరాలు

# ఆర్యుల ముఖ్యాహారం



'**కాం**తం కథలు' ఫేమ్ మునిమాణిక్యం నరసింహారావు అప్పుడు బందరులో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయనకు గోళ్లు కొరుక్కునే అలవాటు ఉండేదిట. ఓరోజు ఆర్య నాగరికత పాఠం చెబుతున్నారు. పాఠం చెబుతూ మధ్యలో ఓ విద్యార్థిని లేపి, 'ఆర్యుల ముఖ్య ఆహారం ఏమిటి?' అని ప్రశ్నించారు. ఆ పిల్లాడు, 'గోధుమలు, వరి, సజ్జలు' అని జవాబిచ్చాడు. 'ఇంకా' అన్నాడు మాష్టారు. 'యవలు, రాగులు, జొన్నలు' అని కొనసాగించాడు విద్యార్థి. 'ఇంకా' అన్నారాయన. టక్కున 'గోళ్లు' అన్నాడు పిల్లాడు. ఆ చమత్కారానికి మునిమాణిక్యం సహా క్లాసంతా నవ్వుకుంది.

## రారండోయ్

- పట్నాయకుని వెంకటేశ్వరరావు నిర్వహిస్తున్న వారం వారం తెలుగు హారం 100వ వారం వేడుక మార్చి 1న ఉదయం 10 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరగనుంది. నందమూరి లక్ష్మీపార్వతి, ఆర్.దిలీప్ రెడ్డి, కేవీ రమణాచారి, మామిడి హరికృష్ణ, వర్ధెల్లి మురళి, ప్రభాకర రెడ్డి, ఎంవీ రామిరెడ్డి, గౌరీశంకర్, సన్నిధానం నరసింహశర్మ, కాలువ మల్లయ్య, పొట్లూరి హరికృష్ణ పాల్గొంటారు.
- మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కారాన్ని 'సీమేన్' కథలకు గాను అద్దేపల్లి ప్రభుకు ఫిబ్రవరి 25 సా.6 గం.లకు రవీంద్ర భారతి మినీ హాల్‌లో ప్రదానం చేయనున్నారు. శీలా వీర్రాజు, కాలువ మల్లయ్య, నెల్లుట్ల రమాదేవి, నాళేశ్వరం శంకరం పాల్గొంటారు.
- ధనికొండ హనుమంతరావు శతజయంతి ముగింపు సభ మార్చి 1న ఉ.10 – సా.5గం. వరకు రవీంద్రభారతి మినీ హాల్‌లో జరగనుంది. వకుళాభరణం రామకృష్ణ, సంగిశెట్టి శ్రీనివాస్, కె.శ్రీనివాస్, కాత్యాయని విద్మహే, జగన్నాథ శర్మ పాల్గొంటారు. ధనికొండ ఎంపిక చేసిన 40 కథల మీద 25 మంది యువ రచయితలు మాట్లాడుతారు.
- జాగృతి కథలు, నవలల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం మార్చి 1న ఉ. 10 గం.కు ఓయూ ప్రాంగణంలోని పీజీఆర్ఆర్ సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆడిటోరియంలో జరగనుంది. వక్త: సిరివెన్నెల సీతారామశాస్త్రి. విజేతలు: కథలు– ఆర్.దమయంతి, కనుపూరు శ్రీనివాసులు రెడ్డి, పాణ్యం దత్తశర్మ ; నవలలు– పుట్టగంటి గోపీకృష్ణ, ఆకెళ్ల శివప్రసాద్.
- సీఏఏ, రిజర్వేషన్లు, కాశీం, వరవరరావు, సాయిబాబా అరెస్టు, వారి కవిత్వం వంటి అంశాలపై మార్చి 1న మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9గం. వరకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సదస్సు జరగనుంది. నిర్వహణ: విప్లవ రచయితల సంఘం.
- 'కవిరాజు' త్రిపురనేని రామస్వామి సమగ్ర సాహిత్యం ప్రచురించే నిమిత్తం– అలభ్యంగా ఉన్న ఆయన రచనలు గురుక్షేత్ర సంగ్రామము, సంయుక్త, నేత్రావధాన చంద్రిక, మానసబోధ శతకము జాడ తెలియజేయవలసిందిగా అభ్యర్థిస్తున్నారు అనిల్ అట్లూరి. ఫోన్: 8142642638.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం ॥ 24-2-2020

# ఐ వాన్నా ఫాలో.. ఫాలో ఫాలో.. ఫాలో.. ఫాలో.. ఫాలో.. యూ..



డొనాల్డ్ ట్రంప్



మెలనియా (49), ట్రంప్ సతీమణి

మెలనియా గ్లామర్ మోడల్. ట్రంప్ తొలిసారి 1998లో మెలనియాను న్యూయార్క్ ఫ్యాషన్ వీక్‌లో చూశాడు. అప్పటికి ఆమె వయసు 28 ఏళ్లు. అతడి వయసు 52 ఏళ్లు. ఇద్దరికీ ఇరవై నాలుగేళ్లు తేడా. బిజినెస్‌మ్యాన్. టెలివిజన్ పర్సనాలిటీ. అప్పటికే రెండో భార్యతో వేరుగా ఉంటున్నాడు. ‘వావ్.. ఎవరీ అమ్మాయి!’ అని ఆరా తీశాడు. మనమ్మాయి కాదు, స్లొవేనియా మోడల్ అని చెప్పారు. పరిచయం చేసుకున్నాడు. అంతకు రెండేళ్ల క్రితమే ఫ్యామిలీతో పాటు న్యూయార్క్ వచ్చినట్లు చెప్పింది మెలనియా. ఫోన్ నెంబర్ అడిగాడు. మెలనియా ఇవ్వలేదు! అతడి పక్కనే సెలీనా మిడెల్‌ఫార్ట్ అనే అమ్మాయి ఉంది. ఒక అమ్మాయిని పక్కన పెట్టుకుని ఇంకో అమ్మాయి ఫోన్ నెంబర్ అడుగుతాడేంటి అని కోపం వచ్చి నెంబర్ ఇవ్వలేదు. ట్రంప్ వదిలిపెట్టలేదు. మెలనియా ఎక్కడికి వెళుతుంటే అక్కడికి వచ్చేస్తున్నాడు. చివరికి ‘ఎస్’ అంది. తర్వాత కొన్నాళ్లకు ‘నో’ అంది. అలా కొంతకాలం ‘ఎస్’లు, ‘నో’ లతో వాళ్ల రిలేషన్ నడిచింది. ఫస్ట్ టైమ్ ‘హోవార్డ్ స్టెర్న్ టీవీ షో’లో ఇద్దరి మధ్య ప్రేమ బయటపడింది. తర్వాత ఇద్దరూ పక్కపక్కనే బహిరంగంగా నడుస్తూ బయటపడ్డారు. తమ రిలేషన్ గురించి ట్రంప్ 2005లో ఓ టీవీ చానెల్‌లో మాట్లాడారు. ‘‘మా మధ్య వాదులాటలు ఉండవు. మా గురించి ప్రపంచం వాదులాటలు పెట్టుకోవడం తప్ప’’ అన్నారు. ఆ ముందు ఏడాదే వీళ్ల ఎంగేజ్‌మెంట్ అయింది. 2005లో పెళ్లి. 2006లో మెలనియా తల్లి అయింది. కొడుకు పుట్టాడు.

## ట్రంప్ దంపతుల లవ్ స్టోరీ

మెలనియాకు 2005లో అమెరికన్ పౌరసత్వం లభించింది. ఆమె తండ్రి స్లొవేనియా ప్రభుత్వ మోటార్ వెహికల్స్ డీలర్. స్లొవేనియా కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. తల్లికి బట్టల కంపెనీ ఉంది. మెలనియాకు ఒక చెల్లి ఉంది. అన్న ఉన్నాడు. సొంత అన్న కాదు. తండ్రి మొదటి భార్య కొడుకు. మెలనియా ఆ అన్నను ఎప్పుడూ చూడలేదు. మెలనియా డిగ్రీ చదువును మధ్యలోనే ఆపేశారు. ఫ్యాషన్ మోడలింగ్‌లోకి వచ్చేశారు. స్లొవేనియా, సెర్బియా, ఇంగ్లిష్, ఫ్రెంచ్, జర్మన్.. భాషలు మాట్లాడతారు మెలనియా. ఇన్ని భాషలు వచ్చినా... ట్రంప్‌పై వస్తున్న ఆరోపణల్ని తిప్పి కొట్టడానికి ఆమెకు ఏ భాషలోనూ బలం సరిపోయేది కాదు. నాలుగేళ్ల క్రితం అధ్యక్ష ఎన్నికలకు ముందు ట్రంప్‌పై దాడి మొదలైంది. ముఖ్యంగా అమెరికన్ మహిళల వైపు నుంచి. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఒక్కో మహిళా వచ్చి ట్రంప్ తమతో ఎంత అసభ్యంగా ప్రవర్తించిందీ మీడియా ముందు వెళ్లగక్కారు. ఇవన్నీ తప్పుడు ఆరోపణలు అని మెలనియా ఆయన వైపు స్థిరంగా నిలబడ్డారు. ‘‘నా భర్త గురించి నాకు తెలుసు. ఆడవాళ్ల విషయంలో అబ్బాయిలు చెప్పుకునే గొప్పల్లాంటివే ఆయన మాటలు’’ అని వెనకేసుకొచ్చారు. ఎంత వెనకేసుకొచ్చినా.. మొదటి భార్య కూతురు ఇవాంక విషయంలో తన భర్త చేసిన కామెంట్‌లను మాత్రం ఆమె నిజాయితీగా ఖండించారు. కూతురు గురించి ఒక తండ్రి అనవలసిన మాటలు కాదని కూడా అన్నారు. (‘ఇవాంకా నా కూతురు కాకపోయుంటే నేను తనతో డేటింగ్‌కి వెళ్లేవాడిని. అంత అందంగా ఉంటుంది తను’ అని ట్రంప్ అన్నాడని వచ్చిన వార్తలపై).

ట్రంప్ ధోరణి గురించి అడిగితే ఆమె ఎప్పుడూ ఒకే మాట చెబుతారు: ‘సెన్సేషన్ కోసం ఆయన్ని మాట్లాడిస్తారు తప్ప, సెన్సేషన్ కోసం ఆయనకై ఆయన మాట్లాడరు’ అని. ఆ మధ్య ఇంకో ఒక అందమైన మాట కూడా అన్నారు మెలనియా. ఇంట్లో తనకు ఇద్దరు కొడుకులట. తన కొడుకు. తన భర్త.

# మేడమ్ ఫస్ట్ లేడీ

**స్త్రీ పక్కన ఉంటే పురుషుడికి లభించే గౌరవమే వేరు! సీఎం అయినా, పీఎం అయినా, చక్రవర్తే అయినా. అంతవరకు ఎందుకు.. మనం వెళ్లే ఫంక్షన్‌లలోనే చూడండి.. అతను కనిపించి ఆమె జాడ లేకుంటే... రపీమని ‘అమ్మాయేదీ!’ అంటారు. ‘మేడమ్ ఎక్కడా!!’ అని చుట్టుపక్కలకు చూస్తారు. అమెరికా అధ్యక్షుడు కొద్ది గంటల్లో ఇండియాలో దిగుతున్నారు. ఆయనకు ఉండే గౌరవం ఆయనకు ఉంటుంది. సతీమణితో పాటు వస్తున్నారు కనుక సంపూర్ణ గౌరవం ఉంటుంది. ఇప్పటివరకు ఇలా జంటగా కలిసి ఇండియా వచ్చి, భర్తకు అపారమైన గౌరవ మర్యాదలను ప్రసాదింపజేసిన అమెరికా ప్రథమ మహిళల సందర్శన సమయాలు, సందర్భ చిత్రాలు... క్లుప్తంగా, మీ కోసం.**




1962

### జాక్వెలీన్

కెన్నడీ సతీమణి జాక్వెలీన్ 1962లో ఇండియా వచ్చారు. ఇండియాను సందర్శించడం తన కల అని కూడా అన్నారు! ఇండియాలో హోలీ కూడా ఆడారు.

### పాట్


రిచర్డ్ నిక్సన్ సతీమణి పాట్ నిక్సన్ 1969లో ఇండియా వచ్చారు. ఒకే రోజు ఉన్నారు. పెద్దగా పర్యటనలేం చెయ్యలేదు. ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో మహాత్ముడికి నివాళులు అర్పించారు.




1969

### రోసలీన్

జిమ్మీ కార్టర్ సతీమణి రోసలీన్ కార్టర్ 1978లో ఇండియా వచ్చారు. భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలకు ముగ్ధులయ్యారని అంటారు. ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల్లోని గ్రామీణ మహిళలను కలిశారు.



1978



1995 1997

### హిల్లరీ

బిల్ క్లింటన్ సతీమణి హిల్లరీ క్లింటన్ 1995లో, 1997లో ఒక్కరే ఇండియా వచ్చారు. మొదటిసారి కూతురు చెల్సీతో కలిసి వచ్చారు. రెండోసారి మదర్ థెరిసా అంత్యక్రియలకు వచ్చారు.




2006

### లారా

జార్జి బుష్ సతీమణి లారా బుష్ 2006లో ఇండియా వచ్చారు. నోయిడాలోని ఫిల్మ్‌సిటీని సందర్శించారు. మదర్ థెరిసా మిషనరీస్ ఆఫ్ చారిటీలో కొంత సమయం గడిపారు. హైదరాబాద్ కూడా వచ్చారు.

### మిషెల్

ఒబామా సతీమణి మిషెల్ ఒబామా 2010లో, 2015లో ఇండియా వచ్చారు. మహిళా సంక్షేమం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలను సందర్శించారు. బాలలతో కలిసి డాన్స్ చేశారు.



2010 2015

---

**నల్ల బియ్యం**

# కెరీర్ ఉడికింది

**‘‘కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బియ్యం లేని భోజనమే లేదు. అందుకే బియ్యం వ్యాపారాన్ని మొదలు పెట్టాను. పిడికెడు బియ్యం మనిషి మనుగడకు భరోసా. ఆ బియ్యమే నా బిజినెస్ కెరీర్‌కు పూజాక్షతలు’’ అంటోంది మణిపురి యువతి ముదిత.**

నిజమే! ముదిత అన్నట్లు కశ్మీరీ పులావ్, బిర్యానీలతో ఉత్తరాది విందులో అగ్రస్థానం బియ్యానిదే. దక్షిణాది రాష్ట్రాల్లో అయితే ఇడ్లీ, దోసెల రూపంలో తెల్లవారేదే బియ్యంతో. అయితే ఇప్పుడు టెక్ ఇండియా బియ్యానికి దూరంగా జరిగిపోతోంది. ‘మనదేశాన్ని డయాబెటిక్ హబ్‌గా మారుస్తున్నది బియ్యమే..’ అని అంటున్న ఈ రోజుల్లో ఈ అమ్మాయికి బియ్యంతో తన కెరీర్‌ను ఉడికించుకోవచ్చన్న ధైర్యం ఎలా వచ్చింది! ‘‘మా ముత్తవ్వను వందేళ్లు ఆరోగ్యంగా బతికించిన బియ్యం ఇవి. చైనాలో రాజకుటుంబం కోసం గోదాముల్లో ప్రత్యేకంగా దాచిన బియ్యం ఇవి. ఇటలీలో రెస్టారెంట్లు వండేది ఈ బియ్యాన్నే’’ అంటోంది ముదిత.

**ఆర్థికమా? ఆహారమా?**

ముదిత ఢిల్లీలోని ‘జీసస్ అండ్ మేరీ కాలేజ్’లో కామర్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసింది. లండన్‌లో 2011లో మాస్టర్స్ పూర్తి చేసే నాటికి ఆమె లక్ష్యం అర్థికరంగంలో నైపుణ్యం సాధించి గొప్ప ఆర్థికవేత్తగా ఎదగాలన్నది మాత్రమే. అందుకోసమే ఇంటర్నేషనల్ యూనివర్సిటీల్లో మరికొన్ని కోర్సులు కూడా చేసింది. ఇండియా వచ్చి పెద్ద కార్పొరేట్ కంపెనీలో డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్‌గా ఉద్యోగం కూడా సంపాదించింది. అయితే అప్పటివరకు తన చదువు, తన ఉద్యోగం అనుకుంటూ సాగిన ముదితలో తన చుట్టూ ఏం జరుగుతుందోననే గమనింపు మొదలైంది. దగ్గరి స్నేహితుల ఇళ్లలోనూ, తన బంధువుల్లో చాలా మంది డయాబెటిస్ పేషెంట్‌లు, హార్ట్ పేషెంట్‌లు. అది కూడా నలభై ఐదేళ్లలోపే!



మణిపూర్ రైతులతో ముదిత



నల్ల బియ్యం

### నానమ్మ తిన్న బియ్యం

ఇటలీలో రెస్టారెంట్లన్నీ యాంటి ఆక్సిడెంట్‌లు పుష్కలంగా ఉండే ఈ బియ్యాన్నే వండుతాయి. ఈ బియ్యం మనదేశంలోకి ఇతర ఆసియాదేశాల నుంచి దిగుమతి అవుతుండేవి. ఆ బియ్యాన్ని చూసినప్పుడు మణిపూర్ రాష్ట్రంలోని మా సొంతూరు థౌంబాల్‌లో మా నానమ్మ తిన్న బియ్యం ఇలాగే ఉండేవి కదా అనుకున్నాను. ఈశాన్య రాష్ట్రాల్లో మనుషులు అంత ఆరోగ్యంగా ఉండడానికి కారణం కూడా ఈ నల్లబియ్యమే. అందుకే దేశం ఆరోగ్యంగా ఉండాలన్నా, నా వ్యాపారం పరిపుష్టం కావాలన్నా ఈ నల్ల బియ్యాన్ని అందరికీ పరిచయం చేయడమే మంచి మార్గం అనుకున్నాను.

– ముదిత అకోయిజామ్ సింగ్, బ్లాక్ రైస్ వ్యాపారవేత్త



‘‘ఇవన్నీ లైఫ్‌స్టైల్ సమస్యలే. ముఖ్యంగా సరిగ్గా తినడం తెలియకపోతే వచ్చే ఇబ్బందులే. ఢిల్లీ ఇలాగుంది, కానీ మా సొంత రాష్ట్రం మణిపూర్ ఇలా లేదు. మా నానమ్మ, తాతయ్యలు బతికినంత కాలం అన్నమే తిన్నారు. పొట్టలను రసాయనాలతో నింపలేదు. మా ముత్తవ్వకి ఏటువంటి అనారోగ్యమూ లేకుండా ఏకంగా వందేళ్లు జీవించిన రికార్డ్ ఉండనే ఉంది. అంటే ఈశాన్య రాష్ట్రాల ఆహారంలోనే ఆరోగ్యం ఉందా? సందేహాన్ని నివృత్తి చేసుకోవడానికి మణిపూర్ రాష్ట్రంలో ఆరు నెలల పాటు ఉండిపోయాను. అక్కడి మార్కెట్‌లన్నీ తిరిగి చూశాను. రైతులతో మాట్లాడాను. అక్కడి ‘ఇమా ఖైతాల్’ (మదర్స్ మార్కెట్) లను ఇంకా నిశితంగా గమనించారు’’ అని చెప్పారు ముదిత. ఈ మదర్స్ మార్కెట్‌లను మొత్తం మహిళలే... ‘స్వయం సహాయక బృందాలు’గా ఏర్పడి నిర్వహిస్తారు.

**ఆరోగ్య దేశం**

మణిపురి నుంచి వచ్చేశాక ఢిల్లీ కేంద్రంగా బియ్యం వ్యాపారాన్ని చేయాలనుకున్న ముదిత అందుకోసం మణిపూర్‌లో ఐదు వందల మంది రైతులను తనతో కలుపుకుంది. గత ఏడాది జనవరిలో ఆమె ఈ పని మొదలు పెట్టింది. ఈ ఏడాది కాలంలోనే ఢిల్లీలోని పెద్ద రెస్టారెంట్‌లు ముదిత సరఫరా చేస్తున్న నల్లబియ్యానికి బాగా అలవాటైపోయాయి! ముంబయికి కూడా విస్తరించింది. నల్లబియ్యంతో పాటు అస్సాంలో పండే హిమాలయన్ రెడ్ రైస్, నాగాలాండ్‌లో పండే వెదురుబియ్యాన్ని కూడా దేశవ్యాప్తంగా పరిచయం చేసింది ముదిత.

ఆరోగ్యవంతమైన దేశం ఆరోగ్యవంతులతోనే సాధ్యం. రోగాల మీద జరిగే వ్యాపారం టర్నోవర్ వేల కోట్లయినా, లక్షల కోట్లయినా సరే అది దేశానికి ఆరోగ్యకరం కాదు.

– మంజీర

**ఫ్యాషన్ వీక్**

### ఐపోవచ్చింది

ఇటలీలోని మిలాన్ నగరంలో జరుగుతున్న ‘మిలాన్ ఫ్యాషన్ వీక్ –2020’ ఈ రోజుతో ముగుస్తోంది. శరత్‌శీతాకాలాల్లో ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో; వసంతవేసవి కాలాల్లో ఏటా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో.. రెండు విడతలుగా జరిగే ఈ దుస్తుల వాణిజ్య ప్రదర్శనకు మోడల్సే ప్రాణాధారం. ఫిబ్రవరి 18 నుంచి జరుగుతున్న ప్రస్తుత ప్రదర్శనలో మోడల్స్ ధరించిన బాల్ గౌన్లు, శిరస్సుపై వారు అమర్చుకున్న 3 అడుగుల పొడవైన విగ్గులు అతివల కళ్లను మిరుమిట్లు గొల్పుతున్నాయి. ఇటలీలో ప్రఖ్యాతిగాంచిన మాస్కినో ఫ్యాషన్ హౌస్ వారి సృజనాత్మకత ఇదంతా. చైనా ప్రింట్స్, బరోక్ ఫ్లోరల్స్ (అస్తవ్యస్తంగా పొదిగిన పూలు) తో మాస్కినో చేసిన ఈ ప్రయోగం విజయవంతం అయినట్లే కనిపిస్తోంది.



చైనా ప్రింట్స్, బరోక్ ఫ్లోరల్స్‌తో ‘మాస్కినో’ వారి మోడల్ గర్ల్స్

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
సోమవారం
24-2-2020

# ఆచార్య... లుక్ అదుర్స్


చిరంజీవి

ప్రత్యర్థులపై పులిలా పంజా విసురుతున్నారట చిరంజీవి. కొరటాల శివ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా 'ఆచార్య' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో త్రిష కథానాయికగా నటిస్తున్నారు. రామ్‌చరణ్, నిరంజన్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోలవరం పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోందని సమాచారం. చిరంజీవిపై పోరాట సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. అయితే తాజాగా 'ఆచార్య' సినిమాలో చిరంజీవి లుక్ ఇదేనంటూ ఓ ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇక్కడున్న ఫొటో చూసిన చిరంజీవి అభిమానులు 'ఆచార్య.. లుక్ అదిరిందయ్యా!' అంటున్నారు. ఈ సినిమాలో రామ్‌చరణ్ ఓ కీలక పాత్ర చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాకు మణిశర్మ సంగీత దర్శకుడు.

# డబుల్ ధమాకా


అల్లు అర్జున్

'అల వైకుంఠపురములో...' ఘన విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్నారు అల్లు అర్జున్. ఇప్పుడు సుకుమార్ సినిమాకి డబుల్ ఎనర్జీతో ఎంటర్ కాబోతున్నారని సమాచారం. 'ఆర్య, ఆర్య 2' చిత్రాల తర్వాత దర్శకుడు సుకుమార్, అల్లు అర్జున్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. రష్మికా మందన్నా కథానాయిక. ఎర్రచందనం అక్రమ రవాణా నేపథ్యంలో ఈ సినిమా ఉండబోతోందట. ఈ సినిమాలో అల్లు అర్జున్ ద్విపాత్రాభినయం చేయనున్నారని సమాచారం. గుబురు గడ్డం, రింగుల జుత్తుతో లారీ డ్రైవర్‌గా ఒక పాత్రలో కనిపిస్తే మరో పాత్రలో స్టయిలిష్ బిజినెస్‌మేన్‌గా కనిపిస్తారట. సాధారణంగా బన్నీ (అల్లు అర్జున్) సినిమాలంటే ఎనర్జీ.. మరి రెండు పాత్రల్లో బన్నీ కనిపిస్తే కచ్చితంగా డబుల్ ఎనర్జీయే. మార్చి రెండో వారం నుంచి అల్లు అర్జున్, రష్మికా చిత్రీకరణలో పాల్గొననున్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

# ప్లాన్ మారిందా?


మహేశ్ బాబు

మహేశ్ బాబు 27వ చిత్రానికి దర్శకుడు ఎవరు? అనే ప్రశ్నకు నిన్న మొన్నటి వరకు దర్శకుడు వంశీ పైడిపల్లి పేరు సమాధానంగా వినిపించింది. మహేశ్ 25వ చిత్రం 'మహర్షి'కి కూడా వంశీ పైడిపల్లియే దర్శకుడన్న సంగతి తెలిసిందే. అయితే మహేశ్ 27వ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోయేది వంశీ పైడిపల్లి కాదని, 'గీత గోవిందం' ఫేమ్ పరశురామ్ ఈ అవకాశం దక్కించుకున్నారనే వార్త తాజాగా ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ నిర్మించనుంది. ఇప్పటికే ఈ ఏడాది 'సరిలేరు నీకెవ్వరు' చిత్రంతో ప్రేక్షకులు ముందుకు వచ్చిన మహేశ్, ఈ ఏడాదే మరో చిత్రాన్ని కూడా విడుదల చేయాలనుకుంటున్నారట. అందుకు తగ్గ సన్నాహాలు కూడా జరుగుతున్నాయని టాక్. మరి.. డైరెక్టర్ విషయంలో మహేశ్ ప్లాన్ మార్చారా? ఈ ఏడాది మహేశ్ హీరోగా నటించిన మరో సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అన్న ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే మరికొంత సమయం వేచి ఉండక తప్పదు. మరోవైపు పరశురామ్ దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా తెరకెక్కనున్న ఓ సినిమా అనౌన్స్‌మెంట్ ఇటీవల వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది.

# ఎందరికో స్ఫూర్తి


కంగనా రనౌత్

నటి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జీవితం ఆధారంగా 'తలైవి' అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఏఎల్ విజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో జయలలిత పాత్రలో నటిస్తున్నారు బాలీవుడ్ 'క్వీన్' కంగనా రనౌత్. విష్ణువర్ధన్ ఇందూరి, శైలేష్ ఆర్.సింగ్ నిర్మిస్తున్నారు. సోమవారం (ఫిబ్రవరి 24) జయలలిత 72వ జయంతి. ఈ సందర్భంగా ఈ సినిమాలోని కంగన కొత్త లుక్‌ను విడుదల చేశారు. ''జయలలితగారు ఎందరికో స్ఫూర్తి. వెండితెరపై ఆమె పాత్రను ఎంతో అంకిత భావంతో పోషిస్తూ, ఆ పాత్రకు జీవాన్నిస్తున్నారు కంగనా. ఈ ప్రాజెక్ట్‌లో ఆమె భాగం కావడం ఈ సినిమా క్వాలీటిని ఎన్నో రెట్లు పెంచింది'' అన్నారు విజయ్. ''ఎన్నో అడ్డంకులతో పోరాడి, వాటిని అధిగమించి, ఓ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన ఓ స్త్రీ గాథ ఈ చిత్రం'' అన్నారు విష్ణువర్ధన్. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతోంది ఈ చిత్రం.


రష్మికా మందన్నా

# జోడీ ఎవరు?

ఎన్టీఆర్, దర్శకుడు త్రివిక్రమ్ ఓ సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. 'అరవింద సమేత వీరరాఘవ' తర్వాత వీరి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం ఇది. నాగవంశీ, కల్యాణ్ రామ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరు? అనే విషయాన్ని ఇంకా ప్రకటించలేదు చిత్రబృందం. 'అరవింద..'లో నటించిన పూజా హెగ్డే మళ్లీ హీరోయిన్‌గా కనిపిస్తారని వినిపించింది. తాజాగా రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించనున్నారని సమాచారం. మరి ఈ సినిమాలో ఈ ఇద్దరు హీరోయిన్లు కనిపిస్తారా? అధికారిక ప్రకటన కోసం వేచి చూడాలి.. మేలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేయాలనుకుంటున్నారు.

# హిట్ ఇస్తున్నందుకు గర్వంగా ఉంది

- నాని



''అ' సినిమాతో నాని నిర్మాతగా మారి నేర్చుకున్నాడు.. ఇప్పుడు 'హిట్' అంటున్నాడు. ఎంత నమ్మకం లేకుంటే ఆ పేరు పెడతాడు. చాలా సినిమాలు చేశాడు కదా.. కొన్ని ఆడతాయి, మరికొన్ని ఆడవు. ఆడని వాటిలోని తప్పులు.. ఆడిన వాటిలోని బెస్ట్‌లు తీసుకుని ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని 'హిట్' అని పేరు పెట్టేశాడు. మొత్తంగా ఓ డాక్టర్‌ని(శైలేశ్) డైరెక్టర్ చేశాడు నాని'' అని డైరెక్టర్ కె. రాఘవేంద్రరావు అన్నారు. 'ఫలక్‌నుమాదాస్' ఫేమ్ విశ్వక్ సేన్ హీరోగా, రుహానీ శర్మ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'హిట్'. 'ది ఫస్ట్ కేస్' అన్నది ఉపశీర్షిక. శైలేష్ కొలను దర్శకత్వం వహించారు. హీరో నాని సమర్పణలో వాల్ పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదలవుతోంది. ప్రీ రిలీజ్ వేడుకలో **డైరెక్టర్ రాజమౌళి మాట్లాడుతూ–** ''హిట్' సినిమా టీజర్, ట్రైలర్ చాలా బాగున్నాయి.. యూనిట్ ప్రమోషన్ ఐడియాలు కూడా కొత్తగా ఉన్నాయి. సినిమా మంచి హిట్ అవ్వాలి. ఉపశీర్షికలో ఫస్ట్ కేస్ అని పెట్టారు.. రెండో కేస్, మూడో కేస్ అంటూ దీనికి మరిన్ని ఫ్రాంచైజీలు రావాలి. సినిమా పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు. **అనుష్క మాట్లాడుతూ–** ''ఈరోజు నేను ఇక్కడికి అతిథిగా రాలేదు. నాని, ప్రశాంతి నా కుటుంబసభ్యులే. 'అ' చాలా మంచి సినిమా. రెండో సినిమా చాలా మంచి కథతో వస్తారనుకుని వేచి చూశా. 'హిట్' ట్రైలర్స్, పాటలు బాగున్నాయి'' అన్నారు. **'దిల్' రాజు మాట్లాడుతూ–** ''హిట్' సినిమా పెద్ద విజయం సాధించాలి. నాని హీరో అయినప్పటికీ కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తున్నాడు.. అలాంటి నాని బ్యానర్‌కి సక్సెస్ కావాలి'' అన్నారు.

**నాని మాట్లాడుతూ–** ''హిట్' సినిమాని తొలుత నేనే చేద్దామనుకున్నా.. విశ్వక్ అయితే బాగుంటుందనిపించింది. శైలేష్ చెప్పిన కథల్లో 'హిట్' వెంటనే తీయాలనిపించింది. డాక్టర్ ఉద్యోగం వదలొద్దని తొలుత చెప్పేవాణ్ణి.. ఈ రోజు చెబుతున్నా ఉద్యోగం వదిలేయ్.. పర్లేదు. 'ఫలక్‌నుమాదాస్'లో విశ్వక్ ఆ పాత్రకు సరిపోయాడు.. 'హిట్' సినిమా చూశాక ఏ పాత్ర అయినా ఇరగదీస్తాడనే నమ్మకం ఉంది. ఈ సినిమాకి ఇద్దరు హీరోలు.. ఒక్కరు విశ్వక్ సేన్.. మరొకరు సంగీత దర్శకుడు వివేక్ సాగర్. 'అ' సినిమా బాగున్నా డబ్బులు రాలేదేమో? అని కొందరు రాస్తుంటారు.. నిర్మాతగా నేను చెబుతున్నా. ఆ సినిమా పక్కా కమర్షియల్ హిట్. ఈ నెల 28న ప్రేక్షకులకు 'హిట్' రూపంలో ఓ క్వాలిటీ, మంచి సినిమా ఇస్తున్నాం.. ఇందుకు గర్వంగా ఉంది'' అన్నారు.

**విశ్వక్ సేన్ మాట్లాడుతూ–** ''రుహాని శర్మ మంచి నటి. ప్రశాంతిగారు సో స్వీట్. ఒకేసారి రెండు సినిమాలు చేయొద్దు.. ఒక్కొక్కటి చేస్తే ప్రశాంతంగా ఉంటుందని నాని అన్న సలహా ఇచ్చాడు.. అది ఎంతో ఉపయోగపడింది. శైలేష్‌గారు శాస్త్రవేత్త లాంటివాడు.. తెలివైనవాడు. 'హిట్' సినిమాకి నీళ్లు ఎక్కువ తాగి రాకండి.. వాష్‌రూమ్ వెళ్లే టైమ్ కూడా ఉండదు. ఇలాంటి థ్రిల్లర్ సినిమా తెలుగులో నేను చూడలేదు'' అన్నారు.

**శైలేశ్ కొలను మాట్లాడుతూ–** ''2017లో నానీ అన్నకి కథ చెప్పా.. విన్నాక 'నువ్వే ఎందుకు దర్శకత్వం చేయకూడదు?' అన్నారు. ఆ తర్వాత సిడ్నీ వెళ్లిపోయి డైరెక్షన్ నేర్చుకుని వచ్చి ఈ సినిమా తీశా. నన్ను దర్శకునిగా పరిచయం చేసినందుకు మీకు థ్యాంక్స్ అన్న. ప్రశాంతి మేడమ్‌కి థ్యాంక్స్. విక్రమ్ రుద్రరాజు అని నేను రాసుకున్న పాత్రకి రెట్టింపు నటన ఇచ్చిన విశ్వక్‌కి థ్యాంక్స్'' అన్నారు. ''ఈ చిత్రం బాగా రావడానికి ప్రతి ఒక్కరూ కష్టపడ్డారు. నాకు అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకి థ్యాంక్స్'' అన్నారు రుహాని శర్మ.

ఈ వేడుకలో నిర్మాత ప్రశాంతి, డైరెక్టర్ నందినీ రెడ్డి, హీరోలు రానా, నవదీప్, సందీప్ కిషన్, 'అల్లరి' నరేశ్, సునీల్, కార్తికేయ, నటి మంచు లక్ష్మి, నటులు భానుచందర్, రాహుల్ రామకృష్ణ, రవివర్మ, నిర్మాతలు రాజ్ కందుకూరి, బెక్కం వేణుగోపాల్, సంగీత దర్శకులు కీరవాణి, వివేక్ సాగర్, కాలభైరవ, కెమెరామేన్ మణికందన్ , ఎడిటర్ గ్యారీ, డైరెక్టర్ తరుణ్ భాస్కర్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్ పాల్గొన్నారు.

# నాన్న పేరు గుర్తుండిపోయేలా....


కోడి రామకృష్ణ


దీప్తి, ప్రవల్లిక

సినిమాని కాచి వడపోసిన వారు కొద్ది మందే ఉంటారు. ఆ జాబితాలో కచ్చితంగా కోడి రామకృష్ణ ఉంటారు. అందుకే ఆయన హిట్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. చిరంజీవితో 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య'తో దర్శకుడిగా కెరీర్ ప్రారంభించి అనేక హిట్ సినిమాలు తీసి గురువును(దాసరి నారాయణరావు) మించిన శిష్యుడు అనిపించుకున్నారు. కోడి రామకృష్ణ ప్రథమ వర్ధంతి శనివారం (22న). ఈ సందర్భంగా ఆయన కుమార్తెలు దీప్తి, ప్రవల్లిక మాట్లాడుతూ– ''మా నాన్నగారి పేరు చిరస్థాయిగా నిలిచిపోవాలన్నది మా కోరిక. అందుకే ఆయన పేరుతో సినిమా నిర్మాణ సంస్థను నెలకొల్పి చిత్రాలు తీస్తాం.. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అన్నారు. కాగా పాలకొల్లులో పుట్టి పెరిగిన కోడి రామకృష్ణ పాలకొల్లులోని లలిత కళాంజలి సంస్థ ద్వారా అనేక నాటకాలు వేశారు. డిగ్రీ పూర్తయ్యాక చెన్నై వెళ్లి దర్శకులు దాసరి నారాయణరావు వద్ద అసిస్టెంట్‌గా చేరారు. 'ఇంట్లో రామయ్య – వీధిలో కృష్ణయ్య' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన కోడి రామకృష్ణ 100 చిత్రాలకు దర్శకత్వం వహించారు. తెలుగు చిత్రపరిశ్రమలో అగ్ర హీరోలందరితో పని చేశారు. తమిళ, హిందీ, కన్నడ, మల యాళ చిత్రాలకూ దర్శకత్వం వహించా రాయన. ఆయన దర్శకత్వంలో చివ రిగా వచ్చిన చిత్రం 'అరుంధతి'.

# మరిన్ని మంచి సినిమాలు తీయాలి


సుశీల్, కేటీఆర్, సుజోయ్, అభిషేక్ నామా

''సుజోయ్ నాకు 15 ఏళ్లుగా తెలుసు. అతని రచనలు, ఆలోచనా విధానం వైవిధ్యంగా ఉంటాయి. 'ప్రెషర్ కుక్కర్' సినిమాలో వినోదంతో పాటు మంచి సందేశం కూడా ఉంది'' అని 'ప్రెషర్ కుక్కర్' బృందాన్ని అభినందించారు తెలంగాణ రాష్ట్ర మంత్రి, తెరాస కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్. సాయి రోనక్, ప్రీతీ అస్రానీ జంటగా సుజోయ్, సుశీల్ తెరకెక్కించిన చిత్రం 'ప్రెషర్ కుక్కర్'. గత శుక్రవారం విడుదలైన ఈ సినిమా గురించి కేటీఆర్ మాట్లాడుతూ – ''పరిమిత వనరులతో ఈ సినిమాను చక్కగా తెరకెక్కించారు. డాలర్ డ్రీమ్స్, అమెరికా కోసం పరిగెత్తడం వంటి విషయాలను సహజత్వానికి దగ్గరగా చూపించారు. సుజోయ్, సుశీల్ భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు తీయాలి'' అన్నారు.

# మీనా బజార్‌లో ఏముంది?

రానా సునీల్ కుమార్ సింగ్, వైభవీ జోషి, శ్రీజిత జోషి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. మీనా బజార్'. రానా సునీల్ కుమార్ దర్శకత్వంలో నాగేంద్ర సింగ్ నిర్మించారు. ఈ సినిమాను మార్చిలో విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ – ''మా చిత్రం టీజర్, ట్రైలర్, పాటలు అన్నీ ప్రేక్షకాదరణ పొందాయి. సెన్సార్ పనులు పూర్తయ్యాయి. మార్చిలో విడుదల చేయాలనుకుంటున్నాం. మా సినిమా ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది'' అన్నారు.


రానా సునీల్, వైభవి, శ్రీజిత

# మహిళలూ జాగ్రత్త


మేఘన, ప్రియాన్స్, శ్రీదేవి

నవీన్.కె. చారి, ప్రియాన్స్, మేఘనా చౌదరి, సుమయ, కావ్య, శ్రీదేవి ముఖ్య పాత్రల్లో వడ్ల జనార్ధన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హలో మేడమ్'. వడ్ల నాగశారద సమర్పణలో కార్తీక్ మూవీ మేకర్స్ పతాకంపై వడ్ల గురురాజ్, వడ్ల కార్తీక్ నిర్మించారు. ఈ చిత్రం లోగోని ప్రముఖ దర్శకుడు సాగర్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ విడుదల చేశారు. ''హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. విజయం సాధించాలి'' అన్నారు సాగర్. ''చిన్న సినిమాలకు థియేటర్ల సమస్య ఉంది అనేది వాస్తవం. ఎక్కువ థియేటర్లు దక్కేలా నా వంతు సహకారం అందిస్తా'' అన్నారు ప్రతాని రామకృష్ణ గౌడ్. ''తండ్రిని దర్శకుడిగా పరిచయం చేస్తూ కొడుకు సినిమా తీయడం గ్రేట్'' అన్నారు నిర్మాత టి. రామసత్యనారాయణ. వడ్ల జనార్ధన్ మాట్లాడుతూ– ''ప్రస్తుత సమాజంలో మహిళలపై ఆకృత్యాలు పెరిగిపోతున్నాయి. అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని చెప్పే చిత్రమిది'' అన్నారు. ''దిశా ఘటనకు ముందే ఈ సినిమా చేశాం. అమ్మాయిలపై ఓ సైకో చేసే కిరాతకాలను తెలియజేస్తున్నాం'' అన్నారు ఘటికాచలం.

# రాహు జాతకాల సినిమా కాదు


అభిరామ్ వర్మ

''మను' సినిమాలో నా నటన నచ్చి దర్శకుడు సుబ్బుగారు ఆడిషన్స్‌కి పిలిచారు. సుబ్బు కూడా సినిమా మీద ఫ్యాషన్‌తో నాలాగే అమెరికా నుండి ఇండస్ట్రీకి వచ్చారు. 'రాహు' సినిమా చూస్తే కొత్త దర్శకుడు తీసినట్టు అనిపించదు.. అంత బాగా తీశాడు'' అని అభిరామ్ వర్మ అన్నారు. సుబ్బు వేదుల దర్శకత్వంలో అభిరామ్ వర్మ, కృతి గార్గ్ జంటగా తెరకెక్కిన చిత్రం 'రాహు'. ఏవీఎస్‌ఆర్ స్వామి, శ్రీ శక్తి బాబ్జి, రాజా దేవరకొండ, సుబ్బు వేదుల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అభిరామ్ వర్మ మాట్లాడుతూ– ''అమెరికాలో ఫిలిమ్స్‌లో మాస్టర్స్ చేశాను. 'మిస్టర్ ఆంధ్ర'గా సెలెక్ట్ అయ్యాను.. 'మిస్టర్ ఇండియా' ప్రయత్నాల్లో ఉండగా దర్శకుడు తేజ గారి నుండి 'హోరా హోరీ' కోసం కాల్ వచ్చింది. ఆ తర్వాత 'మను', ఇప్పుడు 'రాహు' చేశా. సినిమాలో లవర్ బాయ్‌లా మొదలైన నా పాత్ర యాక్షన్‌కి టర్న్ అవుతుంది. ఇది మహిళల కోసం తీసిన చిత్రం. కృతి పాత్రలో చాలా సవాళ్లు ఉన్నాయి. చాలా మంది అనుకున్నట్లు ఇది జాతకాల సినిమా కాదు.. 'రాహు' టైటిల్ బాగా సరిపోతుందని పెట్టాం. మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది'' అన్నారు.

# విజేతల యాత్ర


సోనా, మహి

''ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న సినిమా మొదలుపెట్టి పూర్తి చేయడమే ఒక విజయం. 'విన్నర్స్ ట్రిప్' టీమ్ సంతోషం చూస్తుంటే కచ్చితంగా గెలవాలనే తపనతోనే ఈ సినిమా తీశారనిపిస్తోంది. టీజర్ చూస్తుంటే యూనిట్ కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుందని నమ్ముతున్నా'' అని నటుడు బాబూ మోహన్ అన్నారు. మహి, సోనా పాటిల్ జంటగా శ్రీను తెలుగు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విన్నర్స్ ట్రిప్'. శ్రీ పుష్పాంజలి క్రియేషన్స్ సమర్పణలో ఎస్‌ఎస్‌సి క్రియేషన్స్ పతాకంపై సంపత్ శ్రీను, కె. లక్ష్మణరావు నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్‌ని బాబూ మోహన్ విడుదల చేశారు. సంపత్ శ్రీను మాట్లాడుతూ– ''మా సినిమా 30 రోజులు టాకీ, 10రోజులు పాటల చిత్రీకరణంతా గోవాలోనే పూర్తి చేశాం. ఎడిటర్ ఈశ్వర్ మా చిన్న సినిమాని పెద్ద రేంజ్‌కి తీసుకెళ్లారు'' అన్నారు. ''ఒక ఎఫ్‌ఎమ్ రేడియో పోటీ విజేతలను ఒక ట్రిప్‌కి తీసుకెళ్లగా అక్కడ వారికి ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి? వాటి నుండి ఎంతమంది బయటపడ్డారు? అనేది చిత్రకథాంశం'' అన్నారు తెలుగు శ్రీను. మహి, సోనా పాటిల్, ప్రసన్నకుమార్ మాట్లాడారు.

# ప్రేమసంకెళ్లు


ఇలియాన

హీరోయిన్ ఇలియానాకు ఓ పోలీసాఫీసర్ ప్రేమసంకెళ్లు వేయబోతున్నారట. రణ్‌దీప్ హుడా హీరోగా 'ముబారకన్' (2017), 'సాండ్ కీ ఆంఖ్' (2019) చిత్రాలకు స్క్రీన్‌ప్లే అందించిన బల్విందర్ సింగ్ దర్శకత్వంలో 'అన్ ఫెయిర్ అండ్ లవ్లీ' అనే ఓ చిత్రం తెరకెక్కుతోందని బాలీవుడ్ సమాచారం. ఇందులో హీరోయిన్ పాత్రకు ఇలియానాను సంప్రదించగా ఆమె అంగీకరించారని తాజా బాలీవుడ్ కబురు. ఆల్రెడీ ఈ సినిమా షూటింగ్ హర్యానాలో ప్రారంభమైందట. ఇందులో రణ్‌దీప్ హుడా పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారని టాక్. త్వరలో ఇలియానా కూడా సెట్‌లో జాయిన్ అవుతారు. అయితే 'అన్‌ఫెయిర్ అండ్ లవ్లీ' చిత్రంలో ముందుగా జోయా హుస్సేన్‌ను (రానా హీరోగా నటించిన తాజా చిత్రం 'అరణ్య' చిత్రంలో ఓ కీలకపాత్రలో నటించారు) హీరోయిన్‌గా అనుకున్నారు. కానీ ఆమె కాల్షీట్స్ అడ్జెస్ట్ కాకపోవడంతో ఇలియానాను తీసుకున్నారని బాలీవుడ్ వర్గాల కథనం.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం
24-2-2020

సినీ విడాకులు

# కోర్టులో 'లగాన్' నటుడు

'ముంగేరిలాల్ కే హసీన్ సప్నే' సీరియల్ ద్వారా టీవీ ప్రేక్షకులకు, 'లగాన్' వంటి అనేక సినిమాల ద్వారా సినిమా ప్రియులకు సుపరిచితుడైన నటుడు రఘువీర్ యాదవ్ విడాకుల కేసును ఎదుర్కొంటున్నాడు.


● పూర్ణిమ


● రఘువీర్ యాదవ్

**రఘువీర్ యాదవ్, పూర్ణిమ 1988లో వివాహం చేసుకున్నారు. పూర్ణిమ అంతర్జాతీయ స్థాయి కథక్ డాన్సర్ అయితే 1995 నుంచే వారు విడివిడిగా ఉంటున్నారు. వీళ్లకు ఒక కుమారుడనీ అతనికిప్పుడు 30 ఏళ్లు అనీ తల్లితోనే ఉంటున్నాడని ముంబై మిర్రర్ పత్రిక రాసింది.**

రఘువీర్ యాదవ్ భారతీయ నాటకరంగంలో చాలా పెద్ద పేరు. టెలివిజన్ రంగంలో 'ముల్లా నసీరుద్దీన్', 'అమరావతి కే కహానియా' వంటి ఎన్నో సీరియల్స్‌లో పని చేశాడు. 'సలాం బాంబే', 'రుడాలీ', 'బాండిట్ క్వీన్' సినిమాలలో ముఖ్య పాత్రలు ధరించాడు. 'డియర్ ఫ్రెండ్ హిట్లర్' సినిమాలో హిట్లర్ పాత్ర పోషించాడు. అయితే ఇప్పుడు 62 సంవత్సరాల వయసులో కోర్టు మెట్లు ఎక్కనున్నాడు. అతడి భార్య అతడి నుంచి చట్టపరంగా విడిపోవడానికి ముంబైలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టులో విడాకుల కేసు నమోదు చేసింది. విడాకులు మంజూరు అయ్యేంత వరకు నెలకు లక్ష రూపాయల ఇంటిరియమ్ మెయింటెన్స్, మంజూరయ్యాక పది కోట్ల పరిహారం రఘువీర్ యాదవ్ నుంచి కోరుతోంది.

రఘువీర్ యాదవ్, పూర్ణిమ 1988లో వివాహం చేసుకున్నారు. పూర్ణిమ అంతర్జాతీయ స్థాయి కథక్ డాన్సర్ అయితే 1995 నుంచే వారు విడివిడిగా ఉంటున్నారు. వీళ్లకు ఒక కుమారుడు అనీ, అతనికిప్పుడు 30 ఏళ్లు అనీ, తల్లితోనే ఉంటున్నాడని ముంబై మిర్రర్ పత్రిక రాసింది. 'అతడు వేరొకరితో సంబంధం పెట్టుకొని నన్ను మోసం చేశాడు' అని పూర్ణిమ ఆరోపిస్తోంది. రఘువీర్ యాదవ్ మేనేజర్ రోష్నీ అర్చెజాను ఇందుకు కారణంగా చెబుతోంది. 'ప్రస్తుతం అతను నెలకు నలభై వేల రూపాయలు ఖర్చులకు ఇస్తున్నాడు. అవి కూడా సరిగ్గా సమయానికి ఇవ్వడు. నాకు న్యాయం కావాలి' అని పూర్ణిమ తన పిటిషన్‌లో పేర్కొంది. 'ఎక్కడ భరణం ఇవ్వాల్సి వస్తుందో అని ఆస్తులు రోష్నీ పేరు మీద మార్చేశాడు' అని కూడా పూర్ణిమ చెప్పింది.

ఈ విషయమై రఘువీర్ యాదవ్‌ను సంప్రదించగా 'ఇప్పుడే ఏమీ వ్యాఖ్యానించను. నాకు న్యాయ వ్యవస్థ మీద నమ్మకం ఉంది' అని ఊరుకున్నాడు. 2017లో సూపర్ హిట్ అయిన సినిమా 'న్యూటన్'లో రఘువీర్ యాదవ్ కార్డ్స్ ఆడుతూ కనిపించే ఎన్నికల అధికారిగా నటించాడు. ప్రస్తుతం అతడికి మంచి ముక్క పడట్లేదని మాత్రం ఈ ఉదంతం తెలియచేస్తోంది.

పరిచయం | శశికళ, సామాజిక, సాంస్కృతిక కార్యకర్త

# సంస్కృతికి కళ

**సంస్కృతిని మనం బతికిస్తున్నాం అనుకుంటాం. కానీ సంస్కృతే మనిషికి బతుకునిస్తుంది. మానవ జీవితంలో కొరవడిన ఉల్లాసాన్ని కళల ద్వారా తిరిగి తీసుకొచ్చి, జీవితేచ్ఛను కలిగించేందుకు 'గుడి సంబరాల' పేరుతో సంగీత నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు శశికళ, ఆమె స్నేహితురాలు శ్రీనగి.**



రోష్నీ కౌన్సెలింగ్ సెంటర్ వ్యవస్థాపక సభ్యురాలు శశికళ. జీవితం ఏ పట్టాలెక్కాలో నిర్ణయించేది ఇరవైలలో ఉండే ఉత్సాహమే. ఆ వయసులోనే సోషల్ లైఫ్‌లోకొచ్చారు శశికళ. 'సహాయ్' అనే స్వచ్ఛంద సంస్థలో వాలంటీర్‌గా పని చేశారు. అదే సంస్థలో పూనమ్ సింగ్ కూడా ఉండేవారు. కొన్నాళ్లకు సహాయ్ సంస్థ... కార్యకలాపాలను ఆపి వేసింది. అప్పుడు శశికళ, పూనమ్.. మరో సేవా సంస్థలో చేరడం కంటే సొంతంగా ఒక సంస్థను స్థాపించడమే కరెక్ట్ అనుకున్నారు. అలా ఏర్పాటైనదే 'రోష్నీ'. జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్యలకు పాల్పడే వారికి జీవితేచ్ఛను కలిగించడమే రోష్నీ ప్రధాన లక్ష్యం. ఆ సర్వీస్‌లో పాతికేళ్లు గడిచాయి. ఏడెనిమిదేళ్ల కిందట శశికళకు మరో ఆలోచన వచ్చింది. మనిషి మానసిక ఉల్లాసం కోసం కూడా ఏదైనా చేయాలనిపించింది. అలా రూపొందిన మరో ఫౌండేషన్ 'పరంపర'. ఈ సంస్థ యేటా రెండు తెలుగు రాష్ట్రాల్లోని చారిత్రక ప్రదేశాలలో 'గుడి సంబరాలు' నిర్వహిస్తుంటుంది.

**గ్రామీణుల కోసమే**

''మనిషి ఎప్పటికప్పుడు రిఫ్రెష్ అవుతూ ఉంటే జీవితం మీద నిరాసక్తతలు తలెత్తవు. నాగరక జీవితం కోసం ఎవరైనా పట్టణాల పట్టాల్సిందే. యువత ఉద్యోగాల కోసం గ్రామాలను వదిలి నగరాలకు వలసపోకా తప్పడం లేదు. దాంతో మానసిక ఉల్లాసాన్నిచ్చే కళాప్రదర్శనలూ నగరాలకే పరిమితం అవుతున్నాయి. కళాకారులు కూడా అవకాశాల కోసం నగరాలను ఆశ్రయిస్తున్నారు. కళాప్రదర్శనలన్నీ నగరాల్లోని ఏసీ ఆడిటోరియాల్లోనే జరగుతుంటే.. గ్రామాలనే నమ్ముకుని, దుక్కి దున్ని, భూమిని సాగు చేసి పంట పండించే రైతులు, ఆ వ్యవసాయరంగంలో పని చేస్తున్న వాళ్లు... ఒక కూచిపూడి నాట్యాన్ని కానీ ఒడిస్సీ నృత్యాన్ని కానీ చూడాలంటే కుదిరే పని కాదు. అందుకే మన సంప్రదాయ కళలను వాళ్ల దగ్గరకు తీసుకెళ్లడమే మా ప్రయత్నం. కథక్, మణిపురి, మయూర్ భంజ్, చావ్ వంటి ఒరిస్సా జానపద నృత్యాలను కూడా మన గ్రామాల్లో ప్రదర్శిస్తున్నాం'' అని చెప్పారు శశికళ, పరంపర కో ఫౌండర్ డాక్టర్ శ్రీనగి.

### సంబరాల వేదికలు

నలభై ఏళ్లకే పన్నెండు జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాలు, మానస సరోవరం, అమర్‌నాథ్ యాత్రలు పూర్తి చేశాను. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రతి జిల్లాలోనూ చిన్న చిన్న గుళ్లు కూడా చూసేశాను. ఆ యాత్రల అనుభవం ఇప్పుడు గుడి సంబరాల వేదికల ఏర్పాటులో బాగా ఉపయోగపడుతోంది. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన పురాతన కట్టడాలే మాకు వేదికలు.

– శ్రీనగి, గుడి సంబరాలు నిర్వాహకురాలు



### ప్రదేశాల ఎంపిక

గుడి సంబరాలు ఏటా సంక్రాంతి నుంచి శివరాత్రి వరకు జరిగేవి. ఏడాదికి ఎనిమిది నుంచి పన్నెండు ప్రదర్శనలే ఉండేవి. ఈ ఏడాది పదిహేడు ప్రదర్శనలు ఉండడంతో సంక్రాంతికి ముందే మొదలు పెట్టి శ్రీరామనవమితో పూర్తి చేస్తున్నాం. ఇవి పూర్తి అయిన తర్వాత పూర్తి సమయం రోష్నీ సేవలకే. మిగిలిన టైమ్‌లో వచ్చే ఏడాది గుడి సంబరాల కోసం ప్రదేశాల ఎంపిక కోసం ఫీల్డ్ టూర్‌లుంటాయి. ఏడాదంతా పనిలోనే ఉంటాను. ఏదో ఒక పనిలో నిమగ్నం కాకపోతే రోజును వృథా చేశామనిపిస్తుంది''.

– శశికళ,
రోష్నీ, పరంపర సంస్థల వ్యవస్థాపక సభ్యురాలు

**'సంబరాలకు' ప్రేరణ**

శశికళది నిజామాబాద్, శ్రీనగిది వరంగల్. ఇద్దరివీ వ్యవసాయ కుటుంబాలే. ఆడపిల్లలు ఇంటికే పరిమితం కాకూడదు, సమాజం కోసం కూడా పని చేయాల్సిన అవసరం ఉందని నమ్మే కుటుంబాలే ఇద్దరివీ. వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. శ్రీనగి మెడ్విన్ హాస్పిటల్ డైరెక్టర్. శశికళ సెంట్రల్ కోర్ట్ హోటల్ నిర్వహణతోపాటు ఇతర కుటుంబ వ్యాపారాలనూ చూసుకుంటారు.

''ఓసారి హంపి ఉత్సవాలు చూడడానికి వెళ్లినప్పుడు మన తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ఉత్సవాలు జరగడం లేదనిపించింది. కర్నాటకలో హంపి ఉత్సవాలే కాదు, హొయసల మహోత్సవాలు కూడా ఉంటాయి. ఖరజురహో ఉత్సవాలు, కోణార్క్ డాన్స్ అండ్ మ్యూజిక్ ఫెస్టివల్ అయితే దేశవిదేశాల్లో కూడా ప్రసిద్ధి. ఇక కేరళ, తమిళనాడు కూడా ఏ మాత్రం తీసిపోవు. మన దగ్గర కళలు లేవని కాదు, ఆదరణ తక్కువని చెబుతున్నాను. ఎవరైనా ముందుకు వచ్చి కళల కోసం ఏదైనా చేస్తే బావుణ్నని అనిపించింది. హైదరాబాద్ వచ్చాక నా ఫ్రెండ్స్, బంధువులు... అందరితో షేర్ చేసుకున్నాను. వాళ్లను ప్రభావితం చేయాలన్నంత పట్టుదలతో చెప్పాను. వాళ్లందరిలో ముందుకు వచ్చింది ఒక్క శ్రీనగి మాత్రమే. తను డాక్టర్ కాబట్టి పూర్తి సమయాన్ని కేటాయించడం కష్టం. దాంతో 'ఇద్దరం కలిసి చేద్దాం' అన్నది శ్రీనగి. అలా 2015, ఆగస్టు 15వ తేదీన పరంపర ఫౌండేషన్ కార్యక్రమాలు మొదలయ్యాయి'' అని వివరించారు శశికళ.

**పేరు కోసం పరిశోధన**

''మేము చేపట్టినది తెరమరుగవుతున్న మన సంప్రదాయాన్ని పునరుద్ధరించడం. అందుకోసం సంస్కృతం నుంచి తెలుగు నుడికారాల వరకు మాకు తెలిసిన ఎన్నో పేర్లు అనుకున్నాం. చివరికి 'పరంపర – గుడి సంబరాలు' అని నిర్ధారించుకున్నాం. నిజానికి గుడి పెద్ద సామాజిక క్షేత్రం. ఆలయాల ప్రాంగణంలో సామూహిక కార్యక్రమాల కోసం వేదిక ఉంటుంది. ఊరంతా కలిసి ఒక నిర్ణయం తీసుకోవాల్సినప్పుడు సమావేశాలకు వేదిక కూడా ఆలయ మండపమే. నగరాల్లోని ఆడిటోరియాలకు పరిమితమవుతున్న కళలను గ్రామాలకు తీసుకెళ్లగలుగుతున్నాం. ఇవి టిక్కెట్ల ప్రదర్శనలు కావు, పూర్తిగా ఉచితం. పూర్వం కళలను పోషించడానికి రాజులుండేవాళ్లు. ఇప్పుడు కళల ఆదరణకు పూనుకోవాల్సిన బాధ్యత అందరిదీ. అందుకే ఇష్టంగా మొదలు పెట్టాం. మాకు చేతనైనట్లు, చేయగలిగినంత చేయగలుగుతున్నాం. శంషాబాద్ దగ్గర అమ్మపల్లిలో ఉన్న స్టెప్‌వెల్‌లో నాట్య ప్రదర్శన ఏర్పాటు చేయడం ద్వారా మన దగ్గర అలాంటి బావులున్నాయనే సంగతిని తెలియచేయగలిగాం. కొండపల్లి కోటలో నాట్య ప్రదర్శనను పదిహేను వందల మంది చూశారు. అంటే అంతమందికీ మన చారిత్రక కట్టడాన్ని కూడా దగ్గర చేయగలిగామనే అర్థం. ఇలాంటివి ఇంకా చేస్తాం'' అన్నారు శశికళ, శ్రీనగి.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: జి. అమర్

పరిపరిశోధన

# జంక్‌ఫుడ్‌తో వీర్యకణాల తగ్గుదల!

జంక్‌ఫుడ్ కారణంగా ఎన్నో రకాల అనర్థాలు వస్తాయన్న సంగతి ఇప్పటికే చాలా పరిశోధనల్లో, అధ్యయనాల్లో తేలింది. అయితే జంక్‌ఫుడ్ కారణంగా వీర్యకణాల సంఖ్య (స్పెర్మ్‌కౌంట్) తగ్గుతుందని ఇటీవలి తాజా అధ్యయనంలో తేలింది.



బోస్టన్(యూఎస్)లోని హార్వర్డ్ టీ.హెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన పరిశోధకులు దాదాపు 3,000 మందికి పైగా యువకుల్లో ఓ అధ్యయనాన్ని నిర్వహించారు. 19 ఏళ్లు పైబడిన యువకులను నాలుగు గ్రూపులుగా విభజించి వారిలో ఒక గ్రూపునకు ఆరోగ్యకరమైన ఆహారం ఇచ్చారు. వారి ఆహారంలో తాజా కూరగాయలు, ఆకుకూరలు, చేపలు, పండ్లు, నట్స్, గుడ్లు, తృణధాన్యాలు ఉండేలా చూశారు. అలాగే మరో గ్రూపునకు ఒకింత తక్కువ ఆరోగ్యకరమైన ఆహారం సమకూర్చారు. ఇలా మొదటి గ్రూపు మినహా ప్రతి గ్రూపునకూ కొంత పోషకాహారాన్ని తగ్గిస్తూ, జంక్‌ఫుడ్‌ను పెంచుతూ పోయారు.

ఈ నాలుగు గ్రూపుల వీర్యనమూనాలను సేకరించి పరీక్షించగా... జంక్‌ఫుడ్‌ను తీసుకున్న గ్రూపుతో పోలిస్తే... పూర్తిగా అన్ని పోషకాలు ఉన్న మంచి సమతుహారాన్ని తీసుకున్న గ్రూపులోని యువకులలో వీర్యకణాల సంఖ్య, కదలికలు చాలా బాగున్నట్లు తేలింది. జంక్‌ఫుడ్ తీసుకున్న గ్రూపుతో పోలిస్తే, మంచి ఆహారం తీసుకున్న గ్రూపులోని యువకుల వీర్యంలో వీర్యకణాల సంఖ్య దాదాపు 25 శాతం ఎక్కువగా ఉన్నట్లు ఈ అధ్యయనంలో వెల్లడైంది. అంటే... జంక్‌ఫుడ్ తీసుకోవడం అన్న అంశం సంతానలేమికి ఎంతో కొంత దోహదం చేస్తుందన్న విషయం ఈ అధ్యయనం ద్వారా స్పష్టమైంది. ఈ అధ్యయన ఫలితాలు ప్రముఖ వైజ్ఞానిక జర్నల్ 'జామా'లో ప్రచురితమయ్యాయి.

# శ్రీవారి సేవలో... అలుపెరగని పాదచారి


రికార్డు నమోదైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డు, బుక్‌తో శ్రీనివాసరావు

శ్రీనివాసుని మాలధారణ చేస్తూ గోవింద నామం జపిస్తూ ఏడుకొండల్లో నడుచుకుంటూ వెళ్తూ.. మనసంతా స్వామి ధ్యానంలో నిమగ్నం చేస్తే అదొక అనుభూతి అని భక్తులు చెబుతుంటారు. ఏడుకొండల్లో మెట్ల మార్గం ద్వారా నడుచుకుంటూ వెళ్తున్నవారు అనేక మంది ఉన్నారు. కానీ 258 సార్లు వెళ్లిన మహంతి శ్రీనివాసరావు ప్రత్యేక వ్యక్తిగా నిలిచారు. శ్రీకాకుళం అంబేడ్కర్ కూడలి సమీపంలో ఆయుర్వేద దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న శ్రీనివాసరావు 1996 ఆగస్టులో తిరుమల తిరుపతిలో శ్రీవారి దర్శనానికి శ్రీకారం చుట్టారు. అప్పటినుండి అలిపిరి మార్గం, శ్రీవారి మెట్ల మార్గం ద్వారా కొండెక్కి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా మారింది. అవకాశం లభించినప్పుడల్లా ఒంటరిగానో, కుటుంబ సమేతంగానో అలిపిరి, శ్రీవారి మెట్లమార్గంలో తిరుమలకు చేరుకుని స్వామిని సేవించుకుంటున్నారు. ఆయన పాదయాత్ర రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతూనే ఉంది. మొదట్లో తిరుపతి నుంచి అలిపిరి మీదుగా మెట్లమార్గంలో రోజుకు ఒకసారి వెళ్లగలిగేవారు. తర్వాత శ్రీవారి మెట్లమార్గంలో వెళ్తున్నారు.

జిల్లా నుంచి తిరుమల తిరుపతి దేవస్థానంలో జేఈవోగా పనిచేసిన విశ్రాంత అధికారి రుంకు అప్పారావు 108 సార్లు తిరుమల కొండను కాలినడకన ఎక్కారు. గతంలో ఇది జిల్లాలో ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. అదే స్ఫూర్తితో మహంతి శ్రీనివాసరావు కాలినడకన ఏడుకొండలు ఎక్కి శ్రీవారి దర్శనం చేసుకుంటున్నారు.. 3,550 మెట్లతో ఉండే అలిపిరి కాలినడక మార్గంలో (సుమారు 9కిలోమీటర్ల దూరం, 4గంటలు సమయం) 85సార్లు... 2388మెట్లతో రెండున్నర కిలోమీటర్ల దూరం (రెండు గంటల సమయం) ఉండే శ్రీవారి మెట్ల మార్గంలో 173 సార్లు తిరుమల కొండను చేరి స్వామి దర్శనం చేసుకున్నారు.

**ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకెక్కిన శ్రీనివాసరావు**

అరుదైన ఘనత సాధించిన వాళ్లను ఇండియా బుక్ రికార్డులో ఎక్కిస్తారని తెలుసుకుని 205వ సారి పూర్తి చేసుకున్నప్పుడు శ్రీనివాసరావు దరఖాస్తు చేశారు. 223వసారి కొండ ఎక్కిన సందర్భంలో ఇండియా బుక్ రికార్డులో స్థానం సంపాదించారు. 50, 51సంవత్సరాల వయస్సులో 2017లో 50పర్యాయాలు, 2018లో 71 పర్యాయాలు కాలినడకన తిరుమల ఎక్కినందుకు ఈ ఘనత సాధించారు. 2019మార్చి 5న ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికేట్ స్వీకరించారు. తాజాగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డు పుస్తకాన్ని కూడా అందుకున్నారు.

భక్తులకు మార్గదర్శిగా జిల్లా నుండి తిరుమల తిరుపతికి వెళ్లే భక్తులకు శ్రీనివాసరావు గైడ్‌గా మారారు. తిరుమలలో వసతి, సేవలు, క్షేత్రమహిమలు, ఇతర సమాచారాన్ని ఎప్పటికప్పుడు భక్తులకు వివరిస్తూ ఆధ్యాత్మిక ప్రబోధం చేస్తూ స్వామివారి సేవలో తరిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీ కౌంటర్లలో స్వచ్ఛందంగా సేవలందిస్తూ స్వామి వారిపై తన అచంచలమైన భక్తి, విశ్వాసాలను ఆయన చాటుకుంటున్నారు.


తిరుపతి నుంచి కాలినడకన తిరుమల వెళ్తున్న శ్రీనివాసరావు( ఫైల్‌ఫొటోలు)


ఇండియా బుక్ ఆఫ్ రికార్డు అందుకున్న శ్రీనివాసరావును అభినందిస్తున్న టీటీడీ ఈఓ సింఘాల్

**తన వెంటే కుటుంబం**

శ్రీనివాసరావే కాదు, ఆయన భార్య సరస్వతి కూడా విష్ణు లలితా సహస్ర నామ పారాయణం, కోలాటం బృందాలతో పలుమార్లు తిరుమలకు వెళ్లారు. ఇప్పటివరకు ఆమె 53 సార్లు తిరుపతి నుంచి కాలినడకన తిరుమల వెళ్లారు. 2002 నుంచి ప్రతీ ఏటా వెళ్తూనే ఉన్నారు. రికార్డుస్థాయిలో తిరుమల ప్రయాణం చేసి శ్రీవారి భక్తుల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు వారిలో స్ఫూర్తిని, సరికొత్త ఉత్తేజాన్ని నింపుతున్నారు శ్రీనివాసరావు.

**శక్తి ఉన్నంతవరకు నడిచే వెళ్తా**

నైతిక విలువలతో, అత్యంత పవిత్రతతో తిరుమలకు అనేకమార్లు ఆధ్యాత్మికయాత్ర చేపట్టడటం తన లక్ష్యమని చెబుతున్నారు. కలియుగ ప్రత్యక్షదైవం విశిష్టతను దశదిశలా చాటుతూ స్వామివారి సేవలో మమేకం కావడం తన జీవితంలో అంతర్భాగంగా మారిపోయిందని అంటున్నారు. శక్తి ఉన్నంతవరకు కాలినడకనే తిరుమల వెళ్తానని శ్రీనివాసరావు చెబుతున్నారు. ఎన్ని సార్లు వెళ్తానన్నది ఇప్పుడే చెప్పలేను.

– కందుల శివశంకర్, సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం
ఫొటోలు : కె.జయశంకర్, శ్రీకాకుళం

కలర్స్



# పింక్ రాణి









మనలో అందరికీ ఏదో ఒకటి లేదా రెండు రంగులు ఇష్టమైనవై ఉంటాయి. ఆ ఇష్టమైన రంగు దుస్తులు, ఇతర అలంకరణ వస్తువులను అప్పుడప్పుడు వాడి సంతృప్తి పొందుతుంటాం. కానీ, తనకు ఇష్టమైన ఒక రంగును కొన్నేళ్లుగా అమితంగా ప్రేమిస్తూ, దానినే ధరిస్తూ, ఆ రంగుతోనే ఇంటినంతా అలంకరించుకొని, ఆ రంగులోనే జీవిస్తున్న అందమైన లేడీ ఒకరున్నారు. పేరు కిట్టెన్ కే సెరా. వయసు 56 ఏళ్లు. అమెరికాలోని టెక్సాస్‌లో ఉంటుంది. టీవీ నటిగా గుర్తింపు పొందింది. తను చేసే టీవీ కార్యక్రమాలన్నింటిలోనూ పింక్ దుస్తుల్లోనే కనిపించేది. బెవర్లీ హిల్స్ చివావా2 సినిమాలోనూ పింక్ కలర్ ఆహార్యంతోనే నటించింది. 'ది పింక్ లేడీ ఆఫ్ హాలీవుడ్' అని ఈమెను అంతా ముచ్చటగా పిలుచుకుంటారు. ముప్పై ఏళ్లకు పైగా గులాబీ రంగు తప్ప మరేమీ ధరించని ఈ పింకమ్మ జుట్టు రంగు పింక్, గోళ్ల రంగు పింక్, పెదాల రంగు పింక్, దుస్తులు పింక్... చివరకు తను వాడే కారు పింక్, ముద్దులొలికే కుక్క రంగు పింక్... ఇలా లైఫ్‌ని అంతా పింక్‌మయంగా మార్చుకున్న కిటెన్ కే సెరా ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్ వేదికల మీదా పింక్‌గానే కనిపిస్తూ 'వరల్డ్ పింక్ క్వీన్' అంటూ అభిమానుల చేత పిలిపించుకుంటుంది. అమ్మాయిల చెంపలను గులాబీ రంగు బుగ్గలు అంటూ పొగిడే కవులు ఈ గులాబీ లేడీని చూస్తే ఏమని పొగిడెదరో.. అనిపించకమానదు.

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
సోమవారం 24-2-2020

**పదోతరగతి తర్వాత చాలామంది విద్యార్థులు చదివేది.. ఇంటర్మీడియెట్! ఎక్కువ మంది విద్యార్థులు ఎంచుకునేది.. సీబీఎస్ఈ, స్టేట్ బోర్డులే! మరోవైపు.. విదేశీ విద్య పట్ల రోజురోజుకీ పెరుగుతున్న క్రేజ్ ! ఇంటర్ నుంచే అంతర్జాతీయ యూనివర్సిటీలకు వెళ్లాలనే ఆలోచన!! అందుకు ఇంటర్మీడియెట్ స్థాయిలో చేరిన బోర్డులు, సాధించిన మార్కులు కీలకంగా మారుతున్న వైనం! ఇలాంటి పరిస్థితుల్లో పదోతరగతి ఉత్తీర్ణులకు.. ఇంటర్మీయెట్/ తత్సమాన కోర్సులో చేరిన నాటి నుంచే విదేశీ విద్యకు మార్గం వేస్తున్నాయి.. ఐజీసీఎస్ఈ, ఐబీ, ఐసీఎస్ఈ బోర్డులు! ఈ నేపథ్యంలో.. పదోతరగతి తర్వాత విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశాలు అందుకునే వీలు కల్పిస్తున్న బోర్డుల గురించి తెలుసుకుందాం...**




## పదో తరగతితోనే..

# విదేశీ విద్యకు మార్గం!

ఐఐటీ, నీట్ లక్ష్యంగా పెట్టుకుంటున్న విద్యార్థులు సీబీఎస్ఈ బోర్డ్ సిలబస్‌వైపు అడుగులు వేస్తున్నారు. రాష్ట్రాల స్థాయిలోనే ఇంజనీరింగ్ కోర్సులు చదవాలనుకునే విద్యార్థులు.. స్టేట్ బోర్డ్‌లలోనే ఇంటర్మీడియెట్‌లో చేరుతున్నారు. మరోవైపు ఇంత కాలం విదేశీ విద్య అంటే.. బ్యాచిలర్ డిగ్రీ తర్వాతే ప్రయత్నాలు ప్రారంభించేవారు. కాని ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పోటీ వాతావరణం, విదేశీ ఇన్‌స్టిట్యూట్‌లు అనుసరిస్తున్న విధానాల కారణంగా ఇంటర్ స్థాయి నుంచే విదేశీ విద్య దిశగా అడుగులు వేస్తున్నారు. అందుకోసం ఐబీ, ఐజీసీఎస్ఈ, ఐసీఎస్ఈ సర్టిఫికెట్లు దోహదపడుతున్నాయి. బ్యాచిలర్ డిగ్రీ పూర్తయ్యేదాక వేచి చూసే కంటే.. ఐబీ, ఐజీసీఎస్ఈ, ఐసీఎస్ఈ ద్వారా చిన్న వయసులోనే విదేశీ యూనివర్సిటీల్లో అడుగుపెట్టొచ్చని విద్యార్థులు, తల్లిదండ్రులు భావిస్తున్నారు.

### ఐబీ డిప్లొమా

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందుతున్న కోర్సు.. ఇంటర్నేషనల్ బ్యాక్యులరేట్ ఆర్గనైజేషన్ అందిస్తున్న ఐబీ డిప్లొమా(ఇంటర్నేషనల్ బ్యాకులరేట్ డిప్లొమా). డిప్లొమా అని పేర్కొంటున్నప్పటికీ.. వాస్తవానికి ఇది ఇంటర్మీడియెట్, +2లకు తత్సమానమైన కోర్సు. పదోతరగతి అర్హతతో ప్రవేశం లభించే ఈ కోర్సు రెండేళ్ల పాటు గ్రేడ్-11, గ్రేడ్-12 పేరుతో కొనసాగుతుంది. బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్‌తోపాటు ఏదైనా ఒక ఫారెన్ లాంగ్వేజ్‌ను అభ్యసించాల్సి ఉంటుంది. యూజీ స్థాయిలో అంతర్జాతీయంగా పేరున్న యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సుల్లో అడుగుపెట్టే అవకాశం ఉండటం ఐబీ డిప్లొమా ప్రత్యేకత. ఇందులో అన్ని విభాగాలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా కామర్స్, హ్యుమానిటీస్ సబ్జెక్టులు కూడా ఉంటాయి. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న విభాగంలో ఐబీ డిప్లొమా కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

### ఐబీతో విదేశీ ప్రవేశాలు ఖాయం

ఐబీ డిప్లొమా పూర్తిచేసుకున్న విద్యార్థులకు విదేశీ యూనివర్సిటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో ప్రవేశాలు ఖాయం అని చెప్పొచ్చు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా.. ఇలా ఏ దేశంలోని యూనివర్సిటీలను పరిగణనలోకి తీసుకున్నా.. ఇతర బోర్డ్‌ల విద్యార్థులతో పోల్చితే ఐబీ డిప్లొమా పూర్తిచేసిన వారికి ప్రవేశాల పరంగా సక్సెస్ రేటు పదింతలు ఎక్కువగా కనిపిస్తోంది.

### ఐబీ, ఐజీసీఎస్ఈ, ఐసీఎస్ఈలతో అంతర్జాతీయ గుర్తింపు

### ఈ బోర్డు చదువులతో విదేశీ వర్సిటీల్లో ప్రవేశాలు సులభం

### ఐజీసీఎస్ఈ.. మరో ముఖ్యమైన కోర్సు

ఇంటర్నేషనల్ జనరల్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (ఐజీసీఎస్ఈ).. ప్రపంచ వ్యాప్తంగా యూనివర్సిటీలు యూజీ స్థాయిలో ప్రవేశాల పరంగా ప్రత్యేక గుర్తింపు ఇస్తున్న మరో ముఖ్యమైన కోర్సు ఇది. కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ నిర్వహించే ఈ కోర్సును.. 'ఎ' లెవల్ కోర్సుగా పరిగణిస్తున్నారు. తొలిఏడాది మొదటి విభాగంలో అడ్వాన్స్‌డ్ సబ్సిడరీ పేరుతో 4 సబ్జెక్ట్‌లను అభ్యసించాలి. తొలిఏడాది మొదటి విభాగం పూర్తి చేసుకున్న తర్వాత రెండో సంవత్సరం మూడు సబ్జెక్ట్‌లు చదవాల్సి ఉంటుంది. గ్లోబల్ పర్‌స్పెక్టివ్ అండ్ రీసెర్చ్ తప్పనిసరిగా ఉండే ఈ కరిక్యులంతో విద్యార్థులకు +2 స్థాయిలోనే చక్కటి విశ్లేషణ దృక్పథం అలవడుతుంది. ఐజీసీఎస్ఈ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కూడా అండర్ గ్రాడ్యుయేట్(బ్యాచిలర్ డిగ్రీ) ప్రవేశాల విషయంలో విదేశీ యూనివర్సిటీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

### ఐబీ, ఐజీసీఎస్ఈ.. క్లిష్టత స్థాయి ఎక్కువే

అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఐబీ, ఐజీసీఎస్ఈలకు క్లిష్టత స్థాయి ఎక్కువే. కేవలం రాత పరీక్షలు, వాటిలో పొందిన మార్కులే కాకుండా.. ఇతర విధానాల్లోనూ విద్యార్థుల ప్రతిభను గుర్తించే విధంగా మూల్యాంకన జరుగుతుంది. ఐజీసీఎస్ఈతో పోల్చితే ఐబీ కరిక్యులం మరింత క్లిష్టమైనదని చెప్పొచ్చు. ఐబీ విద్యార్థులు కేవలం సబ్జెక్ట్‌ల అభ్యసనానికే పరిమితం కాకుండా.. క్రియేటివిటీ యాక్షన్ సర్వీసెస్, ఎక్స్‌టెండెడ్ ఎస్సే, థియరీ ఆఫ్ నాలెడ్జ్ తదితర అంశాలను కూడా తప్పనిసరిగా చదవాల్సి ఉంటుంది.

### జాతీయ స్థాయిలో.. ఐసీఎస్ఈ

మన దేశంలో జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిన బోర్డ్.. ఐసీఎస్ఈ. కౌన్సిల్ ఫర్ ద ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్ నిర్వహించే ఐసీఎస్ఈ కోర్సు వ్యవధి రెండేళ్లు. ఈ కోర్సును మొదటి సంవత్సరం క్లాస్-11గా, రెండో సంవత్సరం క్లాస్-12గా పేర్కొంటారు. ఐఎస్ఈ క్లాస్-12 అని సర్టిఫికెట్ ఇస్తారు. సబ్జెక్ట్‌ల పరంగా క్లాస్-11 స్థాయిలో ఇంగ్లిష్, ఇండియన్ లాంగ్వేజ్, మోడ్రన్ ఫారెన్ లాంగ్వేజ్, క్లాసికల్ లాంగ్వేజ్, ఎలక్టివ్ ఇంగ్లిష్ వంటి తప్పనిసరి సబ్జెక్ట్‌లతోపాటు ఆర్ట్స్, హ్యుమానిటీస్, అకౌంట్స్, కామర్స్, మ్యాథమెటిక్స్, బయాలజీ వంటి విభాగాల్లో తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్ట్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇదే విధంగా క్లాస్-12 కరిక్యులం కూడా అమలవుతుంది. ఐసీఎస్ఈ సిలబస్ పరిధి విస్తృతంగా ఉండటం విద్యార్థులకు కొంత ఇబ్బందికరమని చెప్పొచ్చు. విద్యార్థుల ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్ కోణంలో బోధన విధానాలు అమలవుతున్నాయి. ఫలితంగా ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు సైతం అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో విదేశీ విద్య ప్రవేశాలకు దీటుగా పోటీ పడే సామర్థ్యం లభిస్తుంది.

### సీబీఎస్ఈకి అత్యంత ఆదరణ

మన దేశంలో అత్యంత ఆదరణ పొందిన బోర్డ్.. సీబీఎస్ఈ. ఈ బోర్డ్ పరిధిలో +1, +2 చదివిన విద్యార్థులకు.. జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్ తదితర పోటీ పరీక్షల్లో ముందంజలో నిలిచే సామర్థ్యం లభిస్తుంది. సీబీఎస్ఈ బోర్డ్.. విద్యార్థుల్లో ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్ దిశగా కరిక్యులం రూపొందించింది. ప్రస్తుతం సీబీఎస్ఈలో ప్రధానంగా మూడు స్ట్రీమ్(గ్రూప్)లు అందుబాటులో ఉన్నాయి. అవి.. సైన్స్, కామర్స్, హ్యుమానిటీస్. » సైన్స్ స్ట్రీమ్‌లో.. మెడికల్, నాన్-మెడికల్ పేరుతో రెండు సబ్ స్ట్రీమ్‌ల విధానం అమలవుతోంది. » నాన్-మెడికల్ స్ట్రీమ్‌లో.. విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లతోపాటు ఏదైనా ఒక ఆప్షనల్ సబ్జెక్ట్‌ను చదవాల్సి ఉంటుంది. దీన్ని పీసీఎం గ్రూప్‌గా పిలుస్తున్నారు. » **మెడికల్ స్ట్రీమ్‌లో..** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లను ఒక ఆప్షనల్ సబ్జెక్ట్‌ను చదవాలి. దీన్నే పీసీబీ గ్రూప్‌గా పేర్కొంటున్నారు. » **కామర్స్ స్ట్రీమ్‌లో..** అకౌంటెన్సీ, బిజినెస్ స్టడీస్, ఎకనామిక్స్, ఇంగ్లిష్, ఒక ఆప్షనల్ సబ్జెక్ట్ చదవాల్సి ఉంటుంది. » **హ్యుమానిటీస్ స్ట్రీమ్..** మిగతా స్ట్రీమ్‌లతో పోల్చితే విభిన్నం, వినూత్నం అని చెప్పొచ్చు. ఈ స్ట్రీమ్‌లో విద్యార్థులకు కోర్ సబ్జెక్ట్ అనే విధానంలో హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జాగ్రఫీ, సోషియాలజీ, సైకాలజీ.. ఇలా అనేక సబ్జెక్ట్‌లు అందుబాటులో ఉంటాయి.

### స్టేట్ బోర్డ్‌లో ఇలా

రాష్ట్ర స్థాయిలో ఇంటర్మీడియెట్‌లో.. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల కాలంలో ఎంఈసీ గ్రూప్ కూడా ఆదరణ పొందుతోంది. వీటిలో చేరిన అభ్యర్థులు ఫస్ట్ లాంగ్వేజ్, సెకండ్ లాంగ్వేజ్‌తోపాటు గ్రూప్ సబ్జెక్ట్‌లుగా నిర్దేశించిన మూడు సబ్జెక్ట్‌లనే చదవాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ బోర్డ్ మాదిరిగా ఆప్షనల్ సబ్జెక్ట్‌ను ఎంచుకునే అవకాశం ఉండదు. ఇంజనీరింగ్ లక్ష్యంగా చేసుకున్న అభ్యర్థులు స్టేట్ బోర్డ్‌ను ఎంచుకుంటే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీబీఎస్ఈతో పోల్చితే స్టేట్ బోర్డ్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌ల సిలబస్ పరిపూర్ణంగా ఉండటమే ఇందుకు కారణం. వీటిలో పట్టు సాధించిన విద్యార్థులు జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్, ఎంసెట్ వంటి పరీక్షల్లో మంచి ర్యాంకులు సొంతం చేసుకునే అవకాశం ఉంటుందని సబ్జెక్ట్ నిపుణులు అంటున్నారు.

### బోర్డ్‌లు.. ముఖ్యాంశాలు

- విదేశీ విద్య అభ్యసించాలనుకుంటే.. ఐబీ, ఐజీసీఎస్ఈ బోర్డ్‌లలో చదవడం మేలు.
- జాతీయ స్థాయిలోనే జేఈఈ మెయిన్,అడ్వాన్స్‌డ్, నీట్ వంటి పరీక్షల్లో మెరుగైన స్కోర్లకు సీబీఎస్ఈ, స్టేట్ బోర్డ్‌లు చదవడం ఉపయుక్తం.
- ముఖ్యంగా మెడిసిన్‌పై ఆసక్తి గల అభ్యర్థులు సీబీఎస్ఈ చదివితే మేలు.
- ఇంజనీరింగ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులకు స్టేట్ బోర్డ్‌ల సిలబస్‌తో ప్రయోజనమనే అభిప్రాయం.
- సీబీఎస్ఈ, ఐసీఎస్ఈలతో పోల్చితే ఐబీ, ఐజీసీఎస్ఈ సబ్జెక్ట్‌ల క్లిష్టత స్థాయి అధికం.

### ఐబీ, ఐజీసీఎస్ఈ.. శాట్, ఏసీటీల నుంచి మినహాయింపు

విదేశాల్లో అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో (బ్యాచిలర్ డిగ్రీ) ప్రవేశం పొందాలంటే.. శాట్, ఏసీటీ, యూకేక్యాట్, బీఎంఏటీ వంటి స్టాండర్డ్ సబ్జెక్ట్ టెస్ట్‌లతోపాటు, లాంగ్వేజ్ టెస్ట్ స్కోర్లు సాధించాల్సి ఉంటుంది. ఐబీ డిప్లొమా, ఐజీసీఎస్ఈ కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు పలు విదేశీ యూనివర్సిటీలు ఈ స్కోర్ల నుంచి మినహాయింపు ఇస్తున్నాయి. టాప్ యూనివర్సిటీలుగా గుర్తింపుపొందిన హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, కాలిఫోర్నియా యూనివర్సిటీ, ఎంఐటీ వంటి యూనివర్సిటీలు సైతం ఐబీ డిప్లొమా, ఐజీసీఎస్ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి స్టాండర్డ్ టెస్ట్ స్కోర్ల నుంచి మినహాయింపు ఇస్తుండటం విశేషం.

### బోర్డ్ ఎంచుకోవడం ఎలా

ప్రస్తుతం పదో తరగతి తర్వాత ఇంటర్మీడియెట్, తత్సమాన స్థాయిలో అనేక బోర్డ్‌లు అందుబాటులో ఉన్నాయి. దాంతో విద్యార్థులకు ఏ బోర్డ్ తమకు అనుకూలం అనే సందేహం తలెత్తడం సహజం. క్రియేటివ్ థింకింగ్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, ప్రాక్టికల్ అప్రోచ్, అప్లికేషన్ ఓరియెంటేషన్ ఉన్న విద్యార్థులు.. ఐబీ, ఐజీసీఎస్ఈ బోర్డ్‌ల కోర్సులలో చేరితే మేలని సబ్జెక్ట్ నిపుణులు సూచిస్తున్నారు. ఇవి ఉన్నత విద్య పరంగా అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలోనే విదేశీ విద్యపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. జాతీయ స్థాయిలో ఐఐటీలు, నీట్ వంటి పరీక్షలను లక్ష్యంగా చేసుకున్న విద్యార్థులు సీబీఎస్ఈ బోర్డ్ చదవాలని సూచిస్తున్నారు.

### ఆసక్తి ప్రధానం

ఏ బోర్డ్‌లో, ఏ కోర్సు చదవాలి అనే విషయంలో ముందుగా విద్యార్థి స్వీయ ఆసక్తిని గుర్తించాలి. దాన్ని పరిగణనలోకి తీసుకున్నాకే ఒక నిర్ణయానికి రావాలి. భవిష్యత్తు అవకాశాలు బాగుంటాయని, లేదా బోర్డ్‌కు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని కోర్సులో చేరినా.. ఆ తర్వాత అందులో రాణించగలిగే సామర్థ్యం ఎంతో ముఖ్యం.

**-వసంత రామన్,** ప్రిన్సిపాల్, డీపీవీ పబ్లిక్ స్కూల్

## సృజనాత్మకత ఉంటే..

# కొలువులు సొంతం

### వరల్డ్ యూనివర్సిటీ ఆఫ్ డిజైన్ వీసీ డాక్టర్ సంజయ్ గుప్తా

**సృజనాత్మకత, ప్రతిభ ఉంటే.. డిజైనింగ్ రంగంలో విస్తృత అవకాశాలు లభిస్తాయంటున్నారు వరల్డ్ యూనివర్సిటీ ఆఫ్ డిజైన్ వైస్ ఛాన్సలర్(వీసీ) డాక్టర్ సంజయ్ గుప్తా. ఐఐటీ, ఐఐఎంల్లో ఉన్నత విద్యను అభ్యసించి.. పలు ప్రముఖ విద్యాసంస్థల్లో పనిచేసిన గుప్తా.. ప్రస్తుతం వరల్డ్ యూనివర్సిటీ ఆఫ్ డిజైన్ వీసీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రపంచ విద్యా సదస్సులో పాల్గొనడానికి హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా డాక్టర్ సంజయ్ గుప్తా సాక్షి భవితకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ వివరాలు..**

### అన్నీ ఒకే చోట

దేశంలో వివిధ సంస్థలు డిజైనింగ్ కోర్సులను అందిస్తున్నా.. విద్యార్థులకు ఏ టూ జెడ్ అంటే ఫుట్‌వేర్ డిజైనింగ్ నుంచి గ్రాఫిక్ డిజైనింగ్, ఫర్నిచర్ డిజైనింగ్ వరకూ.. అన్ని రకాల కోర్సులను ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో హరియాణాలో వరల్డ్ యూనివర్సిటీ ఆఫ్ డిజైన్‌ను ఏర్పాటు చేశాం. మేము అందించే కోర్సుల్లో ఎక్కువగా ప్రాక్టికల్ వర్క్, తక్కువ థియరీ ఉంటుంది. విద్యార్థులు విని, చదివి నేర్చుకునే దానికంటే ప్రాక్టీకల్‌గా చేయడం ద్వారా ఎక్కువ జ్ఞానాన్ని సంపాదిస్తారు. విద్యార్థులు ప్రాక్టీకల్స్ చేయడం ద్వారానే ఆ సబ్జెక్టుకు సంబంధించి అవగాహన పూర్తిస్థాయిలో వస్తుంది.

### కోర్సులు ఇవే

ప్రస్తుతం డిజైన్ యూనివర్సిటీలో అండర్ గ్రాడ్యుయేషన్(యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ)లలో ప్రొడక్ట్ డిజైన్, ఫ్యాషన్ డిజైన్, ఇంటీరియర్ ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, రిటైల్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులు అందిస్తున్నాం. అలాగే ఫ్యాషన్ డిజైనింగ్, గ్రాఫిక్ అండ్ వెబ్ డిజైనింగ్, ఫోటోగ్రఫీ, పెయింటింగ్‌లో డిప్లొమా కోర్సుల్లోనూ ప్రవేశాలు కల్పిస్తున్నాం. డిజైన్ కోర్సులు ఎంతో ప్రత్యేకమైనవని చెప్పొచ్చు.





### డిజైనర్లకు డిమాండ్

మేము అందించే కోర్సులనే కాకుండా డిజైనింగ్ రంగంలో గత దశాబ్దకాలంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. సృజనాత్మకత కలిగిన డిజైనర్లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. మనం ఏ వస్తువు కొనాలన్నా కూడా సౌకర్యంగా, ఆకర్షణీయంగా ఉంటేనే కొంటాం కదా. అలాగే ఇతరులను ఆకర్షించే విధంగా వస్తువులు ఉండాలని కోరుకుంటాం. మేము అందించే కోర్సుల్లో ఇలాంటి అన్ని అంశాలను కవర్ చేశాం. ఒకసారి విద్యార్థులు విజయవంతంగా కోర్సులకు పూర్తి చేసుకొని మంచి నైపుణ్యాలతో బయటకు వస్తే.. వారికి జాబ్ మార్కెట్‌లో ఉద్యోగావకాశాలకు కొదవలేదు.

### ప్లేస్‌మెంట్స్

ప్రస్తుతం యూనివర్సిటీ ప్రారంభించాక మొదటి బ్యాచ్ ఈ ఏడాది బయటికి రానుంది. ఇప్పటికే చాలా కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఆకర్షణీయమైన వేతనాలతో మా విద్యార్థులను ఎంపిక చేసుకున్నాయి.




# టాటా స్కాలర్‌షిప్

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు జేఎన్‌టాటా ఎండోమెంట్ లోన్ స్కాలర్‌షిప్ అందిస్తోంది. ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు రూ.లక్ష నుంచి రూ.పది లక్షల వరకు ఆర్థిక ప్రోత్సాహం అందుతుంది. దీనికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

### అర్హతలు

- ప్రభుత్వ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం లేదా కళాశాల నుంచి అండర్‌గ్రాడ్యుయేషన్ 60 శాతం మార్కులతో పూర్తిచేసిన వారై ఉండాలి. ప్రస్తుతం యూజీ ఆఖరు సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తుకు అర్హులే.
- ఇప్పటికే విదేశాల్లో ఉన్నత విద్యకు సంబంధించి రెండో ఏడాది విద్యాభ్యాసం చేస్తున్న వారు ఫాల్ 2020, స్ప్రింగ్ 2021కు దరఖాస్తు చేసుకోవచ్చు.
- గతంలోనే ఈ స్కాలర్‌షిప్‌లను పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులు.
- విదేశాల్లోని విద్యాసంస్థల్లో ఉన్నత విద్యకు సంబంధించిన పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ స్టడీస్, రీసెర్చ్ ఫెలోషిప్‌లకు ఎంపికైన వారు ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

### వయసు

ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థుల వయసు జూన్ 30, 2020 నాటికి 45 ఏళ్లు మించకూడదు. ఎంచుకున్న విభాగంలో మంచి విద్యా నేపథ్యం, అనుభవం ఉన్న వారూ అర్హులే. సెమినార్లు, కాన్ఫరెన్సులు, అండర్ గ్రాడ్యుయేషన్ విద్యను అభ్యసించడానికి వెళ్లాలనుకునే వారు దరఖాస్తులకు అనర్హులు.




### స్కాలర్‌షిప్

- అభ్యర్థులు ఎంచుకున్న కోర్సు అవసరాల ఆధారంగా రూ.లక్ష నుంచి పది లక్షల వరకు మాత్రమే స్కాలర్‌షిప్‌ను అందజేస్తారు. పూర్తిస్థాయి విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చులను మాత్రం చెల్లించరు.
- అభ్యర్థులు తమ చదువులో కనబర్చిన ప్రతిభ ఆధారంగా ట్రస్ట్ నిర్ణయం మేరకు పార్షియల్ ట్రావెల్ గ్రాంట్ రూ. 50 వేలు, గిఫ్ట్ స్కాలర్‌షిప్ కింద రూ.7.50,000 వరకు పొందే వీలుంటుంది. ఈ గిఫ్ట్ అవార్డులను ఇవ్వడం, ఇవ్వకపోవడం అనేది ట్రస్టు నిర్ణయంపైన ఆధారపడి ఉంటుంది.

### ఎంపిక ప్రక్రియ

- స్కాలర్‌షిప్‌కు సంబంధించి వచ్చిన దరఖాస్తులను బట్టి ప్రాథమికంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- జీఆర్ఈ/జీమ్యాట్/టోఫెల్/ఐఈఎల్‌టీఎస్‌ల్లో మంచి స్కోర్ సాధించి ఉండాలి.
- అభ్యర్థుల విద్యార్హతలు, కో కరిక్యులర్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ అంశాలను పరిశీలిస్తారు.

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 09, 2020
- **వెబ్‌సైట్:** http://www.jntataendowment.org

## ఐఐటీలో లా

ఐఐటీలు అంటే.. ఎక్కువ మందికి గుర్తుకు వచ్చేది ఇంజనీరింగ్ కోర్సులు మాత్రమే. కాని ఐఐటీ ఖరగ్‌పూర్ మాత్రం ఇంజనీరింగ్‌తో పాటు మేనేజ్‌మెంట్, మెడిసిన్, లా కోర్సులను సైతం అందిస్తూ మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. సైన్స్.. టెక్నాలజీ.. లా మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు ఐఐటీ, ఖరగ్‌పూర్ కొన్ని ప్రత్యేకమైన కోర్సులను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగానే న్యాయ విద్యకు సంబంధించి ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సులను అందిస్తోంది.

### లా కోర్సు ప్రత్యేకత

ఐఐటీ ఖరగ్‌పూర్ ఇంజనీరింగ్ తోపాటు మేనేజ్‌మెంట్, మెడిసిన్, లా కోర్సులను చాలా ఏళ్ల నుంచే నిర్వహిస్తోంది. ఇతర విద్యాసంస్థల కంటే ఈ సంస్థ అందించే ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా, ఇతర లా కోర్సులకు దేశ వ్యాప్తంగా మంచి పేరు ఉంది. ఈ కోర్సు పూర్తిచేసుకున్న అభ్యర్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ లోనే ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగాలను సొంతం చేసుకుంటున్నారు.

### ఎల్ఎల్‌బీ

ఐఐటీ ఖరగ్‌పూర్ అందించే ఎల్ఎల్‌బీ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ కోర్సు వ్యవధి మూడేళ్లు. ఈ కోర్సును రెసిడెన్షియల్ విధానంలో నిర్వహిస్తోంది. మొత్తం ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఈ కోర్సులో చేరిన వారికి న్యాయ విద్యతోపాటు సైన్స్, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ అంశాల్లోనూ ప్రావీణ్యం కల్పిస్తారు.

### అర్హత

ప్రథమ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్/మెడిసిన్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా ప్రథమ శ్రేణి మార్కులతో సైన్స్/ఫార్మసీలో పీజీ లేదా ప్రథమ శ్రేణి మార్కులతో ఎంబీఏతో పాటు ఇంజనీరింగ్/మెడిసిన్ యూజీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అర్హులు.

### ఎంపిక విధానం

ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

### పరీక్ష విధానం

ఈ పరీక్ష మొత్తం 200 మార్కులకు ఉంటుంది. ఇంగ్లిష్-60, లాజికల్ రీజనింగ్-20, మ్యాథమెటికల్ ఎబిలిటీ-15, బేసిక్ సైన్స్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్‌సైన్స్)-35, లీగల్ ఆప్టిట్యూడ్ 70 మార్కులకు ఉంటుంది. ప్రశ్న పత్రం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

## ఎల్ఎల్ఎం

ఇందులో కార్పొరేట్ లా, కాంపిటిషన్ లా, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ, కాన్‌స్టిట్యూషనల్ లా, టాక్సేషన్, క్రిమినల్ లా అండ్ జస్టిస్, ఇంటర్నేషనల్ లా వంటి స్పెషలైజేషన్లు ఉన్నాయి.

### అర్హత

మూడేళ్ల లేదా ఐదేళ్ల ఎల్ఎల్‌బీ లేదా బీఎల్‌లో ప్రథమ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది.

### పరీక్ష విధానం

లీగల్ ఆప్టిట్యూడ్ నుంచి 120 మార్కులకు పరీక్షను నిర్వహిస్తారు. ప్రశ్న పత్రం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.

### ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు చివరి తేదీ:** మార్చి 16, 2020
- **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 18, 2020
- **పరీక్ష కేంద్రాలు:** ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, ముంబయి
- **వెబ్‌సైట్:** http://www.iitkgp.ac.in/law, http://www.iitkgp.ac.in/llm

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
24-2-2020



“ నాలుగో రోజు తొలి సెషనే కీలకం. రహానే, హనుమ విహారి ఆ సెషన్ ఆసాంతం ఆడితే మంచి స్కోరుకు అవకాశముంటుంది. ఇప్పుడైతే మేం లక్ష్య నిర్దేశనకు చాలా దూరంలో ఉన్నాం. ఇన్ని పరుగులు చేస్తే కాపాడుకోగలం. ఇంత చేస్తే గెలువగలం అనే స్థితిలో ఎంత మాత్రం లేం. ఎందుకంటే ఈ టెస్టులో ఇంకా ఆరు సెషన్లున్నాయి. ఇప్పటికీ పరుగుల్లో మేం వెనుకబడే ఉన్నాం. ఇప్పుడే నిర్దేశించే లక్ష్యంపై చెప్పడం తొందరపాటే అవుతుంది. మాకు ఎదురయ్యే ప్రతి బంతిని ఎదుర్కోవడమే మా ముందున్న లక్ష్యం. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ రహానే, విహారిల భాగస్వామ్యం నిలబడితేనే ఏదైనా సాధ్యం. కివీస్ బౌలింగ్ బాగుంది. సొంతగడ్డపై కలిసొచ్చే పరిస్థితుల్ని ఆసరా చేసుకొని చక్కగా కట్టడి చేస్తున్నారు. ఈ విషయంలో మేం వెనుకబడ్డాం.

– భారత స్పిన్నర్ అశ్విన్

## సత్యన్-శరత్ జంటకు రజతం

### హంగేరి ఓపెన్ టీటీ టోర్నీ



**బుడాపెస్ట్ (హంగేరి):** అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) హంగేరి ఓపెన్ వరల్డ్ టూర్ టోర్నమెంట్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్–ఆచంట శరత్ కమల్ (భారత్) జంట రజత పతకం సాధించింది. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో సత్యన్–శరత్ కమల్ ద్వయం 5–11, 9–11, 11–8, 9–11తో డుడా బెనెడిక్ట్–ఫ్రాన్సిస్కా ప్యాట్రిక్ (జర్మనీ) జంట చేతిలో ఓడిపోయింది. ఈ టోర్నీలో శరత్‌కిది రెండో పతకం. మిక్స్‌డ్ డబుల్స్‌లో మనిక బాత్రా (భారత్)తో కలిసి శరత్ కాంస్య పతకం సాధించాడు. మరోవైపు స్వీడన్‌లో జరిగిన స్వీడిష్ జూనియర్, క్యాడెట్ ఓపెన్ టీటీ టోర్నీలో చెన్నైకి చెందిన పదేళ్ల అమ్మాయి ఎం.ఆర్.హన్సిని కాంస్యం సాధించింది. మినీ క్యాడెట్ బాలికల సింగిల్స్ సెమీ ఫైనల్లో హన్సిని 12–10, 9–11, 5–11, 8–11తో లులియా పుగోవ్‌కినా (రష్యా) చేతిలో పరాజయం పాలైంది.

## బంగ్లాదేశ్ 240/3

**ఢాకా:** మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ బాధ్యతాయుతంగా ఆడటంతో... జింబాబ్వేతో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో దీటైన జవాబు ఇచ్చింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 71 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ (41; 7 ఫోర్లు) ఆకట్టుకోగా...



మోమినుల్

నజ్ముల్ హుస్సేన్ (71; 7 ఫోర్లు), మోమినుల్ హక్ (79 బ్యాటింగ్; 9 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 228/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 265 పరుగులకు ఆలౌటైంది. బంగ్లాదేశ్ బౌలర్లలో అబు జాయెద్, నయీమ్ హసన్ నాలుగేసి వికెట్లు తీశారు.

# ఇక కష్టమే!



బౌల్ట్

**భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 144/4 • ఇంకా 39 పరుగుల వెనుకంజ • కోలుకోలేని దెబ్బ తీసిన బౌల్ట్ • పట్టుబిగించిన కివీస్**



పృథ్వీ



మయాంక్



పుజారా



కోహ్లి

**వెల్లింగ్టన్:** మన ‘టాప్’ మళ్లీ కూలింది. కివీస్ పేసర్ బౌల్ట్ నిప్పులకు భారత బ్యాటింగ్ చెదిరింది. దీంతో రెండో ఇన్నింగ్స్‌లోనూ యేటికి ఎదురీదలేని పరిస్థితిల్లోకి దిగజారింది. వన్డే సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన న్యూజిలాండ్ అదే జోరుతో టెస్టు సిరీస్‌లోనూ చెలరేగుతోంది. ఇప్పటిదాకా జరిగిన మూడు రోజుల ఆటనూ ఆతిథ్య జట్టే శాసించింది. తొలి టెస్టును గెలిచేందుకు పట్టుబిగిస్తోంది. భారత్ మాత్రం అటు బ్యాటింగ్‌లో... ఇటు బౌలింగ్‌లో ఎప్పటికప్పుడు నీరుగారిపోతోంది. ఇక కష్టం! గెలుపు కాదు... ‘డ్రా’ కూడా కష్టమే!

### టూకీగా చెప్పాలంటే...

మూడో రోజు కూడా భారత్‌కు క్లిష్టంగానే గడిచింది. ఓవర్‌నైట్ స్కోరు 216/5తో ఆదివారం ఆట కొనసాగించిన న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 100.2 ఓవర్లలో 348 పరుగులు చేసి ఆలౌటైంది. మిగిలిన ఐదు వికెట్లతోనే భారత్ తొలి ఇన్నింగ్స్ (165 పరుగులు)లో చేసిన స్కోరు కంటే ఎక్కువే (183 పరుగులు) చేసింది. తర్వాత భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. ఇంకా 39 పరుగులు వెనుకబడే ఉన్న భారత్ ప్రధాన వికెట్లను కోల్పోయింది. కోహ్లి (19), పుజారా (11), పృథ్వీ షా (14)లను బౌల్ట్ అవుట్ చేశాడు. మయాంక్ అగర్వాల్ అర్ధ సెంచరీతో రాణించాడు.

### టెయిలెండర్ల పోరాటం...

ఆట మొదలైన బంతికే న్యూజిలాండ్ ఆరో వికెట్ కోల్పోయింది. వాట్లింగ్ (14)ను బుమ్రా అవుట్ చేశాడు. మరో 9 పరుగుల తర్వాత సౌతీ (6) వికెట్‌ను ఇషాంత్ శర్మ పడేశాడు. కివీస్ స్కోరు 225/7. ఇక భారత్ పేస్ అలజడి మొదలైందని అనుకున్నారంతా! టెయిలెండర్లను అవుట్ చేయడం ఎంతసేపు... 250, 260 స్కోరుతో కివీస్ కథ ముగుస్తుందనిపించింది. కానీ అసలు కథ అప్పుడే మొదలైంది. మరో వికెట్ తీసేందుకు సుదీర్ఘ పోరాటం తప్పలేదు. గ్రాండ్‌హోమ్ (74 బంతుల్లో 43; 5 ఫోర్లు)తో జతకలిసిన తొమ్మిదో వరుస బ్యాట్స్‌మన్ జేమీసన్ (45 బంతుల్లో 44; 1 ఫోర్, 4 సిక్స్‌లు) చకచకా పరుగులు బాదేశాడు. వన్డేను తలపించేలా జేమీసన్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. షమీ బౌలింగ్‌లో 2, అశ్విన్ ఒకే ఓవర్లో మరో రెండు సిక్సర్లు దంచేశాడు. చూస్తుండగానే స్కోరు దూసుకెళ్లింది. ఎట్టకేలకు 300 స్కోరుకు ముందు జేమీసన్‌ను, 300 అయ్యాక గ్రాండ్‌హోమ్‌ను అశ్వినే పెవిలియన్ చేర్చాడు. 9 వికెట్లు పడ్డా కూడా ఆలౌట్ అయ్యేందుకు మరో 38 పరుగులు ఆగాల్సి వచ్చింది. 11వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన బౌల్ట్ (24 బంతుల్లో 38; 5 ఫోర్లు, 1 సిక్స్) బౌండరీలతో హోరెత్తించాడు. చివరకు ఇషాంత్ అతన్ని అవుట్ చేయడంతో కివీస్ తొలి ఇన్నింగ్స్ 348 పరుగుల వద్ద ముగిసింది. ఇషాంత్‌కు 5, అశ్విన్‌కు 3 వికెట్లు దక్కాయి.

*వెల్లింగ్టన్ టెస్టులో భారత్ ప్రదర్శన వెలవెలబోతోంది. చూస్తుంటే ‘వన్డే’ పరిస్థితే ప్రతి రోజూ కనిపిస్తోంది. ఏ రోజుకు ఆ రోజు టీమిండియా తడబడుతూనే ఉంది. గత మూడు రోజుల్లో రెండు సార్లు బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇంకా ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరునే చేరలేకపోయింది. కానీ రెండో ఇన్నింగ్స్‌లో అప్పుడే నాలుగు టాపార్డర్ వికెట్లను కోల్పోయి కష్టాల మీద కష్టాలు తెచ్చిపెట్టుకుంది. ఇప్పుడైతే ఈ మ్యాచ్‌ను గెలుచుకోవడం పక్కనబెట్టి ‘డ్రా’తో కాపాడుకోలేని స్థితికి దిగజారింది.*

### మయాంక్ ఒక్కడే...

లంచ్ తర్వాత 183 పరుగుల లోటుతో భారత్ రెండో ఇన్నింగ్స్ కష్టాలతో మొదలైంది. 8వ ఓవర్లో పృథ్వీ షా (14)ను బౌల్ట్ పెవిలియన్ చేర్చాడు. దీంతో మయాంక్ అగర్వాల్‌కు పుజారా జతయ్యాడు. ఇద్దరు ఆచితూచి ఆడుతూ వికెట్లు కాపాడుకునేందుకు ప్రాధాన్యమిచ్చారు. కొంతవరకు ఇది ఫలించినా... రెండో వికెట్‌కు 51 పరుగులు జోడించాక జిడ్డుగా ఆడుతున్న పుజారాను బౌల్టే క్లీన్ బౌల్డ్ చేశాడు. 78 పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోగా... ఓపెనర్‌కు కెప్టెన్ కోహ్లి అండగా నిలిచాడు. చక్కగా ఆడుతున్న మయాంక్ 75 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ జట్టు స్కోరు వంద పరుగులకు ముందే అతని వికెట్ కూడా పడిపోవడం భారత్ కష్టాల్ని ఒక్కసారిగా పెంచింది. ఆఖరి సెషన్ మొదలైన కాసేపటికి సౌతీ బౌలింగ్‌లో మయాంక్ వెనుదిరిగాడు. 96 పరుగులకే భారత్ మూడు కీలక వికెట్లను కోల్పోయింది. ఇది చాలదన్నట్లు బౌల్ట్... కోహ్లి (19; 3 ఫోర్లు) వికెట్ పడగొట్టి భారత్‌ను చావుదెబ్బ తీశాడు. దీంతో ఈ సెషన్లో మరో వికెట్ పడకుండా రహానే (67 బంతుల్లో 25 బ్యాటింగ్; 4 ఫోర్లు), హనుమ విహారి (70 బంతుల్లో 15 బ్యాటింగ్; 2 ఫోర్లు) జాగ్రత్తగా ఆడారు. అబేధ్యమైన ఐదో వికెట్‌కు వీరిద్దరు 31 పరుగులు జోడించారు.

### స్కోరు వివరాలు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 165; **న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్:** లాథమ్ (సి) పంత్ (బి) ఇషాంత్ 11; బ్లన్‌డేల్ (బి) ఇషాంత్ 30; విలియమ్సన్ (సి) సబ్–జడేజా (బి) షమీ 89; రాస్ టేలర్ (సి) పుజారా (బి) ఇషాంత్ 44; నికోల్స్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 17; వాట్లింగ్ (సి) పంత్ (బి) బుమ్రా 14; గ్రాండ్‌హోమ్ (సి) పంత్ (బి) అశ్విన్ 43; సౌతీ (సి) షమీ (బి) ఇషాంత్ 6; జేమీసన్ (సి) విహారి (బి) అశ్విన్ 44; ఎజాజ్ పటేల్ (నాటౌట్) 4; బౌల్ట్ (సి) పంత్ (బి) ఇషాంత్ 38; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (100.2 ఓవర్లలో ఆలౌట్) 348.**

**వికెట్ల పతనం:** 1–26, 2–73, 3–166, 4–185, 5–207, 6–216, 7–225, 8–296, 9–310, 10–348.

**బౌలింగ్:** బుమ్రా 26–5–88–1, ఇషాంత్ శర్మ 22.2–6–68–5, షమీ 23–2–91–1, అశ్విన్ 29–1–99–3.

**భారత్ రెండో ఇన్నింగ్స్:** పృథ్వీ షా (సి) లాథమ్ (బి) బౌల్ట్ 14; మయాంక్ (సి) వాట్లింగ్ (బి) సౌతీ 58; పుజారా (బి) బౌల్ట్ 11; కోహ్లి (సి) వాట్లింగ్ (బి) బౌల్ట్ 19; రహానే (బ్యాటింగ్) 25; విహారి (బ్యాటింగ్) 15; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (65 ఓవర్లలో 4 వికెట్లకు) 144.**

**వికెట్ల పతనం:** 1–27, 2–78, 3–96, 4–113.

**బౌలింగ్:** సౌతీ 15–5–41–1, బౌల్ట్ 16–6–27–3, గ్రాండ్‌హోమ్ 14–5–25–0, జేమీసన్ 17–7–33–0, ఎజాజ్ పటేల్ 3–0–18–0.

## మరో విజయమే లక్ష్యంగా...

*ప్రపంచ కప్ వేటలో భారత మహిళల జట్టు మరో మ్యాచ్‌కు సిద్ధమైంది. ఆరంభ పోరులో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాను బోల్తా కొట్టించిన భారత్... నేడు బంగ్లాదేశ్‌తో తలపడనుంది. రెండు జట్ల బలాబలాలు పరిశీలిస్తే మనదే పైచేయిగా కనిపిస్తున్నా... ఆదమరిస్తే మాత్రం 2018 ఆసియా కప్ ఫైనల్ పునరావృతం అయ్యే అవకాశం ఉంది. బౌలింగ్‌లో భారత్ బలంగా కనిపిస్తున్నా బ్యాటింగ్‌లో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించడంలేదు. ముఖ్యంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఫామ్ కలవరపెడుతోంది. వీటిని అధిగమించి నేటి మ్యాచ్‌లో భారత్ విజయం సాధిస్తే తర్వాత జరిగే కీలకమైన మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవచ్చు.*



- మహిళల టి20 ప్రపంచ కప్‌లో నేడు బంగ్లాదేశ్‌తో భారత్ ‘ఢీ’
- సాయంత్రం గం 4.30 నుంచి స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం

**9** ఇప్పటి వరకు భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య 11 టి20లు జరిగాయి. భారత్ తొమ్మిది మ్యాచ్‌ల్లో గెలిచింది. రెండింటిలో బంగ్లాదేశ్ నెగ్గింది.

**పెర్త్:** పూనమ్ యాదవ్ మ్యాజిక్ స్పెల్‌తో టి20 ప్రపంచ కప్ వేటను ఘనంగా ఆరంభించిన భారత మహిళల జట్టు నేడు ఆసియా కప్ చాంపియన్ బంగ్లాదేశ్‌ను ఎదుర్కోనుంది. ఈ మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా బరిలో దిగనున్న హర్మన్ సేన నాకౌట్‌కు మరింత చేరువ అవ్వడంతోపాటు గత ఆసియా కప్ ఫైనల్లో బంగ్లాదేశ్ చేతిలో ఎదురైన మూడు వికెట్ల పరాభవానికి బదులు తీర్చుకోవాలని పట్టుదలతో ఉంది. మరోవైపు సల్మా ఖాతూన్ సారథ్యంలోని బంగ్లాదేశ్ సంచలనాన్ని ఆశిస్తోంది. ఈ ఫార్మాట్‌లో భారత్‌పై ఆడిన చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ బంగ్లాదేశ్ గెలవడం వారికి కలిసొచ్చే అంశం. నేడు జరిగే మరో మ్యాచ్‌లో శ్రీలంకతో ఆస్ట్రేలియా తలపడుతుంది.

**హర్మన్‌పైనే దృష్టి...**

స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్ ప్రీత్, దీప్తి శర్మలతో భారత బ్యాటింగ్ పటిష్టంగా కనిపిస్తున్నా... గత కొంతకాలంగా స్మృతి మాత్రమే నిలకడ చూపుతోంది. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో షఫాలీ 15 బంతుల్లో 29 పరుగులు సాధించినా... తనకు లభించిన ఆరంభాన్ని భారీ స్కోరుగా మలచలేకపోయింది. జెమీమా రోడ్రిగ్స్ కెరీర్ ఆరంభంలో ఆడినంత దూకుడును ప్రస్తుతం ప్రదర్శించలేకపోతుంది. ముఖ్యంగా ఫినిషర్‌గా పేరున్న హర్మన్‌ప్రీత్ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడం లేదు. తన చివరి ఐదు ఇన్నింగ్స్‌లలో 75 స్ట్రయిక్ రేట్‌తో 78 పరుగులు మాత్రమే చేసింది. దాంతో భారత్‌కు మంచి ఆరంభం లభిస్తున్నా... డెత్ ఓవర్లలో ధనాధన్ ఫినిష్ లభించడంలేదు. దీప్తి శర్మ నిలకడ ప్రదర్శిస్తున్నా వికెట్ల మధ్య పరుగెత్తడంలో మరింత చురుకుగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలోనే బౌన్సీ వికెట్‌గా పిలువబడే ‘వాకా’ మైదానంలో ఈ మ్యాచ్ జరుగుతుండటంతో పేసర్ శిఖా పాండే మరోసారి కీలకం కానుంది. ఈమెతో పాటు పూనమ్ యాదవ్ మరోసారి చెలరేగితే భారత్‌కు విజయం అంత కష్టమేమీ కాదు. మరోవైపు సల్మా ఖాతూన్, ఫర్జానా హక్, జహనర ఆలమ్‌లతో కూడిన బంగ్లాదేశ్‌ను తక్కువ అంచనా వేయలేం. భారత్‌పై గెలిచి టోర్నీలో బోణీ కొట్టాలనే ఉద్దేశంతో బంగ్లా బరిలో దిగనుంది.

## రెండో టి20లో దక్షిణాఫ్రికా గెలుపు



డికాక్

**పోర్ట్ ఎలిజబెత్ (దక్షిణాఫ్రికా):** తొలి టి20లో 107 పరుగుల తేడాతో ఎదురైన దారుణ పరాభవం నుంచి తేరుకొన్న ఆతిథ్య దక్షిణాఫ్రికా... ఆస్ట్రేలియాతో ఆదివారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో 12 పరుగుల తేడాతో గెలిచింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. తొలుత దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్లకు 158 పరుగులు చేసింది. కెప్టెన్ క్వింటన్ డికాక్ (47 బంతుల్లో 70; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిశాడు. అనంతరం ఛేదనలో ఆసీస్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేసి ఓడింది. వార్నర్ (56 బంతుల్లో 67 నాటౌట్; 5 ఫోర్లు, సిక్స్) చివరి వరకు నిలిచినా జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. ఇన్‌గిడి మూడు వికెట్లు తీశాడు. మూడో టి20 ఈ నెల 26న జరుగుతుంది.

## భారీ ఆధిక్యంలో సౌరాష్ట్ర



ప్రేరక్


**సాక్షి, ఒంగోలు:** పేలవ బ్యాటింగ్‌తో ఇప్పటికే సెమీస్ ఆశలను దూరం చేసుకున్న ఆంధ్ర జట్టుకు భారీ లక్ష్యం ఎదురయ్యేలా ఉంది. ఇక్కడి సీఎస్‌ఆర్ శర్మ కాలేజి మైదానంలో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సౌరాష్ట్ర 658 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 93/2తో ఆట కొనసాగించిన సౌరాష్ట్ర నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి తమ రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 375 పరుగులు చేసింది. ప్రేరక్ మన్కడ్ (85; 12 ఫోర్లు), ధర్మేంద్ర జడేజా (60; ఫోర్), అవి బరోట్ (54; 7 ఫోర్లు) అర్ధ శతకాలతో రాణించారు. ఆంధ్ర బౌలర్లలో సాయికృష్ణ నాలుగు, రఫీ మూడు వికెట్లు సాధించారు. నేడు ఆటకు చివరి రోజు. మరోవైపు గోవాతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్ 464 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి సెమీఫైనల్ చేరింది.

## సుశీల్ ఆశలకు జితేందర్ దెబ్బ

- ఆసియా రెజ్లింగ్ పోటీల్లో 74 కేజీల విభాగంలో రజతం
- ట్రయల్స్ లేకుండానే ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి ఎంపిక



జితేందర్



సుశీల్

**న్యూఢిల్లీ:** టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనాలని ఆశిస్తోన్న భారత రెజ్లింగ్ దిగ్గజం సుశీల్ కుమార్ ఆశలకు జితేందర్ దెబ్బ కొట్టాడు. ఆదివారం ముగిసిన ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో జితేందర్ 74 కేజీల విభాగంలో రజత పతకం సాధించాడు. తద్వారా మార్చి 27 నుంచి 29 వరకు కిర్గిస్తాన్‌లో జరిగే ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. సుశీల్ కూడా 74 కేజీల విభాగంలోనే పోటీపడతాడు. ఆసియా చాంపియన్‌షిప్ కోసం నిర్వహించిన ట్రయల్స్‌కు సుశీల్ డుమ్మా కొట్టాడు. గాయం కారణంగా తాను ట్రయల్స్‌కు హాజరుకాలేనని... ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ కోసం 74 కేజీల విభాగంలో మళ్లీ ట్రయల్స్ నిర్వహించాలని భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ)ను కోరాడు. అయితే సుశీల్ అభ్యర్థనను డబ్ల్యూఎఫ్‌ఐ పట్టించుకోలేదు. ఒకవేళ ఆసియా చాంపియన్‌షిప్‌లో జితేందర్ విఫలమైతేనే ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి మళ్లీ ట్రయల్స్ నిర్వహిస్తామని స్పష్టం చేసింది. అయితే జితేందర్ రజత పతకం గెలవడంతో ఎలాంటి ట్రయల్స్ లేకుండానే అతను ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడని డబ్ల్యూఎఫ్‌ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఆదివారం ప్రకటించారు. ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో జితేందర్ ఫైనల్ చేరుకుంటే అతనికి ‘టోక్యో’ బెర్త్ లభిస్తుంది. సుశీల్‌కు అధికారికంగా ‘టోక్యో’ దారులు కూడా మూసుకుపోతాయి. ఒకవేళ జితేందర్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఫైనల్‌కు చేరుకోకపోతే ఏప్రిల్ 30 నుంచి మే 3 వరకు బల్గేరియాలో జరిగే వరల్డ్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్ రూపంలో సుశీల్, జితేందర్‌లకు చివరి అవకాశం లభిస్తుంది.



దీపక్



రాహుల్

ఆదివారం జరిగిన 74 కేజీల విభాగం ఫైనల్లో జితేందర్ 1–3తో డిఫెండింగ్ చాంపియన్ దనియర్ కైసనోవ్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. 86 కేజీల విభాగంలో దీపక్ పూనియా, 61 కేజీల విభాగంలో రాహుల్ అవారె కాంస్య పతకాలు నెగ్గారు. కాంస్య పతక బౌట్‌లలో దీపక్ పూనియా 10–0తో అబ్దుల్ సలామ్ (ఇరాక్)పై, రాహుల్ 5–2తో మాజిద్ దస్తాన్ (ఇరాన్)పై గెలిచారు. సతీందర్ (125 కేజీలు), సోమ్‌వీర్ (92 కేజీలు) విఫలమయ్యారు. ఓవరాల్‌గా భారత్ ఆసియా చాంపియన్‌షిప్‌లో 5 స్వర్ణాలు, 6 రజతాలు, 9 కాంస్య పతకాలు సాధించింది.

## సఫారీ అమ్మాయిల చరిత్ర

### టి20 ప్రపంచకప్‌లో తొలిసారి ఇంగ్లండ్‌పై గెలుపు



**పెర్త్:** టి20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా మహిళలు చరిత్రకెక్కే విజయాన్ని సాధించారు. తొలిసారి ఇంగ్లండ్‌లాంటి మేటి జట్టుపై గెలుపొందారు. మహిళల టి20 మెగా ఈవెంట్‌లో సఫారీ జట్టు తమ తొలి మ్యాచ్‌లోనే బోణీ కొట్టింది. ఆదివారం ఉత్కంఠ రేపిన ఈ పోరులో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై గెలుపొందింది. మొదట ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 123 పరుగులు చేసింది. సీవర్ (41 బంతుల్లో 50; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీ సాధించింది. ఓపెనర్ జోన్స్ (20 బంతుల్లో 23; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడింది. సఫారీ బౌలర్లు అయబొంగ (3/25), వాన్ నికెర్క్ (2/20), మరిజనె (2/19) సమష్టిగా దెబ్బతీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 19.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్, కెప్టెన్ వాన్ నికెర్క్ (51 బంతుల్లో 46; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మరిజనె (33 బంతుల్లో 38; 6 ఫోర్లు) రాణించారు. ఇంగ్లిష్ బౌలర్ ఎకిల్‌స్టోన్ 2 వికెట్లు తీసింది. ఆఖరి ఓవర్లో 6 బంతుల్లో 9 పరుగులు చేయాల్సి ఉండగా... బ్రంట్ వేసిన ఆ ఓవర్‌లోని 3, 4 బంతుల్ని డు ప్రీజ్ వరుసగా 6, 4 బాదడంతో 2 బంతులు మిగిలుండగానే దక్షిణాఫ్రికా విజయం సాధించింది.

epaper.sakshi.com

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
24-2-2020

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు** (గురువారం ముగింపు)

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 153 ▼ | 45 ▼ |
| 41,170 | 12,081 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (శుక్రవారం ముగింపు)

| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 9,577 | ▼ 174 |
| డోజోన్స్ | 28,992 | ▼ 228 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,404 | ▼ 33 |
| డాక్స్ | 13,579 | ▼ 85 |
| షాంఘై | 3,040 | ▲ 10 |
| నికాయ్ | 23,387 | ▼ 92 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | 71.00 | 72.65 |
| £ | బ్రిటన్ పౌండ్ | 91.06 | 94.30 |
| € | యూరో | 76.11 | 79.01 |
| ¥ | జపాన్ ఎన్ (100) | 63.30 | 65.66 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | 46.61 | 48.78 |
| S$ | సింగపూర్ డాలర్ | 50.34 | 52.08 |
| SAR | సౌదీ రియాల్ | 18.31 | 19.92 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | 19.04 | 20.24 |
| ¥ | చైనా యువాన్ | 9.58 | 10.83 |

# చిన్నారి బీమా... ధీమానిస్తుందా?



- బీమాతో పాటు పెట్టుబడులు
- పాలసీదారు మరణించినా పెట్టుబడుల కొనసాగింపు
- కానీ, వీటిల్లో చార్జీలు ఎక్కువ... రాబడులు చాలా తక్కువ... బీమా కవరేజీ కూడా అంతంతే
- పూర్తి కవరేజీతో టర్మ్ ప్లాన్ తీసుకోవడం మేలైనది

**పిల్లల భవిష్యత్తు కోసం ఇన్వెస్ట్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నవి చైల్డ్ ప్లాన్లు. అయితే, వీటి గురించి పూర్తిగా తెలిసినది అతి తక్కువ మందికే. బీమా ఏజెంట్లు చైల్డ్ ప్లాన్ల గురించి ఆకర్షణీయమైన అంశాలు... ఆకర్షణీయ రాబడుల గణాంకాలను చూపించినప్పుడు ఇన్వెస్ట్ చేయాలన్న ఆసక్తి ఏర్పడవచ్చు. అంతేకాదు, కొందరు వెంటనే ఇన్వెస్ట్‌మెంట్ కూడా ప్రారంభిస్తారు. 'దిగితేకానీ లోతు ఎంతో తెలియదు' అన్న చందంగా ఈ ప్లాన్లను అభివర్ణించాల్సి ఉంటుంది. 'నీ ముక్కు ఏది?' అని ప్రశ్నిస్తే తలచుట్టూ వేలిని తిప్పి చూపించినట్టుగా చైల్డ్ ప్లాన్లను పేర్కొనక తప్పదు.**

### ప్రీమియం భారం...

చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు, ఇన్వెస్ట్‌మెంట్‌తో కలసి ఉంటాయి. వీటిని ఎండోమెంట్ పాలసీలుగానే చూడాల్సి ఉంటుంది. వీటిల్లో పాలసీదారులకు ఎంతొస్తుందన్నది పక్కన పెడితే.. పాలసీ చేయించిన ఏజెంట్‌కు మాత్రం మంచి కమీషన్ ముడుతుంది. ముఖ్యంగా ఈ పాలసీల్లో ఇన్వెస్ట్ చేసే వారిని ప్రధానంగా ఆకర్షించే అంశం ఒకటుంది. పాలసీదారుడు దురదృష్టవశాత్తూ మరణిస్తే.. ఆ తర్వాత కూడా ఈ పాలసీ కొనసాగుతుంది. కాకపోతే ఆ తర్వాత వార్షిక ప్రీమియంలను కట్టే బాధ్యత పాలసీదారుడి కుటుంబంపై పడదు. పాలసీదారుడి తరఫున బీమా కంపెనీయే పాలసీ గడువు తీరే వరకు వార్షిక ప్రీమియంను జమ చేస్తూ మెచ్యూరిటీ తర్వాత అసలు, రాబడులను కలిపి చెల్లిస్తుంది. చూడ్డానికి బాగానే ఉంది కానీ.. ఈ సదుపాయం కోసం పాలసీదారుడు భారీ ప్రీమియంను చెల్లించుకోవాల్సి వస్తుంది. ఒకవేళ పాలసీ గడువు తీరే వరకు పాలసీదారుడు జీవించి ఉంటే చివర్లో వచ్చే రాబడులు చాలా తక్కువ. ద్రవ్యోల్బణం ప్రభావాన్ని పూడ్చుకునేందుకు సరిపోతాయో లేదో కూడా అనుమానమే. పాలసీల్లో చేరాలని కోరే బీమా ఏజెంట్లు ఈ చైల్డ్ ప్లాన్లలో ఉండే వివిధ చార్జీల గురించి వివరంగా చెప్పడం అరుదే.

### ఎండోమెంట్ ప్లాన్

బీమా ఏజెంట్లు మార్కెటింగ్ చేసే చిన్నారి పథకాల్లో ఎక్కువగా ఎండోమెంట్ ప్లాన్లే ఉంటున్నాయి. ఇవి పొదుపు, బీమా కలసిన ప్లాన్లు. బీమా ప్లాన్లు కావడంతో పెట్టుబడులకు సంబంధించిన వివరాల్లో పారదర్శకత చాలా తక్కువ. పెట్టుబడుల వివరాలను కంపెనీలు వెల్లడించవు. సాధారణంగా డెట్ సాధనాల్లోనే బీమా సంస్థలు ఇన్వెస్ట్ చేస్తుంటాయి. డెట్ సాధనాల్లో రాబడులు 7–9 శాతం మించవని తెలిసిందే. బీమా రిస్క్ చార్జీలను కంపెనీలు మినహాయించుకుంటాయి. దీంతో చెల్లించే ప్రీమియం అంతా పెట్టుబడులకు వెళ్లదు. ఫలితంగా దీర్ఘకాలానికి సగటు రాబడులు ఈ ప్లాన్లలో 4–5 శాతం వరకే ఉంటాయి. ఒకవేళ పిల్లల పేరిట పాలసీ తీసుకున్న పేరెంట్ (తల్లి లేదా తండ్రి)... పాలసీ ఆరంభమైన తొలినాళ్లలో మరణిస్తే ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్ (రాబడి రేటు) కొంచెం ఎక్కువగా ఉండొచ్చు. స్థూల రాబడి రేటును 8 శాతం అంచనాగా చూపించినప్పటికీ.. నికర రాబడులు 5 శాతం మించవు. పార్టిసిపేటింగ్ ప్లాన్ల (బీమా లాభాల నుంచి వాటా లభించేవి)లో రాబడి రేటు దీనికి కొంచెం ఎక్కువగా ఉండొచ్చు. ఎందుకంటే ఏటా బోనస్ చెల్లిస్తాయి కనుక. అయితే, ఈ బోనస్‌ను ఏటా ప్రకటించాలన్న గ్యారంటీ ఏమీ ఉండదు. ఒకవేళ పాలసీ తీసుకున్న తర్వాత ఐదేళ్లలోపు తప్పుకుంటే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియం మొత్తంలో చాలా వరకు నష్టపోవాల్సి వస్తుంది. ఎందుకంటే బీమా సంస్థలు వివిధ చార్జీలను మినహాయించుకుని మిగిలినది చెల్లిస్తాయి. కనుక ఈ అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. చిన్నారుల భవిష్యత్తు లక్ష్యాలకు వారు మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లడం దీని కంటే మంచి ఆప్షన్ అవుతుంది. డెట్ సాధనాలతో పోలిస్తే దీర్ఘకాలంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో రాబడులే మెరుగ్గా ఉన్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, చిన్నారుల ఉన్నత విద్య, వివాహం ఇతర లక్ష్యాల కోసం ఉద్దేశించిన పెట్టుబడులు అన్నింటినీ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోనే ఇన్వెస్ట్ చేయకుండా భిన్న సాధనాల మధ్య (పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన) మధ్య వర్గీకరించుకోవడం వైవిధ్యంతో కూడుకున్న ఆప్షన్ అవుతుంది.



### చైల్డ్ యులిప్‌లు

చిన్నారుల పేరుతో ఆఫర్ చేసే యులిప్ ప్లాన్లు కూడా మార్కెట్లో ఉన్నాయి. ఇవి కూడా బీమా, పెట్టుబడులు కలగలసిన సాధనాలు. ఇవి ఈక్విటీ మార్కెట్‌తో ముడిపడిన సాధనాలు. బీమా, ఇతర ఖర్చులు పోను చెల్లించిన ప్రీమియంలో మిగిలిన మొత్తాన్ని ఈక్విటీల్లో బీమా కంపెనీలు ఇన్వెస్ట్ చేసి, వచ్చిన రాబడులను పాలసీదారులకు పంచుతుంటాయి. ఈ ప్లాన్లలో ఈక్విటీ లేదా డెట్.. ఈక్విటీ, డెట్ కలిసిన ఆప్షన్లు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈక్విటీ ఆప్షన్‌తో కూడిన యులిప్ ప్లాన్లలో రాబడులు ఎండోమెంట్ ప్లాన్లతో పోల్చుకుంటే కాస్త నయమే. ఈక్విటీ ఆప్షన్‌తో కూడిన ప్లాన్లలో దీర్ఘకాలంలో సగటున 7–8 శాతం రాబడులను ఆశించొచ్చు. స్థూల, నికర రాబడుల మధ్య వ్యత్యాసం కూడా 2 శాతాన్ని మించి ఉండదు. అయితే, యులిప్ ప్లాన్లలో పెట్టుబడులకు ఐదేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. ఇందులోనూ బీమా రక్షణ ఉంటుంది.

●●●

చిన్నారుల కోసం యులిప్ ప్లాన్లలో ఇన్వెస్ట్ చేయాలన్న ఆసక్తి ఉన్నట్టయితే.. మ్యాక్స్ లైఫ్ శిక్షా ప్లస్ సూపర్ ప్లాన్‌ను పరిశీలించొచ్చు. ఇది నాన్ పార్టిసిపేట్ యులిప్ ప్లాన్. ఇందులో ఆరు రకాల ఫండ్లలో ఒకదాన్ని ఎంచుకునే వెసులుబాటు ఉంది. డైనమిక్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీని ఎంచుకున్నట్టయితే.. పాలసీ ఆరంభంలో ప్రీమియంను ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. పాలసీ కాల వ్యవధి గడుస్తున్న డెట్‌తో కూడిన కన్జర్వేటివ్ ఫండ్‌కు పెట్టుబడులను మళ్లిస్తుంది. అలాగే, హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ యంగ్‌స్టార్ సూపర్ ప్రీమియం కూడా చైల్డ్ యులిప్ ప్లానే. ఇందులోనూ నాలుగు రకాల ఫండ్ ఆప్షన్లు ఉన్నాయి.

### చిన్నారుల పేరిట బీమా..

చిన్నారులకు బీమా రక్షణ కల్పించే ప్లాన్లు కూడా ఉన్నాయి. పిల్లలకు ఏదైనా జరిగితే పరిహారాన్ని తల్లి దండ్రులకు చెల్లించడం జరుగుతుంది. ఎల్ఐసీ న్యూ చిల్డ్రన్ మనీ బ్యాక్ పాలసీ ఇటువంటిదే. బీమా రక్షణ అనేది కుటుంబానికి ఆధారమైన వ్యక్తి కోసం ఉద్దేశించినది. అతనికి ప్రాణాపాయం వాటిల్లితే అతని పిల్లల చదువులకు ఇబ్బంది రాకూడదు. బీమా ఉంటే వచ్చే పరిహారం ఇందుకు ఉపయోగపడుతుంది. పిల్లలు ఎవరిమీద ఆధారపడ్డారో వారికి బీమా ఉండాలి. అంతే కానీ, పిల్లల పేరిట బీమా ఉంటే ఉపయోగం ఏమీ ఉండదు. కనుక పిల్లల పేరిట బీమాతో కూడిన పాలసీలను తీసుకోవడం తెలివైన నిర్ణయం అనిపించుకోదు.

### బీమా తగినంత ఉంటుందా..?

చైల్డ్ ప్లాన్లలో బీమా రక్షణ వార్షిక ప్రీమియానికి 10 రెట్లకు మించదు. పాలసీదారు మరణించే నాటికి వార్షిక ప్రీమియానికి పది రెట్లు లేదా అప్పటి వరకు చెల్లించిన ప్రీమియానికి 105 శాతం.. ఈ రెండింటిలో ఏది ఎక్కువగా ఉంటే ఆ మేరకు బీమా పరిహారం చెల్లించడం జరుగుతుంది. ఈ ప్రకారం చూస్తే ఒకవేళ వార్షికంగా చెల్లించే ప్రీమియం రూ.50,000 ఉందనుకున్నా.. బీమా కవరేజీ రూ.5లక్షలుగానే ఉంటుంది. కానీ, పిల్లల ఉన్నత విద్య, వివాహ అవసరాలకు ఇది ఏ మూలకు సరిపోతుంది..? అందుకే కుటుంబానికి, భవిష్యత్తు లక్ష్యాలకు బీమా రక్షణ కల్పించాలంటే అందుకు ఈ తరహా చైల్డ్ ప్లాన్లు లేదా ఎండోమెంట్ పాలసీలు ఏ విధంగానూ అనుకూలం కావన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.




### చెల్లింపుల్లో సౌలభ్యం..?

ఇక చైల్డ్ ప్లాన్లలో పిల్లల అవసరాలకు అనుగుణంగా చెల్లింపులను ఎంచుకునే సౌలభ్యం తక్కువే. ఉదాహరణకు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ స్మార్ట్ చాంప్ ఇన్సూరెన్స్ లో చెల్లింపులు పిల్లలకు 18 ఏళ్లు వచ్చిన తర్వాత ప్రారంభం అవుతాయి. వార్షికంగా నాలుగు సమాన వాయిదాల్లో చెల్లింపులు జరుగుతాయి. ఒకవేళ 21 ఏళ్ల వయసు వచ్చిన తర్వాత ఏకమొత్తంలో చెల్లింపులు కోరుకుంటే ఆ అవకాశం లేదు. అదే విధంగా బజాజ్ అలియాంజ్ యంగ్ అష్యూర్ ప్లాన్‌లోనూ ఏక మొత్తంలో మెచ్యూరిటీ ప్రయోజనాలను చెల్లించే ఆప్షన్ లేదు. పాలసీ కాల వ్యవధి 10, 15, 20 ఏళ్లుగా ఉండగా, ఈ కాల వ్యవధి ముగిసిన తర్వాత 3/5/7 వాయిదాల్లో బీమా సంస్థ చెల్లింపులు చేస్తుంది. ఇలా కాకుండా మ్యాక్స్ లైఫ్ ఫ్యూచర్ జీనియర్ ఎడ్యుకేషన్ ప్లాన్‌లో అయితే 16, 18, లేదా 21 ఏళ్ల వయసులో మెచ్యూరిటీ చెల్లించే ఆప్షన్ ఎంచుకోవచ్చు.

ఈ ప్లాన్లను తీసుకోవడం వెనుక ప్రధాన ఉద్దేశ్యాన్ని గమనించినట్టయితే.. తమకు ఏదైనా జరగరానిది జరిగితే తమ పిల్లల విద్య, ఇతర కుటుంబ లక్ష్యాలకు విఘాతం కలగకుండా ఉండాలని ఎక్కువ మంది కోరుకుంటుంటారు. కానీ, ఇందుకు టర్మ్ లైఫ్ ప్లాన్ చక్కగా సరిపోతుంది. ఎక్కువ చార్జీలను పిండుకునే ఈ తరహా చైల్డ్‌ప్లాన్లు లేదా ఎండోమెంట్ పాలసీలు, యులిప్‌లకు బదులు టర్మ్ పాలసీ తీసుకోవడం ఉత్తమం. టర్మ్ పాలసీల్లో మెచ్యూరిటీ అనంతరం ఎటువంటి ప్రయోజనాలు ఉండవు. అందుకే తక్కువ ప్రీమియానికి ఎక్కువ కవరేజీ లభిస్తుంది. దీంతో కుటుంబం కోసం ఎక్కువ కవరేజీతో కూడిన ప్లాన్ తీసుకోవచ్చు. ఉదాహరణకు పిల్లల ఉన్నత విద్య, కుటుంబ పోషణ, ఇతర లక్ష్యాలకు రూ.కోటి కవరేజీతో టర్మ్ ప్లాన్ తీసుకోవాలనుకుంటే.. ప్రీమియం 30 ఏళ్ల వయసున్న ఆరోగ్యవంతుడైన వ్యక్తికి రూ.10,000గానే ఉంటుంది. కనుక ఇటువంటి గందరగోళాలకు తావివ్వని, సులభమైన, సూటి అయిన టర్మ్ ప్లాన్ మేలైనది. భవిష్యత్తు లక్ష్యాల కోసం పెట్టుబడులు పెట్టుకోవాలని భావిస్తే అందుకు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్, పీపీఎఫ్ వంటి పథకాలను ఎంచుకోవచ్చు.

# ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్, ఎఫ్‌డీ.. వీటిల్లో మీ చాయిస్?





అశోక్‌కుమార్ ఈఆర్
సీఈవో, స్క్రిప్‌బాక్స్

పన్ను ఆదా చేసుకునేందుకు మరో నెలరోజులే వ్యవధి మిగిలి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. పన్ను ఆదా కోసం బీమా వైపు చూడకుండా.. ఇతర పెట్టుబడి విధానాలను పరిశీలించినట్టయితే... ఈక్విటీలతో కూడిన ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్, బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఎక్కువగా ప్రాచుర్యంలో ఉన్నవి. అవగాహన విస్తృతం కావడంతో పన్ను ఆదా చేసే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ ఫండ్స్ (ఈఎల్ఎస్ఎస్) గత కొన్ని సంవత్సరాలుగా ఎక్కువ మందిని ఆకర్షిస్తున్నాయి. ఇవి ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసేవి కావడంతో దీర్ఘకాలంలో సంపద వృద్ధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈక్విటీలు కావడం వల్ల మార్కెట్ ఆధారిత అస్థిరతలు ఉంటుంటాయి. కానీ, స్థిరాదాయ సాధనమైన ఎఫ్‌డీ తదితర వాటితో పోలిస్తే దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణాన్ని మించి రాబడులను ఇస్తాయి.

**ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్‌లో ప్రయోజనాలు**

- ఇతర పన్ను ఆదా సాధనాల్లో కాకుండా ఈఎల్ఎస్ఎస్‌లో లాకిన్ పీరియడ్ తక్కువగా మూడేళ్లు మాత్రమే. ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి కనుక పెట్టుబడులు అధికంగా వృద్ధి చెందే అవకాశాలు ఉంటాయి. చారిత్రకంగా చూస్తే ఈక్విటీలు వార్షికంగా 12–14 శాతం మధ్య రాబడులను ఇచ్చాయి. కానీ, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో రాబడులు 6.5 శాతమే. పన్ను ఆదా ఫిక్స్‌డ్ డిపాజిట్ లాకిన్ పీరియడ్ ఐదేళ్లు, పీపీఎఫ్‌లో లాకిన్ పీరియడ్ 15 ఏళ్లు. ఇందులో రాబడులు సుమారు 8 శాతం. పీపీఎఫ్ రేటు ఎప్పటికప్పుడు సవరణకు గురవుతుంది.
- దీర్ఘకాలంలో ఈక్విటీల్లో రిస్క్ యావరేజ్ అవుతుంది. దాంతో రిస్క్‌ను అధిగమించి మెరుగైన రాబడులు పొందే అవకాశం ఉంటుంది.
- ఇక పన్ను ఆదా కోసం ఒకే సారి ఇన్వెస్ట్ చేసే ఇబ్బంది కూడా లేకుండా, సిప్ రూపంలో కొన్ని నెలల పాటు లేదా ప్రతీ నెలా ఇన్వెస్ట్ చేసుకునేందుకు ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో వీలుంటుంది. పెట్టుబడులను ఏప్రిల్‌లో ప్రారంభించడం మంచిది. కనీసం డిసెంబర్‌లో ఆరంభించినా నాలుగు నెలల సమయం ఉంటుంది. నాలుగు సమాన వాయిదాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.
- ఈఎల్ఎస్ఎస్‌లో రూ.4.8 లక్షల పెట్టుబడి ఐదేళ్లలో 12 శాతం రాబడుల అంచనా ఆధారంగా రూ.8.28 లక్షలు అవుతుంది. అదే ఐదేళ్ల బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో రూ.4.8 లక్షల పెట్టుబడి 7 శాతం రాబడుల అంచనా ఆధారంగా రూ.7.12 లక్షలు అవుతుంది. రాబడుల వ్యత్యాసం రూ.లక్షకుపైనే ఉంది.

## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (ఫిబ్రవరి-18-2020 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు– ఏడాది | 1–2 ఏళ్లు | 3–5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 5.75 | 6 | 6.1 |
| యాక్సిస్ బ్యాంక్ | 6.4 | 6.5 | 6.5 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 5.5 | 6 | 6.25 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.3 | 6.25 |
| కెనరా బ్యాంక్ | 5.9 | 6.3 | 6.25 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.2 | 6.2 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 5.9 | 6.25 | 6.25 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 6.05 | 6.3 | 6.3 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6 | 6.3 | 6.4 |
| కరూర్ వైశ్యా బ్యాంక్ | 5.9 | 6.3 | 6.3 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 6.25 | 6.75 | 6.75 |
| హెచ్ఎస్‌బీసీ | 5 | 5.75 | 6 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 5.8 | 6.25 | 6.25 |
| కర్ణాటక బ్యాంక్ | 6.25 | 6.5 | 6.4 |
| ఎస్‌బీఐ | 5.5 | 6 | 6 |
| సిండికేట్ బ్యాంక్ | 5.75 | 6.25 | 6.25 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.5 | 7.25 |

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

# స్థిరమైన రాబడులు ఆశిస్తుంటే..

### కోటక్ స్టాండర్డ్ మల్టీక్యాప్ ఫండ్




రెండేళ్లుగా స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులతో కొనసాగుతుండడాన్ని చూస్తున్నాం. కొన్ని రోజులు ర్యాలీ చేయడం, కొన్ని రోజులు నష్టాల పాలు కావడం సాధారణంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో ఇటువంటి పరిస్థితులను సమర్థంగా నెగ్గుకొచ్చే మ్యూచువల్ ఫండ్స్ పథకాలు ఇన్వెస్టర్లకు దీర్ఘకాలంలో మెరుగైన రాబడులను ఇవ్వగలుగుతాయి. ముఖ్యంగా గత రెండేళ్లుగా లార్జ్‌క్యాప్‌లో నాణ్యమైన స్టాక్స్ అద్భుత రాబడులను ఇచ్చాయి. స్మాల్, మిడ్‌క్యాప్ నేలచూపులు చూశాయి. లార్జ్‌క్యాప్‌తో పోలిస్తే మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ చాలా ఆకర్షణీయమైన, చౌక వ్యాల్యూషన్లకు దిగివచ్చాయి. దీంతో 2020లో మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్‌లో నాణ్యమైన స్టాక్స్ (మంచి వ్యాపార మూలాలు, ఉత్తమ యాజమాన్యం) మంచి రాబడులను ఇచ్చే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ ఇంకా గాడిన పడలేదు కనుక ఇప్పటికీ లార్జ్‌క్యాప్ సురక్షితమైనవిగా కొందరు నిపుణులు చెబుతున్నారు. కనుక అన్ని రకాల పరిస్థితుల్లోనూ.. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ విభాగంలోని లాభదాయక అవకాశాల్లో పెట్టుబడులకు అవకాశం కల్పించేవి మల్టీక్యాప్ ఫండ్స్. ఈ విభాగంలో కోటక్ స్టాండర్డ్ మల్టీక్యాప్ ఫండ్ కూడా ఒకటి. 2008–09 మార్కెట్ పతనం తర్వాత ఈ మ్యూచువల్ ఫండ్ పథకం ప్రారంభమైంది. 2011, 2013, 2015, 2016 సంవత్సరాల్లో వచ్చిన మార్కెట్ కరెక్షన్లలో ఈ పథకం నష్టాలను తక్కువకు పరిమితం చేసి చూపించింది.

**పెట్టుబడి విధానాలు...**




మార్కెట్ కరెక్షన్లలో, ఒడిదుడుకుల సమయాల్లో నగదు నిల్వలు పెంచుకోవడం లేదా డెట్ విభాగంలో పెట్టుబడులను అధికం చేయడం వంటి విధానాలతో నష్టాలను తగ్గించడంపై ఈ ఫండ్ మేనేజర్లు దృష్టి సారిస్తుంటారు. అదే సమయంలో అస్థిరతలు తక్కువగా ఉండే రంగాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. ఉదాహరణకు 2011 కరెక్షన్ సమయంలో ఈ పథకం నిర్వహణలోని మొత్తం పెట్టుబడుల్లో 8–12 శాతం నగదు, డెట్ రూపంలోనే ఉన్నాయి. ఆ సమయంలో ఫార్మా, నాన్ డ్యూరబుల్స్‌కు ప్రాధాన్యం ఇచ్చింది. దీంతో ప్రధాన సూచీలతో పోలిస్తే కేవలం 4 శాతం నష్టాలకే పరిమితం అయింది. లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో ఎక్కువగా పెట్టుబడులు పెట్టడం ఈ పథకం పనితీరులో భాగం. ప్రస్తుతానికి మెగా, లార్జ్ క్యాప్ స్టాక్స్‌లో 74 శాతం పెట్టుబడులు ఉన్నాయి. 2013, 2015, 2016 కరెక్షన్లలో మిడ్, స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడులను తగ్గించుకోవడం ద్వారా నష్టాలను పరిమితం చేసింది. ప్రస్తుతం మిడ్‌క్యాప్‌లో 25%, స్మాల్‌క్యాప్‌లో ఒక శాతం పెట్టుబడులు కలిగి ఉంది.


### టాప్ హోల్డింగ్స్

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| ఐసీఐసీఐ బ్యాంకు | 7.06 |
| ఆర్ఐఎల్ | 6.24 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు | 5.87 |
| ఎల్అండ్‌టీ | 5.11 |
| యాక్సిస్ బ్యాంకు | 4.78 |
| ఇన్ఫోసిస్ | 3.49 |
| అల్ట్రాటెక్ సిమెంట్ | 3.35 |
| టీసీఎస్ | 2.99 |
| పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ | 2.63 |
| ఇంద్రప్రస్థ గ్యాస్ | 2.52 |

**రాబడులు...**

ఈ తరహా విధానాల కారణంగా బుల్ ర్యాలీల్లో పనితీరు అద్భుతంగా లేకపోయినప్పటికీ మెరుగైన రాబడులను ఇస్తోంది. ఏడాది కాలంలో ఈ పథకం 19 శాతం రాబడులను ఇవ్వగా, ఇదే కాలంలో బీఎస్ఈ 500 సూచీ పెరుగుదల 14 శాతంగానే ఉంది. మూడేళ్ల కాలంలో ఈ పథకం రాబడులు వార్షికంగా 12 శాతం, ఐదేళ్ల కాలంలో వార్షికంగా 10 శాతం, ఏడేళ్ల కాలంలో 16.68 శాతం, పదేళ్ల కాలంలో 14.31 శాతం వార్షిక రాబడులను ఇచ్చింది. బెంచ్‌మార్క్ బీఎస్ఈ 500 సూచీతో పోల్చి చూస్తే అన్ని కాలాల్లోనూ ఈ పథకంలో రాబడులు 4 శాతం వరకు అధికంగా ఉండడం గమనార్హం.

epaper.sakshi.com



వ్యాపార అవకాశాలు బస్సుల్లాంటివి... ఒకదాని తర్వాత ఒకటి వస్తూనే ఉంటాయి!

- రిచర్డ్ బ్రాన్సన్, బ్రిటిష్ వ్యాపారవేత్త

## బొమ్మ-బొరుసు



# అస్థిరతలు కొనసాగొచ్చు..

- ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ
- ట్రంప్ పర్యటనల ప్రభావం
- కోవిడ్–19 ఎఫెక్ట్
- ఈ వారం మార్కెట్‌పై అంచనాలు

**న్యూఢిల్లీ:** డెరివేటివ్స్ (ఎఫ్అండ్ఓ) ఫిబ్రవరి సిరీస్ ఈ వారంలోనే ముగియనుండడంతో మార్కెట్లో అస్థిరతలు ఉంటాయని విశ్లేషకుల అంచనా. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 24, 25వ తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రక్షణ రంగానికి సంబంధించి ఒప్పందాలకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ సమయంలో కుదిరే డీల్స్ కూడా మార్కెట్‌పై ప్రభావం చూపించనున్నాయి. శుక్రవారం విడుదల అయ్యే జీడీపీ అంచనాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గణాంకాలపైనా ఇన్వెస్టర్లు దృష్టి సారించొచ్చు. ''ఎఫ్అండ్ఓ గురువారం ముగియనుండడం వల్ల సమీప కాలంలో ఒడిదుడుకులు పెరిగే అవకాశం ఉంటుంది. డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనలో కుదిరే వ్యాపార, వాణిజ్య ఒప్పంద వార్తలు కూడా ప్రభావం చూపిస్తాయి'' అని బీఎన్‌పీ పారిబాస్ క్యాపిటల్ మార్కెట్ స్ట్రాటజీ హెడ్ గౌరవ్‌దువా తెలిపారు. మెటల్స్, అంతర్జాతీయంగా కమోడిటీలు పేలవ ప్రదర్శన చూపించొచ్చన్నారు. దేశీయ ఇన్‌స్టిట్యూషన్ల నుంచి కొనుగోళ్ల మద్దతుతో ప్రధాన సూచీలతో పోలిస్తే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ మంచి పనితీరు చూపించే అవకాశం ఉందని విశ్లేషకుల అంచనా. చైనాలో కోవిడ్–19 వైరస్ సంబంధిత పరిస్థితులు తిరిగి క్రమంగా సాధారణ స్థితికి వచ్చేస్తున్నాయని, మరిన్ని ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి ప్రారంభమవుతోందని, దీంతో సరఫరా పరంగా ఇబ్బందులు తగ్గిపోవచ్చని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్‌నాయర్ పేర్కొన్నారు. చైనా ఆర్థిక ఉద్దీపనలు ఈ ఏడాది రెండో త్రైమాసిక కాలంలో (ఏప్రిల్–జూన్) ఆర్థిక వృద్ధికి తోడ్పడతాయని మార్కెట్లు క్రమంగా అంచనాకు రావచ్చని యస్ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ అమర్ అంబానీ తెలిపారు.




**ఎఫ్‌పీఐలు బుల్లిష్...**

భారత మార్కెట్ల పట్ల విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లలో (ఎఫ్‌పీఐలు) బుల్లిష్ ధోరణి కొనసాగుతోంది. బడ్జెట్ తర్వాత వీరు పెట్టుబడులను కొనసాగిస్తూనే ఉన్నారు. ఫిబ్రవరిలో ఇప్పటి వరకు నికరంగా రూ.23,102 కోట్లను ఇన్వెస్ట్ చేశారు. ఇందులో రూ.10,750 కోట్లు ఈక్విటీల్లో, రూ.12,352 కోట్లు డెట్ విభాగంలో పెట్టుబడులు పెట్టారు. గతేడాది సెప్టెంబర్ నుంచి ఎఫ్‌పీఐలు భారత మార్కెట్లో నికర పెట్టుబడిదారులుగానే ఉన్నట్టు డేటా తెలియజేస్తోంది. అయితే సమీప భవిష్యత్తు పెట్టుబడులపై కోవిడ్–19 ప్రభావం ఉండవచ్చని అంచనా.

## భారత్‌తో వాణిజ్యం.. చైనాను దాటేసిన అమెరికా



**న్యూఢిల్లీ:** భారత్‌తో ద్వైపాక్షిక వాణిజ్యం విషయంలో చైనాను వెనక్కి నెట్టేసి అమెరికా మరింత ముందుకు వచ్చేసింది. కేంద్ర వాణిజ్య శాఖ వివరాల ప్రకారం 2018–19లో అమెరికాతో భారత ద్వైపాక్షిక వాణిజ్యం 87.95 బిలియన్ డాలర్ల స్థాయికి వృద్ధి చెందింది. అదే ఏడాది చైనాతో భారత ద్వైపాక్షిక వాణిజ్యం 87.07 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2019–20లో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు చూసుకున్నా.. అమెరికా–భారత్ మధ్య 68 బిలియన్ డాలర్ల వాణిజ్య లావాదేవీలు చోటు చేసుకున్నాయి. ఇదే కాలంలో చైనాతో వాణిజ్యం 64.96 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం. అమెరికా–భారత్ తమ వాణిజ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తుండడంతో, ఇదే పరిస్థితి ఇక ముందూ కొనసాగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ అమెరికా–భారత్ స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందానికి (ఎఫ్‌టీఏ) వస్తే అప్పుడు ఇరు దేశాల మధ్య వాణిజ్యం మరింత ఉన్నత స్థాయికి చేరుతుందని నిపుణులు భావిస్తున్నారు. మనదేశ వస్తు సేవలకు అమెరికా పెద్ద మార్కెట్‌గా ఉన్నందున ఎఫ్‌టీఏ మనకే ఎక్కువ ప్రయోజనకరమని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ పేర్కొన్నారు. 2018–19లో అమెరికాతో మన దేశానికి వాణిజ్య మిగులు 16.85 బిలియన్ డాలర్లుగా ఉండగా, చైనాతో 53.56 బిలియన్ డాలర్ల లోటు ఉండడం గమనార్హం.

## త్వరలోనే టీహెచ్‌డీసీలో డిజిన్వెస్ట్‌మెంట్



**న్యూఢిల్లీ:** డిజిన్వెస్ట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా టీహెచ్‌డీసీ ఇండియా, నార్త్ ఈస్టర్న్ ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (నీప్‌కో)లో వాటాలను మరో ప్రభుత్వ రంగ దిగ్గజం ఎన్‌టీపీసీకి ఈ ఆర్థిక సంవత్సరంలోనే విక్రయించాలని కేంద్రం భావిస్తోంది. ఈ డీల్ ద్వారా ఖజానాకు దాదాపు రూ. 10,000 కోట్లు రావొచ్చని అంచనా. 2019–20 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న రూ. 65,000 కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని సాధించేందుకు ఇది తోడ్పడగలదని సంబంధిత వర్గాలు తెలిపాయి. గతేడాది మార్చి 31 నాటికి నీప్‌కో నికర విలువ రూ. 6,301 కోట్లుగా ఉంది. అటు టీహెచ్‌డీసీఐఎల్ విలువ రూ. 9,281 కోట్లుగా ఉంది. కేంద్రానికి టీహెచ్‌డీసీఐఎల్‌లో 74.23 శాతం, నీప్‌కోలో 100 శాతం వాటాలు ఉన్నాయి.

## టెల్కోలకు ఊరటపై కేంద్రం దృష్టి

**టెలికం శాఖ అధికారుల అత్యవసర సమావేశం**

**న్యూఢిల్లీ:** ఏజీఆర్ బాకీల భారంతో సంక్షోభంలో చిక్కుకున్న టెలికం రంగానికి సత్వరం ఊరటనిచ్చే చర్యలపై కేంద్రం దృష్టి సారించింది. కేంద్ర టెలికం శాఖ, ఇతర కీలక శాఖల సీనియర్ అధికారులు ఆదివారం దీనిపై అత్యవసరంగా సమావేశమయ్యారు. దాదాపు గంటకుపైగా సాగిన సమావేశంలో నీతి ఆయోగ్, ఆర్థిక శాఖ అధికారులు కూడా పాల్గొన్నట్లు సమాచారం. టెలికం పరిశ్రమకు తోడ్పాటు అందించేందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలపైనా ఇందులో చర్చించినట్లు తెలుస్తోంది. సవరించిన స్థూల ఆదాయ (ఏజీఆర్) లెక్కల ప్రకారం లైసెన్సు ఫీజులు, స్పెక్ట్రం యూసేజీ చార్జీల కింద కేంద్రానికి టెలికం సంస్థలు సుమారు రూ. 1.47 లక్షల కోట్లు కట్టాల్సి ఉందని అంచనా. ఇందులో దాదాపు 60 శాతం పైగా భాగం ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలదే ఉంది. బాకీల చెల్లింపులో జాప్యంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో టెల్కోలు కొంత భాగాన్ని ఇప్పటికే జమ చేశాయి. అయితే, ఈ బాకీలు తమపై తీవ్ర భారం మోపుతాయని టెలికం సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై ఎయిర్‌టెల్ చీఫ్ సునీల్ మిట్టల్, వొడాఫోన్ ఇండియా చైర్మన్ కుమార



మంగళం బిర్లా.. గతవారం కేంద్ర ప్రభుత్వ వర్గాలతో ముమ్మరంగా చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో తాజాగా అత్యున్నత స్థాయి సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

**లెక్కింపు విధానం స్థిరంగా ఉండాలి: సీవోఏఐ**

ఏజీఆర్ బాకీల విషయంలో వ్యత్యాసాలు రాకుండా .. లెక్కింపు విధానం సర్కిళ్లవారీగా మారిపోకుండా స్థిరంగా ఉండేలా టెలికం శాఖ చూడాలని టెల్కోల సమాఖ్య సీవోఏఐ అభిప్రాయపడింది. ఏజీఆర్ బాకీల వసూలు కోసం టెల్కోల బ్యాంక్ గ్యారంటీలను కేంద్రం స్వాధీనం చేసుకుంటే .. అది పరిశ్రమ మనుగడకే ముప్పుగా పరిణమిస్తుందని సీవోఏఐ డైరెక్టర్ జనరల్ రాజన్ మాథ్యూస్ వ్యాఖ్యానించారు. బకాయిల లెక్కింపులో తేడాలేమైనా ఉన్నాయేమో పరిశీలించేందుకు టెలికం శాఖ ప్రతిపాదించిన 'టెస్ట్ చెక్' విధానం సాధారణంగా జరిగే ఆడిటింగ్ ప్రక్రియేనని ఆయన తెలిపారు.

## సీబీహెచ్‌ఎఫ్‌ఎల్‌లో 'సెంట్రల్ బ్యాంక్' వాటాల విక్రయం


**మర్చంట్ బ్యాంకర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం**

**ముంబై:** గృహ రుణాల వ్యాపార విభాగం సెంట్ బ్యాంక్ హోమ్ ఫైనాన్స్ (సీబీహెచ్‌ఎఫ్‌ఎల్)లో మొత్తం 64.4 శాతం వాటాల విక్రయంపై ప్రభుత్వ రంగ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కసరత్తు చేస్తోంది. ఈ ప్రక్రియ కోసం మర్చంట్ బ్యాంకర్లను ఆహ్వానిస్తూ ప్రకటన చేసింది. షార్ట్‌లిస్ట్ అయిన సంస్థలు.. సీబీహెచ్‌ఎఫ్‌ఎల్‌లో సెంట్రల్ బ్యాంక్ వాటాలకు కొనుగోలుదారును వెతికిపెట్టాల్సి ఉంటుంది. 'మా బ్యాంకు కూడా స్వయంగా గృహ రుణాలు అందిస్తోంది. కాబట్టి ప్రత్యేకంగా హౌసింగ్ ఫైనాన్స్ అనుబంధ సంస్థలోనూ కొనసాగడం అనవసరమని భావిస్తున్నాం. అందుకే సెంట్ బ్యాంక్ హోమ్ ఫైనాన్స్ నుంచి మేం వైదొలగాలని భావిస్తున్నాం' అని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ పల్లవ్ మహాపాత్ర తెలిపారు. మర్చంట్ బ్యాంకర్ల ఎంపిక పూర్తయ్యాక, వాటాల విలువు మదింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా ఎంత మేర నిధులు రాగలవన్నది అంచనా వేయడం కష్టమని పేర్కొన్నారు. అయితే, డిపాజిట్లు కూడా స్వీకరించేందుకు అనుమతులున్నందున మిగతా నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలతో పోలిస్తే సీబీహెచ్‌ఎఫ్‌ఎల్‌కు మంచి వేల్యుయేషన్ రాగలదని ఆశిస్తున్నట్లు మహాపాత్ర చెప్పారు. అటు ఇండో జాంబియా బ్యాంకులో తమకున్న 20 శాతం వాటాలను భాగస్వామ్య సంస్థలు బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడాలకు విక్రయించే ప్రతిపాదనలపై కూడా చర్చలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.




సీబీహెచ్‌ఎఫ్‌ఎల్‌లో సెంట్రల్ బ్యాంక్‌కు 64.40 శాతం వాటాలు ఉండగా, మిగతాది హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో), యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (యూటీఐ), నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ)లకు ఉన్నాయి. 2016లోనూ సీబీహెచ్‌ఎఫ్‌ఎల్‌లో వాటాలు విక్రయించేందుకు సెంట్రల్ బ్యాంక్ ప్రయత్నించినప్పటికీ కుదరలేదు. అప్పటి గణాంకాల ప్రకారం వీటి విలువ సుమారు రూ. 250 కోట్లు ఉండేదని అంచనా.

## ద్రవ్యోల్బణాన్ని ఆర్‌బీఐ ఒక్కటే కట్టడి చేయలేదు: రంగరాజన్



**న్యూఢిల్లీ:** ధరల పెరుగుదల (ద్రవ్యోల్బణం) సమస్యను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒక్కటే కట్టడి చేయలేదని మాజీ గవర్నర్ సీ రంగరాజన్ పేర్కొన్నారు. ద్రవ్యోల్బణ కట్టడిలో కీలకమైన సరఫరాలో సమస్యలను అధిగమించడంలో ప్రభుత్వానిదే కీలక పాత్ర అని ఆయన పేర్కొన్నారు. 'నూతన ద్రవ్య విధాన ఫ్రేమ్‌వర్క్ – దాని అర్థం'' అన్న చర్చాపత్రంపై ఆయన తన అభిప్రాయాలను వెలిబుచ్చుతూ, ద్రవ్యోల్బణం కట్టడిలో ఆర్‌బీఐ ద్రవ్య విధాన పరిమితుల గురించి మాట్లాడారు. రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం ఉండాలన్నది ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశం. అయితే, దీనికి 'ప్లస్ 2' లేదా 'మైనస్ 2' శాతాన్ని తగిన స్థాయిగా పరిగణనలోకి తీసుకుంటారు. కాగా ఉల్లి తదితర కూరగాయల రేట్లు ఆకాశాన్నంటడంతో రిటైల్ ద్రవ్యోల్బణం ఒక్కసారిగా 7.5 శాతాన్ని జనవరి (7.59 శాతం) దాటింది. ద్రవ్యోల్బణం కట్టడితోపాటు, వృద్ధి, ఫైనాన్షియల్ రంగం సుస్థిరత వంటి ఎన్నో బాధ్యతలను ఆర్‌బీఐ నెరవేర్చాల్సి ఉంటుందని రంగరాజన్ అభిప్రాయపడ్డం గమనార్హం.

## వేగంగా వృద్ధి చెందుతున్న రిటైల్ సంస్థల్లో రిలయన్స్

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా 2013–18 ఆర్థిక సంవత్సరాల కాలంలో వేగవంతమైన వృద్ధిని నమోదు చేసిన 50 రిటైల్ సంస్థల్లో రిలయన్స్ రిటైల్ కూడా నిలిచింది. ఈ విషయాన్ని డెలాయిట్ గ్లోబల్ పవర్స్ ఆఫ్ రిటైలింగ్ 2020 ఇండెక్స్ తెలిపింది. 2017–18 ఆర్థిక సంవత్సరం ఆదాయాల పరంగా ప్రపంచవ్యాప్తంగా 250 అగ్రగామి రిటైల్ సంస్థల్లో రిలయన్స్ 56వ స్థానంలో ఉంది. భారత్ నుంచి ఈ జాబితాలో చోటు దక్కించుకున్న సంస్థ ఇదొక్కటే కావడం గమనార్హం.




## స్టాక్ వ్యూ

| శ్రీ సిమెంట్స్ | బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్ | కొనొచ్చు |
|---|---|---|

**ప్రస్తుత ధర:** రూ.24,367 **టార్గెట్ ధర:** రూ.27,900

**ఎందుకంటే:** శ్రీ సిమెంట్స్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్ ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. విద్యుత్తు విభాగం పనితీరు అంతంతమాత్రంగానే ఉండటంతో మొత్తం ఆదాయం 2 శాతమే వృద్ధి చెంది రూ.2,848 కోట్లకు పెరిగింది. సిమెంట్ అమ్మకాలు మాత్రం 5 శాతం వృద్ధితో 6.25 మిలియన్ టన్నులకు చేరాయి. రియలైజేషన్లు ఒక్కో టన్నుకు రూ.4,508గా ఉన్నాయి. విద్యుత్తు వ్యయాలు తక్కువగా ఉండటం, రియలైజేషన్ వృద్ధి ఆరోగ్యకరంగా ఉండటంతో నిర్వహణ లాభ మార్జిన్ 4 శాతం ఎగసి 30 శాతానికి చేరింది. నిర్వహణ లాభం 20 శాతం వృద్ధితో రూ.849 కోట్లకు పెరిగింది. నిర్వహణ లాభం మంచి వృద్ధినే సాధించినప్పటికీ నికర లాభం ఫ్లాట్‌గా రూ.303 కోట్లకు చేరింది. తరుగుదల అధికంగా ఉండటం, వడ్డీ, పన్ను వ్యయాలు కూడా ఎక్కువగానే ఉండటం దీనికి కారణాలు. ఒక్కో షేర్‌కు రూ.110 డివిడెండ్‌ను ప్రకటించింది. మందగమనం నుంచి వ్యవస్థను గట్టెక్కించడానికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. మౌలిక రంగంలో పెట్టుబడులు పెంచుతోంది. ఇవన్నీ సిమెంట్ రంగ కంపెనీలకు ప్రయోజనం కలిగించేవే. భవిష్యత్తు విస్తరణ ప్రణాళికల కోసం ఇటీవలనే రూ.2,400 కోట్ల నిధులను క్యూఐపీ విధానంలో సమీకరించింది. ఆర్థిక కార్యకలాపాలు పుంజుకుంటుండటంతో విద్యుత్తు విభాగం వచ్చే ఏడాది రికవరీ కాగలదని భావిస్తున్నాం. రెండేళ్లలో ఆదాయం 12 శాతం చక్రగతి వృద్ధితో రూ.14,757 కోట్లకు పెరగగలదని అంచనా. రెండేళ్లలో నిర్వహణ లాభం రూ. 8,100 కోట్లకు మించి పెరగగలదని భావిస్తున్నాం.



| లెమన్ ట్రీ హోటల్స్ | బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్ | కొనొచ్చు |
|---|---|---|

**ప్రస్తుత ధర:** రూ.62 **టార్గెట్ ధర:** రూ.72

**ఎందుకంటే:** ఈ ఆతిథ్య రంగ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. తలసరి గది ఆదాయం (రెవ్‌పార్–రెవెన్యూ పర్ అవైలబుల్ రూమ్–మొత్తం గదులపై వచ్చిన ఆదాయాన్ని గదులు సంఖ్యతో భాగించగా వచ్చేది–హోటల్ పనితీరుకు దీనినే ప్రామాణికంగా తీసుకుంటారు) 7.5 శాతం పెరిగింది. ఫలితంగా నిర్వహణ లాభం 19 శాతం ఎగసింది. కొత్త హోటళ్ల కారణంగా ఇది ఈ స్థాయిలో పెరిగింది. ఈ క్యూ3లో ఆర్జించిన మొత్తం నిర్వహణ లాభంలో కొత్త హోటళ్ల వాటా 46 శాతం మేర ఉండటం విశేషం. ఆదాయం 39 శాతం వృద్ధితో రూ.200 కోట్లకు పెరిగింది. కీస్ హోటల్స్ కొనుగోలు సానుకూల ప్రభావం చూపించింది. మొత్తం మీద ఈ క్యూ3లో నికర లాభం 2 శాతం తగ్గి రూ.12 కోట్లకు చేరింది. రూమ్ అద్దెల ధరలను 3–10 శాతం మేర పెంచడం, కోవిడ్–19(కరోనా) వైరస్ ప్రభావంతో అంతర్జాతీయ టూరిస్టులు తమ టూర్లను రద్దు చేసినప్పటికీ, దేశీయంగా డిమాండ్ పుంజుకుంటుండటం, హైదరాబాద్‌లోని హోటళ్ల పనితీరు చెప్పుకోదగిన స్థాయిలో మెరుగుపడటం, ఇటీవలే ముంబై, పుణే, చండీగర్, ఉదయ్‌పూర్, డెహ్రాడూన్‌ల్లో ఏర్పాటు చేసిన హోటళ్లు నిలదొక్కుకోవడం, యాజమాన్య ఒప్పందాల ద్వారా గదుల సంఖ్యను పెంచుకుంటుండటం, మిడ్–ప్రైస్ హోటల్ సెగ్మెంట్లో పటిష్టంగా ఉండటం... ఇవన్నీ సానుకూలాంశాలు. రెండేళ్లలో ఆదాయం 26 శాతం, నిర్వహణ లాభం 36 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని అంచనా.



**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

## మరో 5 మెట్రో క్యాష్ అండ్ క్యారీ స్టోర్లు

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఏర్పాటు
- ప్రస్తుతం 17 పట్టణాల్లో 27 స్టోర్లు...

**న్యూఢిల్లీ:** జర్మనీకి చెందిన మెట్రో క్యాష్ అండ్ క్యారీ దేశీయంగా కార్యకలాపాలను విస్తరించనున్నట్టు ప్రకటించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ ఏడాది అదనంగా మరో 5 మెట్రో క్యాష్ అండ్ క్యారీ స్టోర్లను ప్రారంభించనున్నట్టు తెలిపింది. ఈ సంస్థకు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 17 పట్టణాల్లో 27 క్యాష్ అండ్ క్యారీ దుకాణాలున్నాయి. అలాగే, కిరాణా స్టోర్లతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడంతోపాటు, ఈకామర్స్‌లోనూ విస్తరణ బాట పట్టనున్నట్టు వెల్లడించింది. ఈ సంస్థ భారత కార్యకలాపాలపై గత రెండేళ్ల నుంచీ లాభాలను ఆర్జిస్తోంది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలో 2,000 కిరాణా స్టోర్లతో ఇప్పటి వరకు భాగస్వామ్యం కుదుర్చుకుంది. భారత్‌లో ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో విస్తరణకు భారీ అవకాశాలు ఉన్నాయని మెట్రో క్యాష్ అండ్ క్యారీ ఇండియా ఎండీ, సీఈవో అరవింద్ మెదిరట్ట తెలిపారు. కిరాణా స్టోర్ల అమ్మకాలు పెంచుకునేందుకు తాము సాయం అందిస్తామని, దాంతో ఆయా వర్తకులకు తాము ప్రాధాన్య సరఫరాదారుగా మారతామని వివరించారు.




## సెన్సెక్స్ కీలక శ్రేణి 41,420-40,610

**మార్కెట్ పంచాంగం**


కరోనావైరస్ వ్యాప్తి పట్ల మార్కెట్ శక్తుల్లో నెలకొన్న అయోమయం కారణంగా ఫైనాన్షియల్ మార్కెట్లు గతంలో ఎన్నడూ లేని కొత్త ట్రెండ్‌ను ఆవిష్కరిస్తున్నాయి. ఈక్విటీ మార్కెట్లు, బంగారం, అమెరికా బాండ్లు, డాలరు– ఈ నాలుగూ మూకుమ్మడిగా పెరగడం ఇప్పటివరకూ ఏ సంక్షోభ సమయంలోనూ, మరే సానుకూల ఆర్థిక వాతావరణంలోనూ జరగలేదు. మరోవైపు విపత్తుల సందర్భంగా ఇన్వెస్టర్లు సురక్షితంగా భావించే జపాన్ కరెన్సీ ఎన్, ఆ దేశపు బాండ్లు ఈ దఫా క్షీణించడం విశేషం. ఈ కొత్త ఫైనాన్షియల్ ట్రెండ్...స్టాక్ మార్కెట్లను ఏవైపు నడిపిస్తోందో, కొద్ది వారాలు చూస్తేగానీ అవగతం కాదు. ఇదిలా వుండగా, విదేశీ ఇన్వెస్టర్లు ఫిబ్రవరిలో ఇప్పటికే భారత్ మార్కెట్లోకి దాదాపు రూ. 23,000 కోట్లకుపైగా కుమ్మరించినందున, మార్కెట్లో డౌన్ ట్రెండ్ వచ్చే అవకాశాలు ప్రస్తుతానికి కన్పించడం లేదు. ఇక సూచీల స్వల్పకాలిక సాంకేతికాలు ఇలా వున్నాయి...

**సెన్సెక్స్ సాంకేతికాంశాలు...**




ఫిబ్రవరి 20తో ముగిసిన నాలుగురోజుల ట్రేడింగ్ వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 41,420–40,610 పాయింట్ల శ్రేణి మధ్య హెచ్చుతగ్గులకు లోనై, చివరకు అంతక్రితం వారం ముగింపుతో పోలిస్తే 88 పాయింట్ల స్వల్పనష్టంతో 41,170 పాయింట్ల వద్ద ముగిసింది. రెండు వారాలుగా 3 శాతం శ్రేణి మధ్య ఒడిదుడుకులకు గురవుతున్న సెన్సెక్స్... ఈ వారం 41,420–40,610 పాయింట్ల శ్రేణిని ఎటువైపు ఛేదిస్తే, అటువైపు వేగంగా కదలవచ్చు. ఈ వారం సెన్సెక్స్‌కు తక్షణ మద్దతు 41,040 పాయింట్ల వద్ద లభిస్తుండగా, ఈ మద్దతును కోల్పోతే 40,610 పాయింట్ల స్థాయికి తగ్గవచ్చు. ఆ లోపున ముగిస్తే వేగంగా 40,475–40,115 పాయింట్ల శ్రేణి వరకూ పతనం కొనసాగవచ్చు. ఈ వారం తొలి మద్దతుస్థాయిని పరిరక్షించుకుంటే వెనువెంటనే 41,420 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. ఈ స్థాయిపైన ముగిస్తే వేగంగా 41,700 పాయింట్ల స్థాయికి చేరవచ్చు. ఈ స్థాయిని అధిక ట్రేడింగ్ పరిమాణంతో దాటితే తదుపరి అప్‌ట్రెండ్‌సాధ్యపడి 42,000 పాయింట్ల మార్క్‌ను అందుకునే వీలుంటుంది.

**నిఫ్టీ 12,160-11,910 శ్రేణిని ఛేదిస్తేనే...**




గతవారం ఎన్ఎస్ఈ నిఫ్టీ 12,160–11,908 పాయింట్ల శ్రేణి మధ్య ఊగిసలాడి, చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 32 పాయింట్ల నష్టంతో 12,081 పాయింట్ల వద్ద ముగిసింది. గతవారపు ట్రేడింగ్ శ్రేణిని ఈ వారం నిఫ్టీ ఎటు ఛేదిస్తే, అటు వేగంగా కదలవచ్చు. నిఫ్టీకి 12,030 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తుండగా, ఈ స్థాయిని ముగింపులో కోల్పోతే 11,910 పాయింట్ల స్థాయిని తిరిగి పరీక్షించవచ్చు. ఈ స్థాయి దిగువన వేగంగా 11,780–11,750 పాయింట్ల శ్రేణి వరకూ పడిపోవొచ్చు. ఈ వారం తొలి మద్దతుస్థాయిని నిఫ్టీ పరిరక్షించుకోగలిగితే, వెంటనే 12,160 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. అటుపై క్రమేపీ 12,225 పాయింట్ల స్థాయి వరకూ పెరగవచ్చు.ఈ స్థాయిని సైతం అధిగమిస్తే 12,270–12,330 పాయింట్ల శ్రేణి వరకూ ర్యాలీ కొనసాగవచ్చు.

– పి. సత్యప్రసాద్

## కోడిగుడ్లు

(హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 24-2-2020

| | |
|---|---|
| విశాఖ | 375–00 |
| చిత్తూరు | 403–00 |
| వరంగల్ | 323–00 |
| విజయవాడ | 330–00 |
| గోదావరి | 330–00 |
| 23-2-2020 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 320–00 |

# రిటైరైన తర్వాత అధిక రిస్క్ వద్దు!




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

**నేను ఇండెక్స్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. ఇవి ఈక్విటీ ఫండ్స్‌కంటే మంచి రాబడులనే ఇవ్వగలవా? ఈ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చంటారా?** –సుచరిత, హైదరాబాద్

ఇండెక్స్ ఫండ్స్‌కు ఉండే ప్రధాన ప్రయోజనం.... వ్యయాలు తక్కువగా ఉండటం. ఇవి సూచీలను ప్రతిబింబిస్తాయి. సెన్సెక్స్ లేదా నిఫ్టీల రాబడులను మించి రాబడులను సాధించడమనేది ప్రతి ఇన్వెస్టర్ ఆశించే లక్ష్యాల్లో ప్రధానమైనది. ఈ లక్ష్యాన్ని అయితే ఇండెక్స్ ఫండ్స్‌తో సాధించలేం. ఇండెక్స్ ఫండ్స్‌కు ఉన్న ప్రధాన అవరోధం ఇదే. 2018లో గానీ, 2019లో గానీ ఏ ఫండ్ కూడా ఇండెక్స్ ఫండ్‌ను మించిన రాబడులను ఇవ్వలేకపోయాయి. అయితే ఐదేళ్లు, ఏడేళ్లు, పదేళ్ల కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే, చాలా ఫండ్స్ ఇండెక్స్ ఫండ్స్‌కు మించిన రాబడులనిచ్చాయి. సూచీల స్థాయి రాబడులు చాలు, వ్యయాలు తక్కువగా ఉండాలనుకుంటే ఇండెక్స్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు. దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయదల్చుకున్నా, ఇండెక్స్ ఫండ్స్‌ను మించి రాబడులు రావాలనుకున్నా, ఈక్విటీ ఫండ్స్‌ను ఎంచుకోవడమే మేలు.

**రిటైర్మెంట్ తర్వాత వచ్చే అవసరాల కోసం ప్రతి నెలా కొంత మొత్తం ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. ప్రీమియమ్‌ను వెనక్కి ఇచ్చే బీమా పాలసీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా రిటైర్మెంట్ అవసరాలను తీర్చుకోవచ్చా? ఇది సరైన నిర్ణయమేనా?** –సూరి, విశాఖపట్టణం

ఇది అస్సలు సరైన నిర్ణయం కాదు. బీమా వేరు. ఇన్వెస్ట్‌మెంట్ వేరు. ఈ రెండింటి అవసరాలు కూడా వేర్వేరుగా ఉన్నట్లుగానే, మదుపు కూడా విడివిడిగానే ఉండాలి. ఎప్పుడూ ఈ రెండింటిని కలపకూడదు. ప్రీమియమ్ వెనక్కి ఇచ్చే బీమా పాలసీలు ఒక విధంగా చెప్పాలంటే ఎరల్లాంటివే. బీమా అవసరాల కోసం పూర్తిగా టర్మ్ ప్లాన్‌లనే తీసుకోవాలి. టర్మ్ ప్లాన్, తగిన ఆరోగ్య పాలసీలు తీసుకుంటే ఇక వేరే బీమా ప్లాన్‌ల కోసం ఆలోచించాల్సిన పని లేదు. ఇక రిటైర్మెంట్ అవసరాల కోసం కనీసం పదేళ్ల పాటు ఇన్వెస్ట్ చేయగలిగేలా ఉంటే, ఈక్విటీ ఫండ్స్‌ను ఎంచుకోండి. ఈ ఫండ్స్‌లో నెలకు కొంత మొత్తం సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేయండి. ప్రతీ ఏడాది ఈ మొత్తాన్ని కనీసం 10 శాతమైనా పెంచండి. కనీసం రెండేళ్లకొకసారైనా మీ పోర్ట్‌ఫోలియోను సమీక్షిస్తూ ఉండండి.

**నేను ఇటీవలనే రిటైరయ్యాను. క్రమం తప్పని ఆదాయం కోసం మాలాంటి రిటైరైన వ్యక్తులకు అందుబాటులో ఉన్న ఇన్వెస్ట్‌మెంట్స్ ఆప్షన్స్ ఏంటి?** –ప్రభాకర్, విజయవాడ

రిటైరైన తర్వాత పెన్షన్ తప్ప మరో ఆదాయం ఉండదు కాబట్టి ఇన్వెస్ట్‌మెంట్స్ విషయంలో జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవాలి. క్రమం తప్పని ఆదాయం వచ్చేలా ఇన్వెస్ట్ చేయాలి. అలాంటి ఇన్వెస్ట్‌మెంట్స్ ఎంచుకోవాలి. గతంలో జీవితం సాఫీగా ఉండేది. ఇప్పుడు సంక్లిష్టంగా మారిపోయింది. గతంలో డిపాజిట్లు, బాండ్లు, సీనియర్ సిటిజెన్స్ సేవింగ్స్ స్కీమ్, లేదా ప్రజా భవిష్య నిధి(పీపీఎఫ్)ల్లో ఇన్వెస్ట్ చేస్తే, ఈ సాధనాలన్నీ ద్రవ్యోల్బణాన్ని బీట్ చేసే రాబడులనిచ్చేవి. భవిష్యత్తులో ఈ ఇన్వెస్ట్‌మెంట్స్ సాధనాలకు ఇంత సీన్ ఉంటుందనుకోవడం లేదు. వీటిపై రాబడులు ఎప్పటికప్పుడు తగ్గిపోతున్నాయి. రిటైరైన తర్వాత అధిక రిస్క్ తీసుకోకూడదు. అధిక రిస్క్ తీసుకుంటే, అధిక రాబడులు వచ్చే విషయం వాస్తవమే అయినప్పటికీ, ఒక వేళ నష్టాలు వస్తే, దానిని భరించడం కష్టసాధ్యమే. అయినప్పటికీ, రిస్క్ అధికంగా ఉండే ఈక్విటీలో కూడా ఇన్వెస్ట్ చేయాల్సిందే. రిటైరైన వాళ్లకు వేరే సంపాదన ఉండదు. ఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌పైననే ఆధారపడి ఉండాలి. అందుకని ఇన్వెస్ట్‌మెంట్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఉదాహరణకు మీకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. కోటి వచ్చాయనుకుందాం. 8 శాతం రాబడి లెక్కన నెలకు రూ.66,000 వస్తాయి. ప్రస్తుత పరిస్థితుల్లో నెల గడవడానికి ఈ మొత్తం సరిపోతుంది. కానీ ఐదేళ్ల తర్వాత? ద్రవ్యోల్బణం 10 శాతం చొప్పున లెక్కేసుకుంటే, మీకు ఇంకా ఎక్కువ మొత్తమే అవసరం. ఆదాయాన్ని ఇవ్వడంతో పాటు వృద్ధిని కూడా మీ ఇన్వెస్ట్‌మెంట్స్ సాధించాల్సి ఉంటుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బాండ్లు, డెట్ ఫండ్స్ వంటి ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలు మీ పెట్టుబడికి రక్షణ నిస్తాయే కానీ, పెద్దగా రాబడులను ఇవ్వలేవు. మీ పెట్టుబడి వృద్ధి చెందేలాగా, భవిష్యత్తు అవసరాలు తీరేలాగా మీ ఇన్వెస్ట్‌మెంట్స్ ఉండాలి. దీనికి అసెట్–అలకేషన్ విధానాన్ని అనుసరించవచ్చు. మీ మొత్తం పెట్టుబడుల్లో 30–40 శాతాన్ని ఈక్విటీలో, మిగిలింది డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు.




ముంబైలో శనివారం జరిగిన 'లివా మిస్ దివా యూనివర్స్-2020' పోటీల్లో అడిలైన్ క్యాస్టిలినో (మధ్యలో) విజేతగా నిలిచారు. మిస్ దివా సుప్రనేషనల్ కిరీటాన్ని జబల్‌పూర్‌కు చెందిన ఆవృతి చౌదరి (ఎడమ) అందుకున్నారు. పుణేకు చెందిన నేహా జైస్వాల్ (కుడి) మిస్ దివా రన్నరప్‌గా నిలిచారు. ఈ ఏడాది జరగనున్న మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరపున క్యాస్టిలినో ప్రాతినిథ్యం వహించనుండగా.. ఆవృతి మిస్ సుప్ర నేషనల్ పోటీలకు భారత పోటీదారుగా వ్యవహరించనున్నారు.

# న్యాయవ్యవస్థ కృషి అమోఘం

- 'లింగపరమైన న్యాయం'పై లక్ష్యాన్ని సాధించిందన్న రాష్ట్రపతి కోవింద్
- పర్యావరణ సమస్యలకు అంతర్జాతీయ చట్టాలు అవసరమన్న సీజేఐ
- ముగిసిన అంతర్జాతీయ న్యాయ సదస్సు

**న్యూఢిల్లీ:** లింగపరమైన న్యాయం అనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని సాధించేందుకు భారత న్యాయవ్యవస్థ చేసిన కృషి అమోఘమని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఎల్లప్పుడూ సానుకూల, ప్రగతిశీల దృక్పథంతోనే పనిచేసిందని కొనియాడారు. ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ న్యాయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆదివారం 'న్యాయవ్యవస్థ –మారుతున్న ప్రపంచం'అంశంపై రాష్ట్రపతి ప్రసంగించారు. 'లింగపరమైన న్యాయం అనే ప్రతిష్టాత్మకమైన లక్ష్యాన్ని సాధించడంలో భారత సుప్రీంకోర్టు ఎల్లప్పుడూ చురుకైన, ప్రగతిశీల దృక్పథంతోనే పనిచేసింది. పని చేసే ప్రాంతాల్లో లైంగిక వేధింపుల నుంచి మహిళలకు రక్షణ కల్పించే విశాఖ మార్గదర్శకాలు మొదలుకొని, సైన్యంలో మహిళా అధికారులకు కమాండ్ పోస్టుల్లో నియమించేందుకు ఉద్దేశించిన పర్మినెంట్ కమిషన్ ఏర్పాటు వరకు సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులు దేశాన్ని ప్రగతిశీల సామాజిక పరివర్తన దిశగా తీసుకెళ్తున్నాయి'అని పేర్కొన్నారు. 'దేశంలో భాషా వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అత్యున్నత న్యాయస్థానం తన తీర్పులను 9 ప్రాంతీయ భాషల్లో సామాన్యులకు సైతం అందుబాటులోకి తేవడం హర్షణీయం. సామాన్యులకు న్యాయాన్ని సులభతరం చేసేందుకు సుప్రీంకోర్టు కీలక సంస్కరణలను తెచ్చింది. సుప్రీంకోర్టు వెలువరించిన అత్యంత కీలకమైన తీర్పులు రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థ మరింత పటిష్టం చేశాయి. న్యాయవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతున్న వివిధ లోపాలను గుర్తించి, సరిచేయడాన్ని అత్యున్నత న్యాయస్థానం చేపట్టిన నిశ్శబ్ద విప్లవంగా చెప్పుకోవచ్చు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి మధ్య సమతూకం సాధించేందుకు సుప్రీంకోర్టు తీసుకున్న చర్యలు అనేక దేశాల దృష్టిని ఆకర్షించాయి. సమాచార సాంకేతికాభివృద్ధి కారణంగా తలెత్తిన సమాచార పరిరక్షణ, గోప్యతా హక్కు వంటి సమస్యలను న్యాయవ్యవస్థ ఎదుర్కోవాల్సి ఉంది'అని పేర్కొన్నారు. 'లింగపరమైన న్యాయం, రాజ్యాంగ విలువల రక్షణపై సమకాలీన దృక్పథాలు, మారుతున్న ప్రపంచంలో రాజ్యాంగానికి గతిశీల వ్యాఖ్యానం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి మధ్య సమన్వయం, నేటి ఇంటర్నెట్ యుగంలో గోప్యతా హక్కు రక్షణ అనే ఐదు వేర్వేరు అంశాలు ప్రపంచ న్యాయవ్యవస్థకు సవాళ్లు విసురుతున్నాయి. వీటన్నిటిలోనూ లింగపరమైన న్యాయం అనే అంశమే ప్రపంచవ్యాప్తంగా మొదటి ప్రాధాన్యంగా ఉంది. పెరుగుతున్న ప్రజాకర్షక విధానాలపై గత దశాబ్దంలో రాజ్యాంగ విలువల ప్రాతిపదికన విస్తృత చర్చ జరిగింది. ఈ పరిణామం రాజ్యాంగాల మూలాలపై మరో చర్చకు తెరలేపింది'అని తెలిపారు. ప్రపంచవేగంగా, అనూహ్యంగా ఇటీవలి కాలంలో పరిణామం చెందుతూ వస్తోంది. దీనివల్ల న్యాయవ్యవస్థ మరింత క్రియాశీలకంగా మారిందని రాష్ట్రపతి పేర్కొన్నారు. సుదీర్ఘ న్యాయ ప్రక్రియకు బదులుగా వివాద పరిష్కారానికి మధ్యవర్తిత్వం, రాజీ మార్గాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడంతోపాటు ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని తీర్పులను సత్వరం వెలువరించడంలో కోర్టులు చాలా ప్రగతిని సాధించాయని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు.



అంతర్జాతీయ న్యాయ సదస్సు ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్రపతి కోవింద్

## పర్యావరణ సమస్యలు అందరికీ ఒక్కటే: సీజేఐ

పర్యావరణ సంబంధ అంశాలకు జాతీయ, అంతర్జాతీయ అనే భేదం లేదని, వీటిని పరిష్కరించడానికి చట్టాలతో కూడిన ఒకే వ్యవస్థ అవసరమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బాబ్డే పేర్కొన్నారు. 'పర్యావరణ సమస్యలు అందరికీ ఒక్కటే. పర్యావరణ అంశాలను జాతీయ, అంతర్జాతీయ సరిహద్దులు అడ్డుకాజాలవు. భూమిపై మనిషి ఒక బీజంగా మాత్రమే కాదు, పరాన్నజీవిగా మారాడు. భూమికి ఇస్తున్న దానికంటే భూమి నుంచి మనిషి తీసుకునేదే ఎక్కువనే అభిప్రాయం ఉంది. అందుకే పర్యావరణ పరిరక్షణ విషయంలో ఒకే విధమైన అంతర్జాతీయ చట్టాలు అవసరం'అని సీజేఐ తెలిపారు. 'దేశంలోని 103 కోట్ల ప్రజల హక్కులకు జవాబుదారీగా ఉంటూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆకాంక్ష మేరకు తీర్పులను 9 ప్రాంతీయ భాషల్లో వివిధ ప్రాంతాల వారికి అందుబాటులోకి తెచ్చాం'అని తెలిపారు.


# మన జీవ వైవిధ్యం.. మానవాళికి విశిష్ట నిధి

'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** భారతదేశంలోని జీవ వైవిధ్యం ప్రపంచ మానవాళికి ఒక విశిష్టమైన నిధిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఆయన ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సృష్టిలోని అన్ని జీవరాశుల పట్ల అనురాగం, ప్రకృతి పట్ల ప్రేమ కలిగి ఉండాలని చెప్పారు. ప్రతిఏటా ప్రపంచం నలుమూలల నుంచి ఎన్నో రకాల పక్షులు భారత్‌కు వస్తున్నాయన్నారు. వలస పక్షులకు భారత్ ఇల్లులా మారిందన్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ నిర్వహించిన హునర్ హాట్ కార్యక్రమం గురించి ప్రస్తావించారు.

**భాగీరథీ అమ్మ స్ఫూర్తిదాయకం..**

ఆయన మాట్లాడుతూ.. 'లక్ష్యాలు సాధించడానికి వయసు, వైకల్యం ఎంతమాత్రం అడ్డంకులు కావు. ఏదైనా సాధించాలని సంకల్పిస్తే మనలోని విద్యార్థిని చంపకూడదు. కేరళలో భాగీరథీ అమ్మ అనే మహిళ 105 ఏళ్ల వయసులో లెవల్ 4 పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం, కామ్యా కార్తికేయన్ అనే 12 ఏళ్ల బాలిక దక్షిణ అమెరికాలోని 7,000 మీటర్ల ఎత్తయిన మౌంట్ అకోకాంగువాను అధిరోహించడం సంతోషకరం' అన్నారు. చమురు దిగుమతులపై ఆధార పడడాన్ని తగ్గించుకోవాలన్నారు. దేశీయంగా తయారు చేసిన బయో–జెట్ ఇంధనాన్ని ఇటీవల ఇండియన్ ఎయిర్‌ఫోర్సుకు చెందిన ఏఎన్–32 రవాణా విమానంలో ఉపయోగించామని. మొత్తం ఇంధనంలో 10 శాతం మనం సొంతంగా తయారు చేసిన ఇంధనమే వాడామన్నారు. రెండు ఇంజన్లలో ఇలాంటి బయో–జెట్ ఇంధనం వాడడం ఇదే మొదటిసారి అన్నారు.



## ఇరాన్‌లో భూకంపం

పొరుగు దేశం టర్కీలో 9 మంది మృతి

**ఇస్తాంబుల్:** ఇరాన్‌లో ఆదివారం 5.7 తీవ్రతతో సంభవించిన భూకంపం కారణంగా పొరుగున ఉన్న టర్కీలో తొమ్మిది మంది మృతి చెందారు. 'భూకంపం కారణంగా ముగ్గురు చిన్నారులు సహా 9 మంది మరణించారని, 37 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఇరాన్ సరిహద్దు గ్రామం హబాష్–ఎ ఒలియాకు 10 కి.మీ దూరంలో భూకంప కేంద్రం గుర్తించినట్లు యుఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. భూకంపం ఆరు కిలోమీటర్ల లోతులో ఏర్పడిందని టెహ్రాన్ విశ్వవిద్యా లయం సిస్మోలాజికల్ సెంటర్ తెలిపింది. ఇరాన్‌లో 40 మంది గాయపడ్డారు, వారిలో 17 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. 43 గ్రామాల్లో భవనాలకు కూడా నష్టం జరిగిందని తెలిపారు.

# 'సీఏఏ' వర్గాల మధ్య ఘర్షణ

ఢిల్లీలో 2 మెట్రోస్టేషన్ల మూసివేత

**న్యూఢిల్లీ/అలీగఢ్:** పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య ఈశాన్య ఢిల్లీలోని జఫ్రాబాద్‌లో ఆదివారం ఘర్షణలు చోటుచేసుకున్నాయి. మౌజ్‌పూర్‌లో రెండు సమూహాలకు చెందిన వారు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకోవడంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. భద్రత కారణాలతో మౌజ్‌పూర్, బదర్‌పూర్ మెట్రో స్టేషన్లను మూసివేశారు. 500 మందితో కూడిన బృందం శనివారం జఫ్రాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలో ధర్నా చేసింది. ఈ నేపథ్యంలోనే వారు ఆదివారం నిరసన కొనసాగించారు. ఇటు సీఏఏకు మద్దతుగా ఆదివారం స్థానిక బీజేపీ నేత కపిల్ మిశ్రా నేతృత్వంలో ఓ వర్గం మౌజ్‌పూర్‌లో ర్యాలీ ప్రారంభించింది. ఇరు వర్గాలు ఒక దగ్గరికి చేరడంతో ఘర్షణ రేగింది.

**యూపీలోనూ ఘర్షణ:** సీఏఏకు వ్యతిరేకంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ ప్రాంతంలో చేపట్టిన నిరసన కారుల ర్యాలీ హింసాత్మకంగా మారడంతో పోలీసులు బాష్పవాయువు ప్రయోగించి వారిని చెదరగొట్టారు. ఆదివారం మధ్యాహ్నం అలీగఢ్ జిల్లా కొత్వాలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అప్పర్ కోట్ ఏరియాలో నిరసనకారులు భద్రతా సిబ్బందిపై రాళ్లు రువ్వగా వారిని చెదరగొట్టేందుకు టియర్‌గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించినట్లు అధికారులు తెలిపారు. మహ్మద్ అలీ రోడ్డు ప్రాంతంలో శనివారం నుంచే కొందరు మహిళా నిరసన కారులు ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఆందోళన చేస్తున్న మహిళలను పోలీసులు రోడ్డుపై నుంచి తప్పించే క్రమంలో ఘర్షణ తలెత్తింది.



ఢిల్లీలోని జఫ్రాబాద్‌లో సీఏఏ నిరసనకారులు, మద్దతుదారులు రాళ్లు రువ్వుకుంటున్న దృశ్యం

## నేటి నుంచి కొత్త 'గ్రీన్ కార్డ్ రూల్'

**వాషింగ్టన్:** అమెరికాలో ఫుడ్ స్టాంప్స్ తదితర ప్రభుత్వ ప్రయోజనాలు పొందే చట్టబద్ధ వలసదారులకు గ్రీన్ కార్డ్ నిరాకరించేందుకు ఉద్దేశించిన నిబంధన సోమవారం నుంచి అమల్లోకి రానుంది. ఈ నిబంధన హెచ్1 బీ వీసాపై అమెరికాలో ఉంటూ, గ్రీన్ కార్డ్ కోసం ఎదురు చూస్తున్న వేలాది భారతీయులపై ప్రతికూల ప్రభావం చూపనుంది. ఈ నిబంధనపై ఇచ్చిన స్టే ఆర్డర్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం ఎత్తివేసింది. 'ఈ నిబంధనతో సంక్షేమ పథకాలు నిజంగా అవసరమైన అమెరికన్లకే అందే అవకాశం లభిస్తుంది. అమెరికా సమాజంలోకి కొత్తగా వచ్చే వారు స్వయం సమృద్ధులై ఉండాలని, పన్నులు చెల్లింపుదారులైన అమెరికన్లపై వారు ఆధారపడకూడదనే ప్రాథమిక సూత్రం అమల్లోకి వస్తుంది' అని వైట్ హౌజ్ ప్రెస్ సెక్రటరీ స్టీఫానీ గ్రిషమ్ పేర్కొన్నారు.



Authorised Dealers For Bajaj Auto Ltd.: Nalgonda SANSAI BAJAJ 9160789555, 9160888876 • Miryalguda SANSAI BAJAJ 8142929265, 9160059997. Authorised Service Centre: CHOUTUPAL9290121333, 9160008499, BHONGIR 9247023637, 9133022441,, MUNUGODE 9912996208, SURYAPET 9160966699 KODAD 9160079897, HUZURNAGAR 9666343183, HALIYA 9652950950.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com